/manamnews
www.manamnews.com

# మనం

జనం కోసం అక్షర యజ్ఞం..

కరీంనగర్
శనివారం
21-10-2023
వెల. రూ.5
• సంపుటి : 7 • సంచిక : 262
పేజీలు : 8

KARIMNAGAR | HYDERABAD | NIZAMABAD | NALGONDA | MAHABUBNAGAR | WARANGAL | KHAMMAM | AMARAVATHI | TIRUPATI | KURNOOL | ELURU | VISHAKAPATNAM | ANANTHAPURAM | KADAPA

అశ్వయుజ మాసం, శనివారం, తిథి : సప్తమి సా.09.53 వరకు, నక్షత్రం: పూర్వాషాఢ, సా:07.54 వరకు, వర్జ్యం: ఉ.03.30-05.02 వరకు, దుర్ముహూర్తం: ఉ.07.46-08.33 వరకు, రాహుకాలం: ఉ.09.07-10.34 వరకు



## పట్టాలపై నమో భారత్ పరుగులు..

అందుబాటులోకి నమో భారత్ సూపర్ ఫాస్ట్

పచ్చ జెండా ఊపి ప్రారంభించిన ప్రధాని మోడీ

టిక్కెట్ కొని రైలులో ప్రయాణించిన ప్రధాని, మంత్రులు

**లక్నో, అక్టోబర్ 20 :** దేశంలోని తొలి ర్యాపిడ్ ట్రైన్‌కి ప్రధాని నరేంద్ర మోదీ పచ్చజెండా ఊపి ప్రారంభించారు. ఢిల్లీ-ఘజియాబాద్ మీరట్ కారిడార్‌లో ఈ రైళ్లు పట్టాలపై పరుగులు పెట్టింది. ఢిల్లీ-ఘాజియాబాద్-మీరట్‌ల మధ్య రీజనల్ ర్యాపిడ్ ట్రాన్సిట్ సిస్టమ్ కారిడార్‌ను ప్రధాని మోదీ శుక్రవారం ప్రారంభించారు. నమో భారత్ అని ఈ ట్రైన్‌కి నామకరణం చేశారు. ప్రస్తుతం ఇది 17 కి.మీ.ల మేర సేవలు అందించనుండగా.. శనివారం ఇది అందుబాటులోకి వస్తుంది. దీన్ని ప్రారంభించిన అనంతరం ప్రధాని మోదీ ట్రైన్‌లో ప్రయాణించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో కాసేపు ముచ్చటించారు. ట్రైన్ శుక్రవారం సహీబాబాద్ నుంచి దుహాయి మధ్య నడిచింది. ప్రధానితోపాటు కేంద్ర మంత్రి హర్దీప్ సింగ్ పురి, యూపీ సీఎం యోగి ఆదిత్యనాథ్ ఆధ్వర్యంలో కార్యక్రమం జరిగింది. ఈ ట్రైన్‌లో కనీస టికెట్టు ధర రూ.20 ఉండగా, గరిష్ఠంగా రూ. 100 ఉండనుంది. ఢిల్లీ, హరియాణా, రాజస్థాన్, ఉత్తర్ ప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో ఆర్ఆర్టీఎస్ కారిడార్ నిర్మాణానికి ముందడుగు పడింది. ఢిల్లీ మీరట్ ..మిగతా 2లో



# బీఆర్ఎస్ హ్యాట్రిక్ విజయం ఖాయం

95 నుంచి 105 స్థానాల్లో గెలుపు పక్కా : సీఎం కేసీఆర్

అనేక అవరోధాలు అధిగమించి, పోరాటాలు చేసి తెలంగాణ సాధించుకున్నాం. మీ అందరితో మనవి చేసేది ఒక్కటే.. గజ్వేల్ అభివృద్ధి అయింది అంటే అయింత ముఖం కొడుతది.. దిష్టి కొడుతది మనకు. కావాల్సింది చాలా ఉంది.. జరగాల్సి ఇంకా ఉంది. ఎందుకంటే రాజకీయ నాయకులు ఎప్పుడు కూడా రిలాక్స్ కావొద్దు.. ఇంకేం కావాలో ఆలోచించాలి తప్ప.. అయినదాంతో సంతృప్తి పడొద్దు. సాధించిన దానితో సంతృప్తి పడి సంబురాలు చేసుకోవడం కాదు.. భవిష్యత్‌ను ఇంకా మార్గనిర్దేశనం చేసుకోవాలి. ఇంకేం చేయాలో ఆలోచించాలి. జరిగింది మీ కండ్ల ముందే ఉంది డబ్బా కొట్టుకోవాల్సిన అవసరం లేదు..

- సీఎం కేసీఆర్

వివరాలు.. 2లో

ఏం చేయాలో తెల్వని పరిస్థితి..

మన బతుకు ఇంతేనా అని బాధపడేవాళ్లం

అభివృద్ధి ఆగవద్దు అంటే మళ్లీ బీఆర్ఎస్ గెలవాలి.. గెలుస్తుంది : కేసీఆర్

కరెంట్ కష్టాలే ఉద్యమం రాజేశాయి

ఆనాటి అవమానాలు, అనుభవాలే ప్రేరేపించాలి

తల్లే దయ్యం అయినాక పిల్ల ఎట్ల బతుకుతది

కరెంట్‌తో పద్ద గోసలు అన్నీ ఇన్నీ కావు

కరెంట్ కోసం ఆనాటి సీఎంలను నిలదీసా

తెలంగాణ వచ్చాక కరెంట్ సమస్య లేకుండా చేసాం

రాష్ట్రానికే తలమానికంగా గజ్వేల్‌ను తీర్చిదిద్దుతాం

గజ్వేల్ నియోజకవర్గ నేతలతో సీఎం కేసీఆర్

## బీఆర్ఎస్‌కు ఊహించని షాక్

ఓటర్లకు గుర్తులు కూడా తెలియవంటారా?

కారును పోలిన గుర్తులపై సుప్రీం అభ్యంతరం

బిఆర్ఎస్ పిటిషన్ తోసిపుచ్చిన ధర్మాసనం






మధ్యప్రదేశ్ అభివృద్ధికి
## కట్టుబడి ఉన్నాం

రాష్ట్రాన్ని మరింత ముందుకు తీసుకెళతాం

మరోమారు అధికారం కట్టబెట్టండి

ఎంపి ప్రజలకు ప్రధాని మోడీ బహిరంగలేఖ

2

## తెలంగాణలో నియంతృత్వ పాలన

ఈ ఎన్నికలు దొరల అహంకారానికి, ప్రజల మధ్య పోటీ

కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడగానే నిజాం చక్కెర ఫ్యాక్టరీ తెరిపిస్తాం

పసుపు, వరికి మద్దతు ధర పెంచుతాం

జగిత్యాల రోడ్ షోలో రాహుల్ గాంధీ

3





సింగరేణి కార్మికులకు
## దసరా జోష్

కార్మికుల ఖాతాలో 32శాతం లాభాల వాటా చెల్లించిన సింగరేణి యాజమాన్యం

నేడు పండగ అడ్వాన్స్ చెల్లింపు

ఆదేశాలు జారీ చేసిన సింగరేణి యాజమాన్యం

దసరా బోనస్‌గా రూ. 711 కోట్లు విడుదల

ఒక్కో ఉద్యోగికి రూ.1.53 లక్షల వరకు లాభాల బోనస్

సీఎండీ శ్రీధర్ వెల్లడి

6



2

## తెలంగాణ ఎన్నికలు

రంగంలోకి 20వేల కేంద్ర బలగాలు



## మిషన్ గగన్‌యాన్..

నేడు కీలక పరీక్షకు ఇస్రో సిద్ధం!

2

## కాంగ్రెస్ గెలుపు పక్కా

కేసీఆర్ లూటీ చేసిందంతా తిరిగి ఇస్తాం: రాహుల్ గాంధీ

బీజేపీ, బీఆర్ఎస్, ఎంఐఎం ఒకటే

ఇళ్లకు 200 యూనిట్ల ఉచిత కరెంట్

రాహుల్ గాంధీ సమక్షంలో కాంగ్రెస్‌లో చేరిన ఎమ్మెల్యే రేఖానాయక్



2

## మేము బందిపోట్లు కాము



వివరాలు.. 7లో

బరాబర్ పట్టపగలు మీ ముందొచ్చాం..

విజయం సాధించి తీరుతాం

ఆత్మీయ సమ్మేళనంలో తుమ్మల వెల్లడి

## ఎట్టికైనా, మట్టికైనా మనోడే కావాలి



దొంగ రేవంత్‌రెడ్డిని నమ్మితే ఇక అంతే

తెలంగాణ ఆకాంక్షను అణిచివేసింది కాంగ్రెస్సే

రైతుబంధు, దళితబంధు కలలోనైనా ఊహించమా : మంత్రి కేటీఆర్

సొంతింటికి తిరిగి వచ్చిన నేతలు

**హైదరాబాద్, అక్టోబర్ 20 (మనం న్యూస్):** తెలంగాణ ప్రజల పట్ల ముఖ్యమంత్రి కేసీఆర్‌కు ఉండే ఆర్తి రాహుల్‌కో, మోదీకో ఉండదు.. ఎట్టికైనా, మట్టికైనా మనోడే కావాలని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మంత్రి కేటీఆర్ అన్నారు. తెలంగాణ భవన్‌లో మంత్రి కేటీఆర్ సమక్షంలో జిట్టా బాలకృష్ణారెడ్డి, మామిళ్ల రాజేందర్ బీఆర్ఎస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా కేటీఆర్ ప్రసంగించారు. నల్లగొండ జిల్లాలో అత్యధిక మెజార్టీతో గెలిచేది పైళ్ల శేఖర్ రెడ్డి అని కేటీఆర్ తెలిపారు. సొంతింటికి తిరిగి వచ్చిన జిట్టా బాలకృష్ణారెడ్డికి శుభాకాంక్షలు. దారి తప్పిన కొడుకు ఇంటికి తిరిగొచ్చినట్టుంది. ఈనగాసి నక్కల పాలు చేయొద్దని కలిసి వస్తున్నారు. రూ.50 లక్షలతో అడ్డంగా దొరికిన దొంగ రేవంత్ రెడ్డి. సోనియాగాంధీని ..మిగతా 2లో

## బీఆర్ఎస్, కాంగ్రెస్‌లు అవినీతి కవల పిల్లలు



కాంగ్రెస్‌లో గెలిచే వారంతా బిఆర్ఎస్ గూటికే

లీకుల ప్రభుత్వం బీఆర్ఎస్... అభివృద్ధి ప్రభుత్వం బీజేపీ

అధర్మ చక్రవర్తి కేసీఆర్... ధర్మ సంరక్షకుడు ప్రధాని మోదీ

జయ జయహే తెలంగాణ గీతాన్ని ఎందుకు రాష్ట్ర గీతంగా ప్రకటించలేదు

శత్రువుల కుట్రలను చీల్చుకొని గెలిచిన వాడు మీ రఘునందన్‌రావు

ఐదేళ్లు అధికారమిస్తే దుబ్బాక అభివృద్ధిలో అగ్రగామి

కేంద్ర మహిళా శిశు సంక్షేమ, మైనార్టీ శాఖ మంత్రి స్మృతి ఇరానీ

7

**మంచిమాట**

పదిమంది మనం చేసే ప్రతీ పనిని ప్రశంసించాలని ఆరాటపడటం వల్ల మనలోని బలహీనత బయటపడుతుంది

**శుభోదయం**



## పట్టాలపై నమో భారత్ పరుగులు..

(మొదటిపేజీ తరువాయి)

కారిడర్ 2025వ సంవత్సరంలో పూర్తయ్యే ఛాన్స్ ఉంది. ఈ ప్రాజెక్టు అంచనా వ్యయం రూ.30 వేల కోట్లు. నేషనల్ క్యాపిటల్ రీజియన్ ట్రాన్స్‌పోర్ట్ కార్పొరేషన్ ఆర్ఆర్టీఎస్ రైళ్లకు ర్యాపిడ్ ఎక్స్ అని పేరు పెట్టింది. ఈ ట్రైన్ గంటకు 180 కి.మీ.ల వేగంతో ప్రయాణిస్తుంది. ఈ రైళ్లను 'నమో భారత్'గా పిలుస్తామని కేంద్ర మంత్రి మంత్రి హర్దీప్ సింగ్ పూరి గతంలోనే ప్రకటించారు. ఇది అందుబాటులోకి వస్తే అత్యాధునిక టెక్నాలజీతో కూడిన మరో హైస్పీడ్ ట్రైన్ భారత రైల్వే చరిత్రలో నిలిచిపోతుందని అన్నారు. ఢిల్లీ-ఘజియాబాద్‌మీరట్ కారిడార్‌కు ప్రధాని మోదీ మార్చి 8, 2019న శంకుస్థాపన చేశారు. దేశ వ్యాప్తంగా వివిధ ప్రాంతాల మధ్య కనెక్టివిటీ పెంచడమే ఈ ప్రాజెక్టు ముఖ్య ఉద్దేశమని అధికారులు చెప్పారు. ఇండియాలో ఇప్పటికే వందే భారత్ రూపంలో ప్రభుత్వం సెమీ హై స్పీడ్ రైళ్లను నడుపుతోంది.ఈ రైళ్లకు ప్రధాని 'నమో భారత్ అనే పేరు పెట్టారు. షహీదాబాద్ నుంచి దుహాయ్ డిపోట్ వరకూ మొత్తం 80కిలోమీటర్ల దూరం ఈ ట్రైన్స్ ప్రయాణించనున్నాయి. 2019 మార్చి 8వ తేదీన ఢిల్లీఘజియాబాద్‌మీరట్ కారిడార్‌కి శంకుస్థాపన చేశారు ప్రధాని మోదీ. ఇప్పుడు ఆయనే ప్రారంభించారు. తొలి టికెట్ కొనుగోలు చేసిన ప్రధాని ట్రైన్‌లో కొంత దూరం ప్రయాణించారు. విద్యార్థులతో పాటు సిబ్బందితో కాసేపు ముచ్చటించారు. ఈ మొత్తం కారిడార్ కోసం కేంద్రం రూ.30 వేల కోట్లు ఖర్చు చేస్తోంది. ఈ రైళ్లలో ఢిల్లీ నుంచి మీరట్‌కి గంటలోపే చేరుకునే వెసులుబాటు ఉంటుంది. చూడడానికి మెట్రో రైళ్లలాగే ఉన్నప్పటికీ స్పీడ్‌లో చాలా తేడా ఉంటుంది. గంటకి 160 కిలోమీటర్ల వేగంతో దూసుకుపోతుంది. కోచ్‌లలో ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. లగేజ్ క్యారియర్స్‌తో పాటు మినీ స్క్రీన్‌లు అమర్చారు. ఢిల్లీ నుంచి మీరట్‌కి 82 కిలోమీటర్ల వేగాన్ని 60 నిముషాల్లోగానే చేరుకోవచ్చని అధికారులు వెల్లడించారు. హైస్పీడ్, హై ఫ్రీక్వెన్సీ ఫీచర్స్‌తో అందుబాటులోకి తీసుకొచ్చారు. కనీస టికెట్ ధర రూ.1520 వరకూ ఉండగా.. గరిష్ఠ ధర రూ.160గా నిర్ణయించారు. 2025 జూన్ నాటికి మిగతా రూట్‌లలోనూ పూర్తి స్థాయిలో అందుబాటులోకి తీసుకొచ్చేందుకు కేంద్రం ప్రణాళికలు సిద్ధం చేసుకుంటోంది. ఈ రైళ్లలోనే ఓవర్‌హెడ్ లగేజ్ ర్యాక్స్ ఏర్పాటు చేశారు. వైఫై కనెక్టివిటీ కూడా ఉంది. వీటితో పాటు ల్యాప్‌టాప్స్, మొబైల్స్‌కి ఛార్జింగ్ పెట్టుకునేందుకు ఛార్జింగ్ పాయింట్స్ ఇచ్చారు. ఈ ట్రైన్‌లో ప్రత్యేకంగా డీలక్స్ కార్ ఉంటుంది. ఇందులో సీట్‌లు చాలా విశాలంగా ఉంటాయి. లెగ్‌రూమ్ ఎక్కువగా ఇచ్చారు. కోట్ హ్యాంగర్స్ కూడా ఉన్నాయి.

## మిషన్ గగన్‌యాన్..

బెంగళూర్, అక్టోబర్ 20 : చంద్రయాన్-3 ప్రయోగం విజయంతో దూసుకెళ్తోన్న భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ మరో కీలక పరీక్షకు సిద్ధమైంది. ప్రతిష్ఠాత్మక గగన్‌యాన్ ప్రోగ్రామ్‌లో వినియోగించే ఫ్లైట్ టెస్ట్ వెహికల్ అబార్ట్ మిషన్-1 వాహకనౌక తొలి పరీక్షను నేడు (శనివారం) నిర్వహించనుంది. దీని ద్వారా 'క్రూ ఎస్కేప్ వ్యవస్థ' పనితీరును పరీక్షిస్తారు. ఈ వాహకనౌకకు సంబంధించిన అనుసంధాన ప్రక్రియ ఇప్పటికే పూర్తయ్యింది. అక్టోబర్ 21న ఉదయం 8 గంటలకు దీనిని నింగిలోకి తీసుకెళ్లి.. అందులోని క్రూ మాడ్యూల్ సముద్రంలో పడిపోయేలా చేస్తారు. అంతరిక్షంలోకి మానవులను తీసుకెళ్లే గగన్యాన్ మిషన్ ప్రయోగాల్లో భాగంగా ఇస్రో కీలక పరీక్షలు చేపడుతుంది. ఇందులో భాగంగా మొదటగా క్రూ మాడ్యూల్‌లోని సిబ్బంది తప్పించుకునే వ్యవస్థ పనితీరును పరీక్షి స్తోంది. మిషన్ ప్రయోగ క్రమంలో ఏదైనా వైఫల్యం తలెత్తితే దాని నుంచి సిబ్బంది సురక్షితంగా తప్పించుకునే లక్ష్యంతోనే ఈ పరీక్షను చేపడుతున్నారు. గగన్‌యాన్ మిషన్ సిద్ధమయ్యే నాటికి ఇటువంటి పరీక్షలు సుమారు 20వరకు చేయనున్నట్లు సమాచారం. ఒకే ఇంజిన్ ఉండే వాహకనౌక.. క్రూ మాడ్యూల్, క్రూ ఎస్కేప్ సిస్టమ్ను 17 కి.మీ. ఎత్తు వరకు మోసుకెళ్తుంది. అనంతరం కల్పితంగా అత్యవసర పరిస్థితిని సృష్టిస్తారు. దీనికోసం అబార్ట్ సిగ్నల్ను పంపిస్తారు. ఒకవేళ ఎస్కేప్ వ్యవస్థ సరిగ్గా పని చేస్తే.. రాకెట్ నుంచి క్రూ మాడ్యూల్ విడిపోతుంది. తర్వాత దానికున్న పారాచూట్ సాయంతో సముద్రంలో పడుతుంది. భారత నౌకాదళం సిబ్బంది దానిని ఒడ్డుకు చేరుస్తారు. ఈ ప్రయోగం మొత్తం 8.5 నిమిషాల వ్యవధిలో పూర్తికానున్నట్లు ఇస్రో అధికారులు పేర్కొన్నారు.

## తెలంగాణ ఎన్నికలు..

న్యూఢిల్లీ, అక్టోబర్ 20 : తెలంగాణలో అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో కేంద్ర హోంశాఖ కీలక నిర్ణయం తీసుకుంది. తెలంగాణకు కేంద్ర బలగాలను పంపించాలని కేంద్రం నిర్ణయం తీసుకుంది. దీంతో, రెండు రోజుల్లో రాష్ట్రానికి కేంద్ర బలగాలు రానున్నాయి. వివరాల ప్రకారం.. రాష్ట్రంలో అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో 100 కంపెనీల నుంచి 20వేల కేంద్ర బలగాలు తెలంగాణకు రానున్నాయి. రెండు రోజుల్లో బలగాలు రాష్ట్రానికి చేరుకోనున్నాయి. అయితే, కేంద్ర ఎన్నికల సంఘం సూచనల మేరకు కేంద్ర హోం శాఖ బలగాలను రాష్ట్రానికి పంపించనుంది. ఒక్కో కంపెనీలో.. అస్సాం రైఫిల్స్, బీఎస్ఎఫ్, సీఐఎస్ఎఫ్, సీఆర్పీఎఫ్, ఇండో టిబెటన్ బోర్డర్ పోలీస్, నేషనల్ సెక్యూరిటీ గార్డ్స్, సశస్త్ర సీమాబల్ వంటి బలగాలకు చెందిన 60-80 మంది వరకు సిబ్బంది ఉంటారు. ఈ క్రమంలో మొత్తం 20 వేల మందికి పైగా కేంద్ర బలగాల సిబ్బంది ఎన్నికల విధుల్లో నిమగ్నం కానున్నారు. రాష్ట్రవ్యాప్తంగా స్థానిక పోలీసులతో సమన్వయం చేసుకొని ఈ బలగాలు బందోబస్తు నిర్వహించనున్నాయి. కీలక ప్రాంతాల్లో తనిఖీ కేంద్రాల ఏర్పాటుతో పాటు సరిహద్దుల్లోనూ తాత్కాలిక కేంద్రాలను ఏర్పాటు చేసుకోనున్నాయి. ప్రధానంగా సమస్యాత్మక ప్రాంతాల్లో ఈ బృందాలు పలు విడతల్లో కవాతు జరపనున్నాయి. పోలింగ్ సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా నియంత్రించడమే లక్ష్యంగా ఈ ప్రక్రియను చేపట్టనున్నాయి. ఓటర్లలో భయాందోళనలకు తావులేకుండా చేయడంలో భాగంగా ఫ్లాగ్ మార్చ్‌ల ద్వారా భరోసా కల్పించనున్నాయి. ఈ సిబ్బంది సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల్లో ఎంపిక చేసిన కొన్నింటి వద్ద సొంతంగానే విధులు నిర్వర్తించనున్నారు. మరికొన్ని కేంద్రాల వద్ద స్థానిక పోలీసులతో కలిసి బందోబస్తులో పాల్గొంటారు. మరోవైపు పోలింగ్ సమయంలో ఆయా కేంద్రాల వద్ద ఈ బలగాల బందోబస్తు కీలకం కానుంది. పోలింగ్ ముందురోజే ఆ కేంద్రాలను తమ అధీనంలోకి తీసుకొని బందోబస్తులో నిమగ్నం కానున్నారు. అలాగే ఈవీఎంలను భద్రపరిచే కేంద్రాలు వీరి అధీనంలోనే ఉండనున్నాయి. ముందు వాటిని భద్రపరిచిన కేంద్రాల నుంచి పోలింగ్ కేంద్రాలకు తీసుకెళ్లడం.. పోలింగ్ అనంతరం తిరిగి స్ట్రాంగ్ రూం కేంద్రాలకు తరలించడం వంటి ప్రక్రియ కేంద్ర బలగాల నియంత్రణలోనే జరగనుంది. బందోబస్తు మాత్రమే కాకుండా.. డబ్బు, మద్యం వంటివాటి అక్రమ రవాణాను అరికట్టేందుకు చేపట్టే తనిఖీల్లోనూ ఈ బలగాలు నిమగ్నం కానున్నాయి.




# బీఆర్ఎస్ హ్యాట్రిక్ విజయం ఖాయం..

సిద్దిపేట, అక్టోబర్ 20 (మనం న్యూస్): అసెంబ్లీ ఎన్నికల్లో 95 నుంచి 105 స్థానాల్లో బీఆర్ఎస్ గెలుస్తుందని, ఇందులో తనకు ఎలాంటి సందేహాం లేదని ముఖ్యమంత్రి కేసీఆర్ పేర్కొన్నారు. ఎన్నికల తరువాత ఒక్కరోజు మొత్తం గజ్వేల్లోనే ఉంటూ. నియోజకవర్గ ప్రజలతో గడుపుతానని తెలిపారు. గజ్వేల్‌కు కావాల్సింది ఇంకా చాలా ఉందని, అవన్నీ చేపిస్తానని భరోసా ఇచ్చారు. అయతే కామారెడ్డిలో పోటీ చేయడానికి ఓ కారణం ఉందన్న కేసీఆర్.. ఆ కారణం ఏంటో మాత్రం వెల్లడించలేదు. గజ్వేల్ నియోజకవర్గం కార్యకర్తల విస్తృత స్థాయి సమావేశం శుక్రవారం నిర్వహించగా.. ముఖ్య అతిధిగా సీఎం కేసీఆర్ హాజరయ్యారు. ఈ సమావేశంలో మంత్రి హరీష్ రావు, ఇతర ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కేసీఆర్ మాట్లాడుతూ.. గజ్వేల్ ఊర్లలోకి మిషన్ భగీరథ నీళ్లు వస్తున్నాయని తెలిపారు. మోటర్ లేకున్నా సంపు నీళ్లు వస్తున్నాయని తెలిపారు. ఒకప్పుడు సిద్దిపేట ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు అక్కడ భయంకరమైన కరువు ఉండేనని.. అప్పుడు ఆలోచన చేసి మిడ్ మానేరు నుంచి ఎత్తైన గుట్టపైకి నీళ్లు సప్లై చేసి ఇంటింటికి నీళ్లు ఇచ్చాయని గుర్తు చేశారు. అదే నేడు తెలంగాణ వ్యాప్తంగా మిషన్ భగీరథ ద్వారా నీళ్లు ఇస్తున్నామని చెప్పారు. ఈ మేరకు రాజకీయ జీవిత మొదలు పెట్టినప్పటి నుంచి తన ప్రస్థానంలో ఎదుర్కొన్న ఆటుపోట్లను, తెలంగాణ ఉద్యమంలో అనుభవించిన కష్టాలను కార్యకర్తల సమావేశంలో పంచుకున్నారు. '24 ఏళ్ల క్రితం ఒక్కడినే బయల్దేరి వెళ్ళాను. ఆనాడు కొంత మంది మిత్రులము కూర్చొని మన బతుకు ఇంతేనా అని బాధ పడేవాళ్ళం. నిస్పృహ, నిస్సహాయత ఉండేది కానీ ఏం చేయాలో తెల్వని పరిస్థితి. ఎక్కడ చూసిన చిమ్మని చీకటి, ఎవరిని కదిలించిన మన బతుకులుబేం ఉన్నాయి అనే ఆవేదన ఉండేది. నేను 10వ తరగతి చదువుతున్న సమయంలో మన జిల్లా కేంద్రం సంగారెడ్డి. అక్కడకు పోవాలి అంటే 5, 6 గంటల సమయం పట్టేది. మంజీర నది ఎండిపోయి 800 ఫీట్ల లోతుకు బోర్ వేసిన నీళ్లు రాకపోయేవి. అప్పుడు ట్రాన్స్‌ఫార్మర్ కాలిపోతే ఒక్కో బావికి 2, 3 వేలు ఖర్చు చేసిమంచిగా చేయించే పరిస్థితి ఉండేది. నేను మంత్రిగా ఉన్న సమయంలో ఆ రోజున్న ముఖ్యమంత్రి కేబినెట్ మీటింగ్‌లో ఏం మాట్లాడుతారు అంటే.. ఇక తెలంగాణకు పెట్టబడులు రావు అని అన్నడు. అట్లెట్ల సర్.. నాకర్థం కాదు అని ప్రశ్నించాను.. తల్లే దయ్యం అయినాక పిల్ల ఎట్ల బతుకుతది అని ప్రశ్నించాను. ముఖ్యమంత్రే స్వయానా తెలంగాణకు పెట్టుబడులు రావు అని చెప్పిన తర్వాత.. పెట్టుబడులు ఎలా వస్తాయని ప్రశ్నించాను. మీ ఉద్దేశం ఏంది.. రావొద్దు అనా..? బెదిరించుడా? అని అడిగాను. ఇది పొరపాటు.. ఇలా మాట్లాడొద్దని జగడం కూడా పెట్టుకున్నాను. తెలంగాణ అంటే ఒక లెక్క, లక్ష్యం, వాయిస్, నాయకుడు లేని పరిస్థితి అని కేసీఆర్ వివరించారు. నాడు ఎన్నికలు రాగానే.. రాయలసీమ, ఉత్తరాంధ్రకు టికెట్లు ముందు ఇచ్చేవారని కేసీఆర్ గుర్తు చేశారు. తెలంగాణ దగ్గర ఉంటదనే నెపంతో లాస్ట్‌కు ఇచ్చేవారు. ఓ ఎలక్షన్ల మా నాన్న చనిపోతే నేను టికెట్ కోసం పోలేదు. అప్పుడు ముఖ్యమంత్రి ఎన్టీ రామారావు. మీ టికెట్ ఫైనల్ అయిందంట.. వచ్చి ఫారాలు తీసుకొని వెళ్లమని ఫోన్ కాల్ వచ్చిందని డీఎస్పీ వచ్చి నాకు చెప్పిండు. తెల్లారగానే హైదరాబాద్ వచ్చాను.. నాచారం స్టూడియోలో ఫారాలు ఇస్తున్నారంటే అక్కడికి వెళ్లాను. అక్కడ అందరు తెలంగాణ వారే ఉన్నారు. రాష్ట్ర స్థాయి నాయకులు, మంత్రులు, ఎమ్మెల్యేలు ఉన్నారు. దేవుడి మెట్ల వద్ద బిచ్చగాళ్ల కూర్చున్నట్టు కూర్చున్నరు. చాలా బాధ కలిగింది. ఇది ఏం పద్ధతి అని.. టెంటు వేసి నాలుగు కుర్చీలు వస్తే.. సరిపోయేది కదా అని అనుకున్నాను. సేం బిచ్చగాళ్ల సీనే కనిపిందని కేసీఆర్ తెలిపారు. ఇక మా నాన్న చనిపోవడంతో నన్ను పరామర్శించేందుకు మా ఇంటికి సాయంత్రం 22 మంది ఎమ్మెల్యేలు వచ్చారని కేసీఆర్ గుర్తు చేశారు. తెలంగాణ కోసం పోదామని చెప్పిన. అప్పుడు వారు ఉన్న ఉద్యోగాలు పోతాయి తప్ప తెలంగాణ రాదు అని నిరాశతో మాట్లాడారు. సిద్దిపేట ఎమ్మెల్యే అయి తిరుగుతున్నాను. ప్రతి ఊర్లో కరెంట్ సమస్యలపై దరఖాస్తులు వచ్చాయి. ట్రాన్స్‌ఫార్మర్ స్కీం కింద బాయికి మూడు, నాలుగు వేలు జమ చేసి లంచాలు ఇచ్చి ట్రాన్స్‌ఫార్మర్ల కోసం ఎదురు చూసే పరిస్థితి. రైతులకు సంబంధించిన 80 లక్షలు పైరవీకారుల వద్ద ఉన్నట్లు తేలింది. దాంతో అప్పుడున్న విద్యుత్ అధికారిని పిలిచి అడిగాను. కరెంట్ సమస్య పోవాలంటే, పాలసీ నిర్ణయం ముఖ్యమంత్రి స్థాయిలో జరగాలన్నారు. ట్రాన్స్‌ఫార్మర్లు పెంచాలి, తీగలు ఇవ్వాలి, కొత్త సబ్ స్టేషన్లు ఇవ్వాలి. కొంత స్లాబ్‌లు ఇస్తే.. తెలంగాణ రైతాంగం బతుకుతది అని కరెంట్ అధికారి చెప్పారు. దాంతో నేనే 27 మంది ఎమ్మెల్యేలతో సంతకాలు చేయించి, ఎన్టీ రామారావు వద్దకు పోయినా. ఆయన విద్యుత్ అధికారులతో మాట్లాడారు. స్తంభాలు పెంచుతాం, వైర్లు, ట్రాన్స్‌ఫార్మర్లు ఇస్తాం.. కానీ బిల్లులకు స్లాబ్‌లు మాత్రం ఇవ్వను అని విద్యుత్ అధికారి తాతారావు చెప్పారు. ఇక నేను మొండి పట్టు పడితే.. ఇంకో అధికారిని పిలిపించి సీఎం మాట్లాడిండు.. ఎమ్మెల్యేలు చెప్పిందే కరెక్ట్.. ఒక పరిశ్రమ అక్రమంగా తీసుకునే కరెంట్‌ను అరికట్టి స్లాబ్‌లు ఇవ్వొచ్చని సూచించారు. అలా స్లాబ్‌లు తెచ్చిందే నేనే అని కేసీఆర్ స్పష్టం చేశారు. నాడు కరెంటు బిల్లులు పెంచం అని చెప్పి చంద్రబాబు మోసం చేశారని కేసీఆర్ తెలిపారు. నేను మంత్రిగా ఉన్న టైంలో సీఎం చంద్రబాబు కేబినెట్‌లో మాట్లాడుతూ.. విద్యుత్ స్లాబ్‌ను రూ.85కు పెంచాలని చెప్పిండు. తెలంగాణ రైతులు బతకకుండా వెళ్లిపోవాల్నా.. దేశంలో ఉండకుండా వెళ్లిపోవాల్నా అని అడిగాం. గంటన్నర సేపు కేబినెట్ మీటింగ్‌లో చర్చ జరిగింది. ఒప్పుకోమని కొట్లాడితే.. ఆఖరికి రూ.35కు తెచ్చిండు. మళ్లా పెంచొద్దని కండీషన్ పెట్టాను. నేను మంత్రిగా ఉన్నాను. ఇక గజ్వేల్‌లో జరిగిన మీటింగ్‌లో చంద్రబాబుతో అదే విషయాన్ని చెప్పించాను. స్లాబ్ రూ.35 చేసినం.. ఇక పెంచమని చంద్రబాబు మాటిచ్చిండు. కానీ 1999 ఎన్నికలు కాగానే ఎవర్ని మాట్లాడినివ్వకుండా విద్యుత్ ఛార్జీలు పెంచి, ఏడాదికి 15శాతం పెరుగుతదని చెప్పాడు. నాకు కోపం వచ్చి బహిరంగ లేఖ రాశాను. చూస్తూ చూస్తూ మా ప్రజలను చంపేస్తుంటే మౌనంగా మాట్లాడకుండా ఉండలేం. మీ ప్రతిపాదన వెనక్కి తీసుకోవాలని, లేకపోతే ఈ సమైక్య రాష్ట్రంలో తెలంగాణకు న్యాయం జరగదు అని నమ్మి ప్రత్యేక రాష్ట్ర ఉద్యమానికి పోతాను అని చెప్పాను. వెనక్కి తీసుకోలేదు. రైతులు నిరసన వ్యక్తం చేసేందుకు వస్తే బషీర్‌బాగ్‌లో పట్టపగలే ఉదయం 11 గంటలకు వారిపై కాల్పులు జరిపి రైతులను బాబు పొట్టనపెట్టుకున్నాడు అని కేసీఆర్ తెలిపారు. తదనంతరం కొందరితో మాట్లాడి ఉద్యమానికి శ్రీకారం చుట్టాను అని కేసీఆర్ తెలిపారు. అనేక అవరోధాలు అధిగమించి, పోరాటాలు చేసి తెలంగాణ సాధించుకున్నాం. మీ అందరితో మనవి చేసేది ఒక్కటే.. గజ్వేల్ అభివృద్ధి అయింది అంటే అయింత ముఖం కొడుతది.. దిష్టి కొడుతది మనకు. కావాల్సింది చాలా ఉంది.. జరగాల్సి ఇంకా ఉంది. ఎందుకంటే రాజకీయ నాయకులు ఎప్పుడు కూడా రిలాక్స్ కావొద్దు. ఇంకేం కావాలో ఆలోచించాలి తప్ప.. అయినదాంతో సంతృప్తి పడొద్దు. సాధించిన దానితో సంతృప్తి పడి సంబురాలు చేసుకోవడం కాదు.. భవిష్యత్‌ను ఇంకా మార్గనిర్దేశనం చేసుకోవాలి. ఇంకేం చేయాలో ఆలోచించాలి. జరిగింది మీ కండ్ల ముందే ఉంది డబ్బా కొట్టుకోవాల్సిన అవసరం లేదు అని కేసీఆర్ పేర్కొన్నారు.

తెలంగాణ వచ్చిన రోజు చెట్టుకు ఒక్కరూ గుట్టకు ఒక్కరు అయ్యారు. మహబూబ్ నగర్‌తోపాటు మన మెదక్ జిల్లాలో కూడా అదే పరిస్థితి ఉండేది. వ్యవసాయ స్థిరీకరణ జరగాలి జరిగితే వలసలు అగుతాయని ఆలోచించాం. ఇప్పుడు వలసలు వాపసు వచ్చి అద్భుతమైన వ్యవసాయ రంగం పురోగమించింది. వీటన్నింటి నుంచి బయటకు రావాలి అంటే ఎలా అని ఆలోచించాం.ఎంతో మంది ఆర్థిక, వ్యవసాయ రంగం నిపుణులతో మాట్లాడం.అప్పుడే వ్యవసాయ స్థిరీకరణ జరిగింది. నేను ఒక్కసారే ఓడిపోయాను. అప్పుడు కూడా నేను ఓడిపోలేదు ఓడించబడ్డాను. ఆ సమయంలో ఈవీఎంలు లేవు. బ్యాలెట్ పేపర్లు ఉండే. కేవలం ఆరు ఓట్లతో ఓడించారు. గజ్వేల్ బిడ్డలు నన్ను కడుపులో పెట్టుకొని గెలిపించారు. అయితే గజ్వేల్‌కు కొంత చేశాం ఇంకా చేయాలి. కరోనాతో కొంత ఆర్థిక ఇబ్బందులు వచ్చాయి. రాష్ట్రంలో కొంత అభివృద్ధి కార్యక్రమాలు నెమ్మదించాయి. నాకు కూడా కరోనా వచ్చింది. పదవులు వస్తాయి పోతాయి ఉన్నప్పుడు ఎం చేశారు అనేది ముఖ్యం. రైతాంగం పంటలు పండించాలి. భూములు పోయిన భాధ చాలా పెద్దది. నాకు కూడా భాధ ఉంది. నా కూడా భూమి పోయింది. మా అత్తగారి ఊర్లో నా అత్తగారి భూమి, నా ఊర్లో భూమి కూడా పోయింది. మీరు ఇవాళ కొండపోచమ్మ సాగర్, మల్లన్న సాగర్ కింద భూములు కోల్పోయారు. మీకు ఇవాళ యావత్ రైతాంగం ఋణపడి ఉంటుంది.

### తెలంగాణలో భూగర్భ జలాలు పెరిగాయి

ఇండియాలో భూగర్భ జలాలు తగ్గిపోతే తెలంగాణలో మాత్రం భూగర్భ జలాలు పెరిగాయి ఇవన్నీ కూడా కాళేశ్వరం ప్రాజెక్టు, కొండపోచమ్మ, మల్లన్న సాగర్ తోనే సాధ్యం అయింది.మొదటి దశలో ప్రాజెక్టు కట్టుకున్నాం.అయిన కాంగ్రెస్ వాళ్లు ,కోదండరాం లాంటి వాళ్ళు అడ్డుకున్నారు. రెండో దశలో మరింత అభివృద్ధి చేసుకోవాలి. రెండో దశలో ప్రతి గ్రామానికి నీళ్లు ఇచ్చుకుందాం. గజ్వేల్‌లో 65 టీఎంసీల నీరు నిల్వ ఉండేలా ప్రాజెక్టులు నిర్మాణం చేసుకున్నాము. మనం గెలుచుడు కాదు పక్కన ఉన్న 3 నియోజకవర్గాలను గెలిపించాలని కోరుతున్నా. అభివృద్ధి అగవద్దు అంటే మళ్ళీ బీఆర్ఎస్ గెలవాలి. గెలుస్తుంది.' అని కేసీఆర్ వ్యాఖ్యానించారు.



### చంద్రబాబు మోసం చేశారు

ఆనాడు కరెంటు బిల్లు పెంచమని చెప్పి చంద్రబాబు మోసం చేశారు.. ఇక లాభం లేదని చూస్తూ చూస్తూ ఊరుకునేది లేదని తెలంగాణ ఉద్యమానికి శ్రీకారం చుట్టాను. కొంతమందితో కలిసి ఉద్యమాన్ని శ్రీకారం చేస్తూ ముందుకు వచ్చా. నాతో ఎవరు కలిసి రాలేదు. నేను వస్తే కూడా జాకున్నారు. చివరికి తెలంగాణ సాధించుకున్నాం.

# మధ్యప్రదేశ్ అభివృద్ధికి కట్టుబడి ఉన్నాం

భోపాల్, అక్టోబర్ 20 : మరోమారు బిజెపికి అధికారం కట్టబెట్టాలని ప్రధాని మోడీ మధ్యప్రదేశ్ ఓటర్లను కోరారు. అభివృద్ధిని ముందుకు తీసుకుని వెళ్లేందుకు బలం చేకూర్చాలన్నారు. ఈ మేరకు మోడీ ప్రజలకు బహిరంగ లేఖ రాశారు. ప్రజలు ఇచ్చిన బలమైన తీర్పుతోనే అస్వస్థతతో కూడిన రాష్ట్రాన్ని అభివృద్ధి వైపు నడిపామని, సమర్థవంతమైన నాయకత్వం వల్లే ఇది సాధ్యమైందన్నారు. బీజేపీ మరోసారి పటిష్ట ప్రభుత్వం ఏర్పాటు చేసేందుకు వీలుగా ప్రజలు ఇదే నమ్మకాన్ని కనబరుస్తారన్న ఆశాభావాన్ని మోదీ వ్యక్తం చేశారు. సీఎం శివరాజ్ చౌహాన్ సాధించిన విజయాలను ప్రధాని ప్రశంసిస్తూనే, మోదీ పేరు చూసి ఓటువేయాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు.మధ్యప్రదేశ్ ఎన్నికల్లో ఓటరు తీర్పుపై ఎన్నికలు దగ్గర పడుతున్న కొద్దీ ఉత్కంఠ పెరుగుతోంది. గెలుపు కోసం అందివచ్చిన ఏ అవకాశాన్నీ ప్రధాన పార్టీలు వదులుకోకపోవడం లేదు. మధ్యప్రదేశ్‌లో గెలుపు ద్వారా రాబోయే లోక్‌సభ ఎన్నికల్లో గట్టి పట్టు సాధించాలని ప్రధాని నరేంద్ర మోదీ పట్టుదలగా ఉన్నారు. ఇందులో భాగంగా మధ్యప్రదేశ్ ఓటర్లకు ప్రధాని ఒక బహిరంగ లేఖ రాశారు. ఒకవైపు ముఖ్యమంత్రి శివరాజ్ సింగ్‌ను ప్రశంసిస్తూనే, తన పేరు మీద ఓటు వేయాలని ఓటర్లను ఆ లేఖలో ప్రధాని కోరారు. దీంతో సీఎంను ప్రశంసించడం, పీఎంను చూసి ఓటేయమనడంలో మోదీ ఆంతర్యం ఏమై ఉండవచ్చనే విషయంపై రాజకీయ పండితులు విశ్లేషణలో పడ్డారు. మోదీ తన లేఖలో మధ్యప్రదేశ్ రాష్ట్రంపై తనకున్న అనుబంధాన్ని ప్రధానంగా ప్రస్తావించారు. 2014, 2019 ఎన్నికల్లో రాష్ట్ర ప్రజలు తనపై ఉంచిన నమ్మకాన్ని మరిచిపోలేనన్నారు. మధ్యప్రదేశ్ రాజకీయ చరిత్రను ఒకసారి చూస్తే, గత రెండు దశాబ్దాల్లో అనేక ట్విస్టులు, మలుపులు కనిపిస్తాయి. రాష్ట్రాన్ని 15 ఏళ్లుగా పాలించిన కాంగ్రెస్ నుంచి బీజేపీ అధికారం దక్కించుకోవడంతో అప్పట్లో ఉమాభారతి సీఎంగా పగ్గాలు చేపట్టారు. అయితే లీగల్ చిక్కులు ఎదురవుతుండతో ఆమె పదవి నుంచి దిగిపోయారు. ఆసక్తికరంగా 2005లో శివరాజ్ సింగ్ చౌహాన్ సీఎం అయ్యారు. ప్రజల నాడి పట్టుకోవడంలో సమర్థుడైన శివరాజ్ సింగ్ గట్టి సీఎంగా నిలదొక్కుకున్నారు. ప్రజలంతా ఆప్యాయంగా 'మామా' అనే పిలిచేంత దగ్గరయ్యారు. 2008, 2013 అసెంబ్లీ ఎన్నికల్లో తిరిగి బీజేపీ విజయాలు సాధించింది. 2018లో మెజారిటీ కంటే ఒకింత ఎక్కువ సీట్లు కాంగ్రెస్ సాధించడంతో అధికారంలోకి వచ్చింది. అయితే, రాజకీయ పరిణామాల నేపథ్యంలో బీజేపీ తిరిగి అధికారంలోకి వచ్చింది. శివరాజ్ సీఎంగా మరోసారి పగ్గాలు చేపట్టారు. అయితే ఈసారి మాత్రం శివరాజ్‌కు సొంత పార్టీ నుంచే గట్టి పోటీదారులు కనిపిస్తున్నారు. నరేంద్ర సింగ్ తోమర్, జ్యోతిరాదిత్య సింధియా, నరోత్తమ్ మిశ్రా వంటి దిగ్గజ నేతలు తమ ఉనికిని బలంగా చాటుకుంటున్నారు. ఈ క్రమంలో శివరాజ్‌కు ఎలాంటి ప్రాధాన్యం ఉండబోతోందనే ఊహాగానాలు కూడా గత కొంతకాలంగా వినిపిస్తున్నాయి. శివరాజ్‌ను బహిరంగ ప్రదర్శనల్లో మోదీ ప్రశంసించిన సందర్భాలు కూడా ఇటీవల అంతగా లేవనే చెబుతున్నారు. ఈ నేపథ్యంలో మోదీ లేఖ మరిన్ని ఊహాగానాలకు తావిస్తోంది. శివరాజ్‌ను ప్రశంసిస్తూనే, తన పేరు చూసి ఓటేయమని మోదీ కోరడంలో ఆంతర్యం ఏమిటనేది దానిపై ప్రస్తుతం విశ్లేషణలు జరుగుతున్నాయి. మధ్యప్రదేశ్ ఎన్నికల తర్వాత శివరాజ్ సింగ్ సీఎంగా ఉంటారా లేక తప్పిస్తారా అన్న సందేహాలు వ్యక్తమవుతున్నాయి.

# ఎట్టికైనా, మట్టికైనా మనోడే కావాలి

(మొదటిపేజీ తరువాయి)

బలి దేవత అన్నది రేవంత్ రెడ్డి కాదా అని ప్రశ్నించారు. ఉద్యమంలో బిడ్డలు అమరులు కావడానికి కాంగ్రెస్ కారణం. సోనియమ్మ దయతలచి తెలంగాణ ఇచ్చిందని కాంగ్రెస్ నేతలు అంటున్నారు. టీఆర్ఎస్ లేకుంటే టీ పీసీసీ, టీ బీజేపీ ఉండేవా? అని కేటీఆర్ ప్రశ్నించారు. కాంగ్రెస్, బీజేపీ జాతీయ నేతలు అజ్ఞానంతో మాట్లాడుతున్నారని కేటీఆర్ మండిపడ్డారు. తాము ఎవరికీ ఏ టీం, బీ టీం కాదు.. తెలంగాణ ప్రజల టీం అని స్పష్టం చేశారు. రాహుల్ గాంధీని ముద్దపప్పు అన్నది రేవంత్ రెడ్డే. రేవంత్ అవసరానికి కండువా మార్చుకుంటే తామంతా మారాలా..? తెలంగాణ ఆకాంక్షలను మొదటి నుంచి అణిచివేసింది కాంగ్రెస్సే. బీసీ జన గణన చేయాలని అడిగితే మోదీ పెడచెవిన పెట్టారు. తెలంగాణ ప్రజల్ని గుజరాతీ విముక్తి చేస్తాడని మోదీ అన్నారు. తెలంగాణలో తాము ఏం చేయలేదని ఓడిస్తారు..? సాగు, తాగునీరు, రైతుబంధు, రైతుబీమా, కళ్యాణలక్ష్మి ఇస్తున్నామన్నారు. అన్నిరంగాల్లో దేశంలోనే అగ్రగామిగా ఉన్నాం. అన్ని కులవృత్తుల వారిని అభివృద్ధి చేస్తున్నాం. తెలంగాణలో ప్రజలంతా అన్నదమ్ముల్లా కలిసి మెలిసి జీవిస్తున్నాం. ముదిరాజ్ బిడ్డలకు గౌరవం ఇచ్చింది సీఎం కేసీఆర్. కేసీఆర్ ఏకు మేకు అయితడని కాంగ్రెస్, బీజేపీకి భయం పట్టుకుంది. కాంగ్రెస్‌కు ఐదారుగురు ముఖ్యమంత్రులు దొరికినా, ఓటర్లు దొరకడం లేదు. మళ్లీ కేసీఆరే సీఎం అయితడని కేటీఆర్ స్పష్టం చేశారు.

# కాంగ్రెస్ గెలుపు పక్కా

నిజామాబాద్, అక్టోబర్ 20 (మనం న్యూస్): సామాజిక తెలంగాణ కోరుకొని సోనియాగాంధీ రాష్ట్రాన్ని ఇచ్చారని కాంగ్రెస్ ఎంపీ రాహుల్ గాంధీ పేర్కొన్నారు. సోనియా మద్దతు ఇవ్వకపోతే తెలంగాణ వచ్చేది కాదని అన్నారు. కానీ తెలంగాణ ఒకే కుటుంబం చేతిలో బందీ అయ్యిందని విమర్శించారు. ఈ మేరకు నిజామాబాద్ జిల్లా ఆర్మూర్ కార్నర్ మీటింగ్‌లో రాహుల్ మాట్లాడారు. ప్రధాని మాటలకు విలువ లేదని అన్నారు. ఆర్మూర్ ప్రాంతంలో పసుపు విషయంలో ప్రధాని మోదీ సహా బీజేపీ నేతలు అబద్ధపు హామీ ఇచ్చారని మండిపడ్డారు. నాలుగున్నరెళ్ళ కిందట పసుపు బోర్డు ఇస్తామని చెప్పి కాలయాపన చేశారని ధ్వజమెత్తారు. పసుపు పంటకు రూ. 12 నుంచి 15 వేలు మద్దతు ధర ఇస్తామని తెలిపారు. పసుపు రైతులతో పాటు అన్ని పంటలకు ఎమ్ఎస్పీతో పాటు రూ. 500 బోనస్ ఇస్తామని రాహుల్ పేర్కొన్నారు. తెలంగాణలో కాంగ్రెస్ బీఆర్ఎస్ మధ్య ఎన్నికలు జరుగుతున్నాయని తెలిపారు. బీజేపీ, బీఆర్ఎస్, ఎంఐఎం ఒకటేనని విమర్శించారు. తెలంగాణ బీఆర్ఎస్ బీజేపీ.. కేంద్రంలో బీజేపీకి బీఆర్ఎస్ మద్దతు పలుకుతుందని దుయ్యబటారు. తన మీద 24 కేసులు ఉన్నాయన్న రాహుల్.. కేసీఆర్ మీద ఎన్ని కేసులు ఉన్నాయని ప్రశ్నించారు. సీఎం కేసీఆర్ మీద సీబీఐ, ఈడీ, ఐటీ కేసులు, చర్యలు ఉండవని అన్నారు. దేశంలోనే అవినీతి సీఎం కేసీఆరేనని మండిపడ్డారు. కాంగ్రెస్‌ను ఓడించేందుకు బీజేపీని గెలిపించేందుకు ఎంఐఎం రాష్ట్రాల్లో తమ అభ్యర్థులను నిలబెడతారని రాహుల్ గాంధీ విమర్శలు గుప్పించారు. బీజేపీ ఎక్కడెక్కడ పోటీ చేయాలని చెబితే అక్కడ ఎంఐఎం ఉంటుందని మండిపడ్డారు. తెలంగాణ సహా ఆయా రాష్ట్రాలలో కాంగ్రెస్ గెలుస్తుందనే ధీమా వ్యక్తం చేశారు.


### ఇళ్లకు 200 యూనిట్ల ఉచిత కరెంట్

నాకు ఇల్లు లేదు. దేశమే నా ఇల్లు. మా కుటుంబానికి ఏ అవసరం వచ్చినా తెలంగాణ ప్రజలు అండగా ఉన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి రాగానే ఇళ్లకు 200 యూనిట్ల ఉచిత కరెంట్ ఇస్తాం. కాంగ్రెస్ ప్రభుత్వంలో రూ. 500కే గ్యాస్ సిలిండర్ ఇస్తాం. మహిళలకు నెలకు రూ.2500 ఇస్తాం. పెన్షన్ రూ. 4 వేలు ఇస్తాం. రైతు కూలీలకు ఏడాదికి రూ. 12 వేలు ఇస్తాం. కేసీఆర్ ఎంత లూటీ చేస్తున్నారో అంతా తిరిగి ఇస్తాం' అంటూ రాహుల్ కేసీఆర్ సర్కార్పై నిప్పులు చెరిగారు.

### రోడ్డు మార్గాన హైదరాబాద్‌కు..

సభ అనంతరం ఆర్మూర్ నుంచి రోడ్డు మార్గంలోనే రాహుల్ హైదరాబాద్ బయల్దేరారు. హైలికాప్టర్ రద్దు కావడంతో రోడ్డు మార్గంలో నేరుగా శంషాబాద్ వెళ్తున్నారు. అక్కడి నుంచి ఢిల్లీ వెళ్లనున్నారు. దీంతో తెలంగాణలో రాహుల్ గాంధీ విజయభేరీ తొలి విడత బస్ యాత్ర ముగిసింది. ఈనెల 18న రామప్ప దేవాలయంలో ప్రత్యేక పూజలు చేసి రాహుల్, ప్రియాంక యాత్ర ప్రారంభించారు. ములుగు నియోజక వర్గం నుంచి ఆర్మూర్ వరకుమూడు రోజుల యాత్ర సాగింది. ములుగు, భూపాలపల్లి, మంథని, పెద్దపల్లి, కరీంనగర్, జగిత్యాల, చొప్పదండి, ఆర్మూర్ నియోజక వర్గాలలో కొనసాగింది.

### కాంగ్రెస్‌లో చేరిన రేఖా నాయక్



ఆర్మూర్ సభలో రాహుల్ గాంధీ సమక్షంలో ఖానాపూర్ బీఆర్ఎస్ ఎమ్మెల్యే రేఖా నాయక్ కాంగ్రెస్‌లో చేరారు. సిట్టింగ్‌ను కాదని ఖానాపూర్ బీఆర్ఎస్ ఎమ్మెల్యే టికెట్‌ను జాన్సన్ నాయక్ కేటాయించడంతో అసంతృప్తి చెందిన ఎమ్మెల్యే రేఖా నాయక్ ఇటీవల ఆ పార్టీకి రాజీనామా చేసిన విషయం తెలిసిందే.

## కాంగ్రెస్ పార్టీలోకి భారీగా చేరికలు



గోదావరిఖని, అక్టోబర్ 20, (మనం న్యూస్): రామగుండం నియోజకవర్గం ఇస్సంపేట గ్రామానికి చెందిన పలువురు శుక్రవారం డిసిసి అధ్యక్షులు, రామగుండం నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి మక్కాన్ సింగ్ రాజ్ ఠాకూర్ సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. అలాగే మాజీ ఎమ్మెల్యే మాలేం మల్లేశం కొడుకు మాలేం మధు మక్కాన్ సింగ్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా మక్కాన్సింగ్ వారిని పార్టీ కండువ కప్పి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో బరిపటి సాంబయ్య, చుక్కయ్య, బరిపాటి కిషన్, బరిపాటి రవి, బియ్యల కొండపాటి, శ్రావణ్, చంద్రామోహన్ , కందుల లడ్డు, నలువల రవి, బియ్యాల మల్లేష్, తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా దుర్గా భవానీ నవరాత్రోత్సవాలు

- సరస్వతీ అలంకరణలో అమ్మవారు



కరీంనగర్, అక్టోబర్ 20, (మనం న్యూస్) : కరీంనగర్ మండలం నగునూర్‌లోని శ్రీదుర్గా భవానీ ఆలయంలో దుర్గామాత నవరాత్రులు వైభవంగా జరుగుతు న్నాయి. ఐదవరోజైనా శుక్రవారం అమ్మవారు సరస్వతీ అలంకరణలో హంస వాహనంపై భక్తులకు దర్శన మిచ్చారు. ఆలయ ధర్మాధికారి పురాణం మహేశ్వర శర్మ ఆధ్వర్యంలో ఆలయ ప్రధానార్చకులు పవ నకృష్ణ శర్మ అమ్మవారికి ప్రత్యేక హారతులిచ్చి పూజలు నిర్వహించారు. చతుషష్ఠ్యుపచార పూజ, చండీహోమం, కుంకుమ పూజలు, కన్యాసువాసినీ పూజలు జరిగాయి. భక్తులు అమ్మవారిని దర్శించుకు ని చీరేసారే పెట్టి ఒడిబియ్యం పోసి మొక్కులు చెల్లించుకున్నారు. ఈ పూజల్లో ఆలయ ఫౌండర్ చైర్మెన్ వంగల లక్ష్మన్, ఆలయ కమిటి బాధ్యులు, భక్తులు పాల్గొన్నారు.

## దేవి నవరాత్రి ఉత్సవాల్లో పాల్గొన్న మందమర్రి ఏరియా జిఎం



బెల్లంపల్లి, అక్టోబర్ 20, (మనం న్యూస్): పట్టణంలోని శాంతిఖని గనిలో కొలువుదీరిన దుర్గాదేవి అమ్మవారిని మందమర్రి ఏరియా జిఎం మనోహర్ దంపతులు దర్శించుకున్నారు. అనంతరం గని ఆవరణలో జరిగిన అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో జిఎం సేఫ్టీ బెల్లంపల్లి రీజియన్ కెహెచ్ఎన్. గుప్తా, ప్రాజెక్టు అధికారి విజయప్రసాద్, గ్రూప్ ఇంజనీర్ బసవరాజు, మేనేజర్ సంజయ్ కుమార్ సిన్హా, రక్షణ అధికారి పి. రాజు, పిట్ ఇంజనీర్ రాంబాబు, గని అధికారులు, యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

## దోశ వేసి.. వడ్డించి

- జగిత్యాల పర్యటనలో రాహుల్ గాంధీ



జగిత్యాల, అక్టోబర్ 20, (మనం న్యూస్): కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ స్వయంగా దోశ వేసి టిపిసిసి అధ్యక్షులు రేవంత్ రెడ్డితో పాటు పలువురు నాయకులకు వడ్డించి, ఆయన కూడా ఆరగించారు. రాహుల్ గాంధీ పర్యటనలో భాగంగా శుక్రవారం కరీంనగర్ నుండి జగిత్యాలకు బస్సులో వస్తూ మధ్యలో మల్యాల క్రాస్ రోడ్డు వద్ద మొబైల్ టిఫిన్ సెంటర్ వద్ద ఆగారు. ఈ సందర్భంగా స్వయంగా నాలుగు దోశలు వేసి నాయకులతో పాటు ఆరగించారు. ఈ సందర్భంగా టిఫిన్ సెంటర్ నిర్వాహకునితో కాసేపు ముచ్చటించారు. అనంతరం మార్గ మధ్యంలో కల్లు గీత కార్మికుల కనపడటంతో రాహుల్ బస్సు ఆపి వారి వద్దకు వెళ్లారు. వారితో కొంత సేపు మాట్లాడి కష్టసుఖాలను ఆడిగి తెలుసుకున్నారు.

## దాసరి మనోహర్‌రెడ్డిని భారీ మోజార్టీతో గెలిపించాలి



పెద్దపల్లి, అక్టోబర్ 20, (మనం ప్రతినిధి): పెద్దపల్లి ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డిని మూడోసారి భారీ మోజార్టీతో గెలిపించాలని కోరుతూ బీఆర్ఎస్ నాయకులు కడారి కొమురేష్, ఉపసర్పంచ్ ఊరడి లక్ష్మయ్య, మాజీ ఎంపీటీసీ గుర్రాల వీరేశంలు కోరారు. పెద్దపల్లి మండలంలోని బోంపల్లి గ్రామంలో బీఆర్ఎస్ అభ్యర్తికి మద్దతుగా శుక్రవారం ఇంటింటికి ప్రచారం చేశారు. రెండు పర్యాయాలు గెలుపొందిన ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి చేసిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను గుర్తించి మరోమారు భారీ మోజార్టీతో గెలిపించాలని ప్రజలను కోరారు. ఈకార్యక్రమంలో మాజీ సర్పంచ్ అరికిల్ల అంజయ్య, ఉప సర్పంచ్ బండారి భూమయ్య, నాయకులు సంటి హరీష్, ఎర్రోళ్ల లింగయ్య, వార్డు మెంబర్స్ తదితరులు పాల్గొన్నారు.

# ఎన్నికల ప్రక్రియపై అధికారులు సంపూర్ణ అవగాహన కలిగి ఉండాలి

- ఎన్నికల శిక్షణా తరగతులను పూర్తిస్థాయిలో సద్వినియోగం చేసుకోవాలి
- జిల్లా కలెక్టర్, ఎన్నికల అధకారి ముజమ్మిల్‌ఖాన్






పెద్దపల్లి, అక్టోబర్ 20, (మనం ప్రతినిధి): జిల్లాలోఅసెంబ్లీ ఎన్నికలను పారదర్శకంగా నిర్వహించేందుకు అధికారులు ఎన్నికల ప్రక్రియ, ఎన్నికల కమీషన్ మార్గదర్శకాలపై సంపూర్ణ అవగాహన కలిగి ఉండాలని కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి ముజమ్మిల్ ఖాన్ అన్నారు. పోలింగ్ రోజు పోలింగ్ కేంద్రాలలో ప్రీసైడింగ్, సహాయ ప్రిసైడింగ్ అధికారులు చేయవలసిన విధులపై శుక్రవారం సమీకృత జిల్లా కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో నిర్వహించిన ఒక రోజు శిక్షణా కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్, జిల్లా అదనపు కలెక్టర్లు అరుణశ్రీ, శ్యాంప్రసాద్‌లతో కలిసి పాల్గొన్నారు. ఈసందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఎన్నికల ప్రక్రియ, ఎన్నికల కమీషన్ నిర్దేశించిన నియమ, నిబంధనలపై అధికారులకు సంపూర్ణ అవగాహన ఉండటం చాలా కీలకమని, ముఖ్యమైన నిబంధనల పట్ల అవగాహన కలిగి ఉంటే నమ్మకంతో పారదర్శకంగా ఎన్నికల ప్రక్రియ సజావుగా నిర్వహించవచ్చని కలెక్టర్ అన్నారు. పోలింగ్ జరిగే సమయంలో పోలింగ్ కేంద్రాలలో పాటించాల్సిన నిబంధనలు, కంట్రోల్ యూనిట్, బ్యాలెట్ యూనిట్, వివిప్యాట్ మధ్యలో కనెక్షన్, ఓటింగ్ కంపార్ట్మెంట్ రూపొందించడం, ఓటరు గోప్యంగా తన ఓటు హక్కు వినియోగించేందుకు అవకాశం ఉంటుందని అన్నారు. గత ఎన్నికల సమయంలో ఎదురైన సమస్యలు, అనుభవాలను దృష్టిలో ఉంచుకొని అవి పునవావృతం కాకుండా వాటి నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్త చర్యలపై చర్చించాలని, ఎన్నికల సమయంలో ఎన్నికల కమీషన్ నూతన సూచనలు ఆదేశాలు జారీ చేస్తుందని వాటిని పాటించేందుకు తీసుకోవాల్సిన చర్యలపై అవగాహన పెంచుకోవాలని కలెక్టర్ పేర్కొన్నారు. అదనపు కలెక్టర్ అరుణశ్రీ మాట్లాడుతూ ప్రణాళిక బద్దంగా ఎన్నికలు నిర్వహించుట కోసం ఎన్నికల కమీషన్ సూచించిన మార్గదర్శకాలపై అవగాహన కల్పించుకొని వాటికి అనుగుణంగా ముందస్తు ఏర్పాట్లు చేసుకోవాలని తెలిపారు. అదనపు కలెక్టర్ శ్యాంప్రసాద్‌లాల్ మాట్లాడుతూ నిబంధనల మేరకు, నిష్పక్షపాతంగా విధులు నిర్వహించాల్సి ఉంటుందని, పోలింగ్ కేంద్రం పరిధిలో వంద మీటర్ల పరిధిలో రెండు రోజుల వరకు ప్రిసైడింగ్ అధికారికి జ్యుడీషియల్ హక్కులు ఉంటాయని, సజావుగా, ప్రశాంతంగా ఎన్నికలు జరిగేందుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకోవాలని, ఎన్నికల కమీషన్ నిబంధనలు తూచా తప్పకుండా పాటించాలని, వాటిపై అవగాహన పెంచుకోవాలని అన్నారు. అనంతరం మాస్టర్ ట్రైనర్ మధు, హరీ ప్రసాద్, జాకీర్ హుస్సేన్‌ల ద్వారా ఎన్నికల నిర్వహణ ప్రక్రియను సంపూర్ణ అవగాహన కల్పించారు. ఈకార్యక్రమంలో రెవెన్యూ డివిజన్ అధికారి మధుమోహన్, తహశీల్దార్లు, సెక్టార్ అధికారులు, ప్రిసైడింగ్ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# తెలంగాణలో నియంతృత్వ పాలన

- ఈ ఎన్నికలు దొరల అహంకారానికి, ప్రజల మధ్య పోటీ
- కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడగానే నిజాం చక్కెర ఫ్యాక్టరీ తెరిపిస్తాం
- పసుపు, వరికి మద్దతు ధర పెంచుతాం
- జగిత్యాల రోడ్ షో లో రాహుల్ గాంధీ



జగిత్యాల, అక్టోబర్ 20, (మనం న్యూస్): తెలంగాణ రాష్ట్రంలో నియంతృత్వ పాలన కొనసాగుతోంది. దొరల అహంకారం, ప్రజలకు మధ్య రాబోయే అసెంబ్లీ ఎన్నికలు జరుగనున్నాయి. అన్ని రకాల దందాలు, మాఫియాల రాజ్యం కొనసాగుతూ తెలంగాణ ఒకే కుటుంబ కబంధ హస్తాల్లో బంధీగా మారింది. బిఆర్ఎస్ నాయకులు రాష్ట్రాన్ని పూర్తిగా దోచుకుతింటున్నారు. ఇప్పటికైనా ప్రజలు జాగరూకతతో వ్యవహరించి అవినీతి, అక్రమాల్లో కూరుకుపోయిన బిఆర్ఎస్ ప్రభుత్వం నుంచి రాష్ట్రాన్ని కాపాడే విధంగా ఓటు హక్కును వినియోగించుకోవాలి. ప్రజా సంక్షేమం, సమగ్రాభివృద్ధి లక్ష్యంగా కొనసాగుతోన్న కాంగ్రెస్ పార్టీకి అండగా నిలవాలి అంటూ కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ వ్యాఖ్యానించారు. తెలంగాణ ఎన్నికల పర్యటనలో భాగంగా శుక్రవారం జగిత్యాల జిల్లా కేంద్రంలోని కొత్త బస్ స్టాండ్ వద్ద రాహుల్ రోడ్ షో నిర్వహించారు. ఈ సందర్భంగా బిఆర్ఎస్, బిజెపి ప్రభుత్వాలపై నిప్పులు చెరిగారు. కేంద్రంలోని బిజెపి, రాష్ట్రంలోని బిఆర్ఎస్ ప్రభుత్వాలు ప్రజా సంక్షేమాన్ని పక్కనబెట్టి స్వార్ధ పూరిత రాజకీయాలను కొనసాగిస్తున్నాయని, ఈ రెండు పార్టీలు ఒకరికొకరు సహకరించుకుంటూ, బయటకు శత్రువుల్లా నటిస్తున్నాయని ఆరోపించారు. ఈ రెండు పార్టీలకు తోడుగా ఎంఐఎం కుట్రపూరిత విధానాలను అవలంభిస్తోందని, కాంగ్రెస్ ఎక్కడ పోటీ చేసినా ఎంఐఎం బరిలో నిలుస్తూ బిజెపికి పరోక్షంగా సహకరిస్తోందన్నారు. తెలంగాణలో పూర్తి నియంతృత్వ పాలన కొనసాగుతోందని, ప్రజల పోరాటంతో సిద్ధించిన తెలంగానలో రాచరికం రాజ్యమేలుతోందన్నారు. మొత్తం రాష్ట్రాన్నంతా ఒకే కుటుంబం దోచుకుంటోందని వ్యాఖ్యానించారు. బిజెపి ప్రభుత్వ అరాచకాలను ప్రశ్నించునందుకు తనకు ఇళ్లు లేకుండా చేశారని, పార్లమెంటు సభ్యత్వం కూడా రద్దు చేయించారని రాహుల్ పేర్కొన్నారు. నీళ్లు, నిధులు, నియామకాల పేరిట గద్దె నెక్కిన బిఆర్ఎస్ ప్రభుత్వం ఈ ప్రాంతంలోని ప్రతిష్టాత్మకమైన నిజాం చక్కెర ఫ్యాక్టరీని మూసివేయించిందన్నారు. కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం ఏర్పరచగానే ఫ్యాక్టరీని తెరిపించడంతో పాటు పసుపు మద్దతు ధరను ఐదు వేలకు పెంచుతామని, వరికి మరో ఐదు వందలు పెంచుతామని హామీనిచ్చారు.

# శాస్త్రీయ అవగాహన కలిగి ఉంటేనే ఆరోగ్యం

- సీనియర్ ఆర్థోపెడిక్ సర్జన్, ప్రొఫెసర్ బంగారి స్వామి




కరీంనగర్, అక్టోబర్ 20, (మనం న్యూస్): విద్యావంతుల నుంచి సామాన్య పౌరుల వరకు అందరూ శారీరక, మానసిక ఆరోగ్య పరిరక్షణకు తగిన శాస్త్రీయ అవగాహనను కలిగి ఉంటేనే ప్రజారోగ్యం దేశాభివృద్ధికి దోహదపడుతుందని రెనే ఆసుపత్రి అధినేత ప్రముఖ సీనియర్ శాస్త్రీయ ఆర్థోపెడిక్ సర్జన్, ప్రొఫెసర్ డాక్టర్ బంగారి స్వామి అన్నారు. ప్రపంచ ఆస్టియోపోరోసిస్, బోలు ఎముకల వ్యాధి దినం సందర్భంగా శుక్రవారం రెనీ ఆసుపత్రి, శాతవాహన లయన్స్ క్లబ్ సంయుక్తంగా బంగారి స్వామితో ముఖాముఖి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పటిష్ట ఎముకల ఆరోగ్య పరిరక్షణకు కావలసిన విటమిన్-డి పొందడానికి ప్రతి రోజు ఉషోదయాన సూర్య కిరణాలు పడేటట్లు ఎండలో అరగంట పాటు నడవడం, సూర్య నమస్కారాలు, యోగాసనాలు చేయడం మన జీవనశైలిలో భాగం చేసుకోవాలని సూచించారు. దీనికి తోడుగా 50 ఏండ్లు దాటిన వయోజనులు, ఎముకల వ్యాధుల పట్ల జాగ్రత్తగా ఉండాలన్నారు. పురుషుల కన్న మహిళలకు ఎముకల ఆరోగ్య సమస్యలు అధికంగా నమోదవుతున్నాయని తెలిపారు. ఆస్టియోఫోరెసిస్ వ్యాధి పలు కారణాలతో వస్తుందని సవివరంగా వివరించారు. వయోవృద్ధులు బాత్‌రూంలో, తడిగా ఉన్న నేలపై నడవడంతో జారి పడడంతో వెన్నెముక, తొంటి, చేతి మడిమల వద్ద ఫ్రాక్చర్లు జరుగుతాయని హెచ్చరించారు. సరైన పోషకాహారంతో పాటు పొగాకు, మద్యం లాంటి దురలవాట్లకు దూరంగా ఉన్నపుడే ఎముకల పటిష్టత, సంపూర్ణ ఆరోగ్యం సిద్ధిస్తాయని తెలిపారు. రెనే ఆసుపత్రి డైయటీషియన్ స్ఫూర్తి మాట్లాడుతూ ప్రతి రోజు ఉదయం నీళ్లలో నానబెట్టిన నీటిని ఒక గ్లాసు తాగడం, చిరు ధాన్యాలతో చేసిన అల్పాహారం తీసుకోవడం, భోజనంలో ఆకుకూరలు, అన్ని రకాల కూరగాయలు ఉండేలా ప్రణాళికాబద్దంగా ఆహారం తీసుకోవాలని వివరించారు. సమావేశంలో పలువురు అడిగిన ప్రశ్నలకు డా బంగారి స్వామి సరళ భాషలో సమాధానాలను ఇచ్చి అందరి ప్రశంసలు పొందారు. లయన్ కెప్టెన్ డా బుర్ర మధుసూదన్ రెడ్డి సమన్వయకర్తగా, లయన్ మేకల అరవింద్ రావు అధ్యక్షతన నిర్వహించిన ఈ సమావేశంలో ముఖ్య అతిథిగా రెండవ ఉప గవర్నర్ లయన్ సింహరాజు కోదండరామ్ మాట్లాడుతూ పలు సామాజిక సమస్యలకు స్పందించడమే కాకుండా పేదలకు అవసర సేవలతో పాటు నిత్యం అన్న ప్రసాద వితరణలు మారుమూల గ్రామీణ భారతంలో కూడా ఆరోగ్య పరిరక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తున్న లయన్స్ క్లబ్బులు ఎంతో మేలు చేస్తున్నాయని తెలిపారు. ఈ సమావేశంలో పిఆర్సీలు నర్సింగ రావు, ఇనుగుర్తి రమేష్, పిజెడ్సిలు, జెడ్సిలు పి.శ్రీహరి రెడ్డి, సీతారాంరెడ్డి, జగదీశ్వరాచారి, మేచినేని సత్యనారాయణ రావు, కార్యదర్శి మహేందర్, సంయుక్త కార్యదర్శి డాక్టర్ ఎల్లలా లక్ష్మారెడ్డి, జిల్లా మెంటర్ సింగమ రాజు, ప్రిన్సిపల్ డాక్టర్ వి.శ్రీనివాస్, కోటేశ్వర్, రామచంద్రం, ఆసుపత్రి సిబ్బంది, నగర క్లబ్బుల సభ్యులు, నగర పౌరులు హాజరయ్యారు. అనంతరం శాతవాహన లయన్స్ క్లబ్ సభ్యులు బంగారి స్వామిని ఘనంగా సన్మానించారు.

# జర్నలిస్ట్‌పై పెట్టిన అక్రమ కేసులను వెంటనే ఎత్తి వేయాలి

- అర్హులైన జర్నలిస్టులకు నివేషణ స్థలాలు మంజూరు చేయాలి
- టిజిపిఎ రాష్ట్ర అధ్యక్షులు ప్రభాకర్




కరీంనగర్ కలెక్టరేట్, అక్టోబర్ 20, (మనం న్యూస్): కరీంనగర్ జిల్లా కేంద్రంలోని జర్నలిస్టు నాయకులపై పెట్టిన కేసులను తక్షణమే ఉపసంహరించుకోవడంతో పాటు అర్హులైన జర్నలిస్టులందరికీ నివేషణా స్థలాలు కేటాయించాలని తెలంగాణ గురుకుల పేరెంట్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు అంబాల ప్రభాకర్ డిమాండ్ చేశారు. శుక్రవారం స్థానిక ప్రెస్‌భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వాలకు, ప్రజలకు వారధులుగా నిస్వార్ధంగా సేవలందిస్తోన్న వారిపై కేసులు నమోదు చేయడం సరైందికాదన్నారు. నివేషణ స్థలాల కేటాయింపులో జరిగిన అవకతవకలపై ప్రశ్నించిన జర్నలిస్ట్ చేతన్, టియుడబ్ల్యూజె రాష్ట్ర ఉపాధ్యక్షులు, కరీంనగర్ జిల్లా అధ్యక్షులు తాడూరి కరుణాకర్, జనం సాక్షి కరస్పాండెంట్ పిఎస్.రవీంద్రలపై పెట్టిన అక్రమ కేసులను వెంటనే ఉపసంహరించుకోవడంతోపాటు నివేషణా స్థలాల జాబితాలోని అనర్హులను తొలగించి, అర్హులకు కేటాయించాలని ప్రభాకర్ పేర్కొన్నారు. లేని పక్షంలో తెలంగాణ గురుకుల పేరెంట్స్ అసోసియేషన్ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో రాష్ట్రంలోని లక్షలాదిమంది తల్లిదండ్రులను ఏకం చేసి ఉద్యమాలు నిర్వహిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుడిష పవన్ కుమార్, రాష్ట్ర ఉపాధ్యక్షులు, ఉమ్మడి కరీంనగర్ జిల్లా ఇంచార్జి దార మధు, రాష్ట్ర కమిటీ సభ్యులు, రాష్ట్ర సెక్యూరిటీ ఫోర్స్ కన్వీనర్ డి.ఎస్.నందం, అనిల్, గంజాయిల గంగాధర్, రేండ్ల శంకర్, పోతు శ్రీనివాస్‌లు పాల్గొన్నారు.

## రైతురుణమాఫీ ప్రక్రియను పూర్తి చేయండి

- రాష్ట్ర ఎన్నికల సంఘం అధికారులు స్పందించాలి

వీణవంక, అక్టోబర్ 20, (మనం న్యూస్): తెలంగాణ రాష్ట్రప్రభుత్వము రైతుల శ్రేయస్సును దృష్టిలో ఉంచుకొని పంట రుణమాఫీ ప్రకటించిన విషయం విధితమే. మండలంలోని 26 గ్రామాలలో ఉన్న రైతులకు కేవలం సగంమందికిమాత్రమే లక్ష రూపాయాల రుణమాఫీ జరిగిందని, రుణమాఫీ కానీ రైతులు ఎప్పుడు రుణమాఫీ చేస్తారా అని ఎదురుచూస్తున్నారు. ఎన్నికల నోటిఫికేషన్‌కు దాదాపు 45 రోజుల ముందు రుణమాఫీ ప్రక్రియ బ్యాంకులలో ప్రారంభమైందని, కొంతమంది రైతులకు రుణమాఫీ చేసి ఎన్నికల కోడ్ రాగానే ఈ ప్రక్రియను నిలిపివేశారని పలువురు రైతులు అన్నారు. పంట రుణమాఫీ కానీ రైతులకు కొత్త రుణాలను ఇవ్వడానికి బ్యాంకర్లు నిరాకరిస్తున్నారని, ఇప్పటికైనా రాష్ట్ర ఎన్నికల సంఘం అధికారులు జిల్లా అధికారులకు రుణమాఫీ ప్రక్రియను కొనసాగించేలా ఆదేశాలు జారీ చేయాలని రైతులు కోరుతున్నారు.

## వివిధ పార్టీ నాయకులు బీఎస్పీలో చేరిక

- పార్టీ కండువా కప్పి ఆహ్వానించిన బీఎస్పీ ఎమ్మెల్యే అభ్యర్థి ఉష



పెద్దపల్లి, అక్టోబర్ 20, (మనం ప్రతినిధి): బహుజన్ సమాజ్ పార్టీ నియోజకవర్గ బీఎస్పీ ఎమ్మెల్యే అభ్యర్థి దాసరి ఉష సమక్షంలో పెద్దపల్లి స్వగృహం నందు శుక్రవారం సుల్తానాబాద్ మండలంలోని మియాపూర్, తొగర్రాయి గ్రామాల నుండి పెద్ద ఎత్తున చేరారు. వారికి పార్టీ కండువా కప్పి దాసరి ఉష సాదరంగా ఆహ్వానించారు. అనంతరం దాసరి ఉష మాట్లాడుతూ బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీ నుండి నాయకులు సుల్తానాబాద్ మండల కార్యదర్శి క్యాదాసి రమేష్, జొంగోని సదయ్య ఆధ్వర్యంలో వివిధ పార్టీల నాయకులు బీఎస్పీలో చేరారని తెలిపారు. బీఎస్పీ పార్టీ గెలుపు కోసం ప్రతి ఒక్కరు కృషి చేయాలని కోరారు. ఈకార్యక్రమంలో బీఎస్పీ పార్టీ జిల్లా ఉపాధ్యక్షులు తోట వెంకటేశ్ పటేల్, మండల ఉపాధ్యక్షులు కొల్లూరి నర్సయ్య, మండల కోశాధికారి అల్లెపు చంద్రశేఖర్, సుల్తానాబాద్ పట్టణాధ్యక్షులు తోట మధు, సింగసాని అనిల్, నాయకులు మహిళా కన్వీనర్లు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

## దళితుల పట్ల ఆర్టీసీ అధికారుల దౌర్జన్యం సరికాదు

- సిపిఎం పార్టీ జిల్లా కమిటీ సభ్యులు బూడిద గణేష్

మంథని, అక్టోబర్ 20, (మనం న్యూస్) : మంథని మున్సిపల్ పరిధిలోని ఆర్టీసీ డిపో వద్ద దళితుల చేస్తున్న శాంతియుత న్యాయ పోరాటానికి సిపిఎం పార్టీ జిల్లా కమిటీ సభ్యులు బూడిద గణేష్ శుక్రవారం సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నో ఏళ్లుగా దళితుల భూములను కొనుక్కొని ఇండ్లు నిర్మించుకొని నివసిస్తున్నారని అన్నారు. ఈ మధ్యకాలంలో ఆర్టీసీ అధికారులు ఈ స్థలం ఆర్టీసీదని దళితులను బెదిరిస్తూ దళితుల ఇండ్ల ముందు ప్రహారీ గోడ కట్టడానికి ప్రయత్నాలు చేస్తున్నారని అన్నారు. దళితుల పట్ల ఆర్టీసీ అధికారుల తీరు సరికాదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో గ్రామపంచాయతీ ఇచ్చిన అనుమతుల ప్రకారమే ఇండ్లు నిర్మించుకున్నారని ఆయన తెలిపారు. దళితుల ఇండ్ల చుట్టూ ఆర్టీసీ అధికారుల గోడ నిర్మించి బయటికి వెళ్లలేకుండా చేస్తున్నారని విమర్శించారు.ఇప్పటికైనా ఆర్టీసీ అధికారులు ప్రహారీ గోడ నిర్మించే ప్రయత్నాన్ని విరమింప చేసుకొని దళితులకు న్యాయం చేయాలని ఆయన ఈ సందర్భంగా కోరారు.

## కాంగ్రెస్‌ను నమ్మితే కర్ణాటక ప్రజల్లా మోసపోతాం

- రాహుల్‌గాంధీవి అసత్య వ్యాఖ్యలు
- ఎవరో రాసింది చదవడం తప్ప.. ఆయనకు అవగాహన లేదు
- మంత్రి గంగుల కమలాకర్



కరీంనగర్ బ్యూరో, అక్టోబర్ 20, (మనం న్యూస్): కాంగ్రెస్ పార్టీని నమ్మి ఓటేస్తే. కర్ణాటక ప్రజల్లా మోసపోవడం ఖాయమని మంత్రి గంగుల కమలాకర్ వ్యాఖ్యానించారు. రోడ్ షోల సందర్భంగా రాహుల్ గాంధీ అసత్య ప్రచారానికి పాల్పడుతున్నారని, ఎవరో రాసింది చదవడం తప్ప తెలంగాణ గురించి ఆయనకు ఎలాంటి అవగాహన లేదన్నారు. శుక్రవారం మంత్రి మీసేవా కార్యాలయంలో జరిగిన మీడియా సమావేశంలో గంగుల మాట్లాడుతూ కాళేశ్వరం ప్రాజెక్టుకు 80 వేల కోట్ల రూపాయల వ్యయమైతే, లక్ష కోట్ల రూపాయల అవినీతి జరిగిందని రాహుల్ ఆరోపించడం హాస్యాస్పదమన్నారు. తెలంగాణలో బలిదానాలు జరగడానికి కాంగ్రెస్ పార్టీయే ప్రధాన కారణమన్నారు.

# కేసీఆర్ అంటేనే నమ్మకం - కొండంత ధైర్యం

- ముఖ్యమంత్రి ముందుచూపుతోనే గొప్ప పథకాలు
- కాంగ్రెస్సోళ్లు కుర్చీ కోసమే ఆరు అబద్ధాలు పథకాలు చెప్తాండ్లు
- ప్రజలు గొప్పగా ఆలోచన చేసి బిఆర్ఎస్‌ను ఆదరించాలే
- బిఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి పుట్ట మధుకర్



మంథని, అక్టోబర్ 20, (మనం న్యూస్) : తొమ్మిందేండ్ల పాటు రాష్ట్రంలో సుపరిపాలన అందించిన ముఖ్యమంత్రి కేసీఆర్ అంటే ప్రజలకు ఒక నమ్మకం కొండంత ధైర్యమని బిఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి పుట్ట మధుకర్ అన్నారు. మంథని మండలం కన్నాల గ్రామంలోని శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయంలో బిఆర్ఎస్ పార్టీ ఎన్నికల మేనిఫెస్టో, నామినేషన్ పత్రాలతో ప్రత్యేక పూజలు నిర్వహించి ఇంటింటికి బిఆర్ఎస్ ఎన్నికల మేనిఫెస్టో కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ కన్నాల గ్రామంలోని శ్రీ వెంకటేశ్వరస్వామి సన్నిధిలో పూజలు చేయడం,ఎన్నికల ప్రచారాన్ని స్వామి వారిని దర్శించుకునే ప్రారంభించడం ఆనవాయితీగా వస్తోందని,స్వామివారి కృపతో మంచి జరుగుతుంతనే నమ్మకం ప్రతి ఒక్కరిలో ఉందన్నారు. ఈ క్రమంలోనే కన్నాల ఆలయంలో స్వామివారిని దర్శించుకుని ముందుగా గ్రామప్రజల ఆశీర్వాదం తీసుకోవడం జరుగుతుందన్నారు. తొమ్మిదేండ్లలో సీఎం కేసీఆర్ చేసిన అభివృద్ధి,సంక్షేమ పథకాలను చూసిన ప్రజలు ఎంతో ఆనందపడుతున్నారని అన్నారు. కన్నవాళ్లు కదన్నా సీఎం కేసీఆర్ ఇచ్చిన ఫించన్ డబ్బులతో మంచిగా బతుకుతున్న బిడ్డా అంటూ ఓ తల్లి చెప్పిన తీరును చూస్తేనే అర్థం అవుతుందన్నారు. ముఖ్యమంత్రి ముందుచూపుతోనే అనేక పథకాలకు రూపకల్పన చేసిన అమలు చేస్తున్నారని ఆయన అన్నారు. ఎన్నికలు వస్తున్నాయని కాంగ్రెస్సోళ్లు కుర్చీ కోసం ఆరు అబద్దాల పథకాలను చెబుతున్నారని,ఏ ఒక్క పథకం గ్యారెంటీ వారంటీ ఉండదని ఆయన ఎద్దేవా చేశారు. బిఆర్ఎస్ పార్టీ ప్రవేశపెట్టిన ఎన్నికల మేనిఫెస్టోతో పాటు తాను సొంతంగా ఓ మేనిఫెస్టోకు రూపకల్పన చేశానని, ప్రభుత్వ ఫలాలతో పాటు తాను సొంతంగా మరిన్ని సేవలు అందిస్తానని అన్నారు. బిఆర్ఎస్ పార్టీ ఐదేండ్లలో రెట్టింపు ఫించన్‌లు,రూ.400 లకే గ్యాస్ సిలిండర్,సన్నబియ్యంలాంటి పథకాలతో పాటు గుంట భూమి ఉన్న రైతుకు ఎలా భీమా వర్తింపజేస్తుందో ఆదేరీతిలో ప్రతి ఒక్క కుటుంబానికి భీమా అందించేలా ఏర్పాట్లు చేస్తుందన్నారు. రైతులకు పెట్టుబడి సాయం పెంచి వ్యవసాయానికి అండగా నిలుస్తుందన్నారు. ప్రతిపేదవాడి ఆరోగ్యం విషయంతో ప్రత్యేక దృష్టిసారించిన సీఎం కేసీఆర్ ఆరోగ్యశ్రీని రూ. 15లక్షల వరకు పెంచారని ఆయన వివరించారు. ఇలాంటి గొప్ప మేనీఫెస్టోతో పాటు తాను సొంతంగా మరిన్ని సేవలు అందించేందుకు అన్ని చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. గతంలో తనకు ఎమ్మెల్యేగా అవకాశం కల్పించి ఆశీర్వదిస్తూ నాలుగేండ్లు తన తల్లి పేరు ఏర్పాటు చేసిన ట్రస్టు ద్వారా అనేక సేవలు చేశామన్నారు. ప్రతి మండలంలో అంబులెన్స్‌లు ఏర్పాటు చేశామని, ఆకలి తీర్చేలా అన్నం పెట్టామని, ఆడబిడ్డల పెండ్లిళ్లు చేశామని,చదువులు చెప్పించామన్నారు. అదే రీతిలో రాబోయే రోజుల్లో ఉన్నత చదువులు చదువుకునే పేద బిడ్డలకు హైదరాబాద్‌లో ఉచితంగా వసతి కల్పించి రూపాయి ఖర్చు లేకుండా చదివించే బాధ్యత తీసుకుంటానని,అదే విధంగా ప్రతి ఏటా పేదింటి ఆడబిడ్డల పెండ్లి పుస్తె మట్టెలు అందించి పుట్టింటి వారిలా అంగరంగవైభవంగా వివాహం జరిపిస్తానని అన్నారు. అంతేకాకుండా నియోజకవర్గంలో ఎంతో మంది నిరుపేదలు ఇండ్లు లేకుండా ఉన్నారని,గత కాంగ్రెస్ ప్రభుత్వంలో ఇందిరమ్మ పథకం పేరుతో ఇండ్లు మాయం చేశారని ,అలాంటి దుస్థితి లేకుండా ప్రభుత్వం అందించే గృహలక్ష్మి పథకం ద్వారా ప్రతి ఒక్కరికి ఇళ్లు మంజూరు చేయించి ప్రభుత్వం ఇచ్చే మూడు లక్షలతో పాటు తాను కొంత కలిపి ఇండ్లు నిర్మించి దగ్గరుండి బట్టలు పెట్టి గృహ ప్రవేశం చేయిస్తామని ఆయన హామీ ఇచ్చారు. ఇలా తాను అనేక సేవలు చేస్తుంటే కాంగ్రెస్సోళ్లు దుష్ప్రచారాలు చేస్తున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. 40 ఏండ్లు కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉండి ప్రజలకు ఏమీ చేయలేదని అన్నారు. ఈ ప్రాంత ప్రజలకు సేవ చేయాలనే ఆలోచనతో తన లాంటి వాళ్లు రాజకీయంగా ఎదిగితే అనేక కుట్రలు కుతంత్రాలతో రాజకీయ సమాధి చేసే ప్రయత్నాలు చేస్తున్నారని అన్నారు. రాబోయే ఎన్నికల్లో బిఆర్ఎస్ పార్టీకి, ఎమ్మెల్యే అభ్యర్థిగా తనను ప్రజలు ఆశీర్వదించి ఆదరించాలని ఆయన కోరారు.

## బతుకమ్మ సంబురాలు,ఫ్యామిలీ డే వేడుకలు విజయవంతం చేయాలి

- ఆర్జీ-3 సేవా అధ్యక్షురాలు



రామగిరి, అక్టోబర్ 20, (మనం న్యూస్) : సింగరేణి రామగుండం-3 అడ్రియాల ప్రాజెక్టు ఏరియాలో ఈ నెల 22న నిర్వహించే సద్దుల బతుకమ్మతో పాటు ఫ్యామిలీ డే వేడుకలలో మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని ఆర్జీ-3 ఏరియా సేవా అధ్యక్షురాలు శ్రీమతి ఎన్.అలి వేణి - సుధాకరరావు,ఏపీఏ,జీఎం సతీమణి శ్రీమతి కే. విజయలక్ష్మిలు పేర్కొన్నారు. శుక్రవారం సెంటినరీ కాలనీలోని సేవా భవనములో సేవా సభ్యులతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో వారు మాట్లాడుతూ ఈ నెల 22న రుద్రమదేవి క్రీడా ప్రాంగణంలో సాయంత్రము 6 గంటల నుండి బతుకమ్మ, ఫ్యామిలీ డే వేడుకలు నిర్వహించబడునని,ఉత్తమ బతుకమ్మ విజేతలకు బహుమతి ప్రధానం చేయబడునని అన్నారు. కావున సింగరేణి ఉద్యోగుల కుటుంబ సభ్యులు మరియు సెంటనరీకాలని మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని ఈ వేడుకలను విజయవంతం చేయాలని కోరారు. వారితో పాటు పర్సనల్ మేనేజర్ ఎం. రవీందర్‌రెడ్డి, డిప్యూటీ పర్సనల్ మేనేజర్ శ్రీహరి, సునీల్, సేవా కార్యదర్శి మల్లేశ్వరి, సంయుక్త కార్యదర్శి ఉమాదేవి, తదితరులు ఉన్నారు.

## ఘనంగా కుంకుమ పూజలు, అక్షరాభ్యాసాలు



మంచిర్యాల, అక్టోబర్ 20, (మనం న్యూస్): సిసిసి రాంనగర్‌లోని శ్రీ శ్రీ శ్రీ ఆదిపరశక్తి భువనేశ్వరి మాతా నిలయంలో దేవీ శరన్నవరాత్రోత్సవాలను అత్యంత వైభవంగా నిర్వహిస్తున్నారు. నవరాత్రోత్సవాల్లో భాగంగా మూలా నక్షత్రమైన శుక్రవారం సరస్వతీ దేవికి ఘనంగా పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలు పెద్ద ఎత్తున పాల్గొని కుంకుమ పూజలు నిర్వహించడంతో పాటు చిన్నారులకు అక్షరాభ్యాసాలను జరిపారు. ఆలయ పూజారి రాజ్ కుమార్ ఆధ్వర్యంలో జరిగిన ఈ పూజా కార్యక్రమాల్లో ఆలయ కమిటీ అధ్యక్షుడు వంగల దయానంద్, ప్రధాన కార్యదర్శి మాదరబోయిన రవి, ట్రెజరర్ వంగల వివేకానంద తదితరులు పాల్గొన్నారు.

## బిఆర్ఎస్ నాయకున్ని పరామర్శించిన డాక్టర్ సంజయ్



ఇబ్రహీంపట్నం, అక్టోబర్ 20, (మనం న్యూస్): అనారోగ్యంతో ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న మండల కేంద్రానికి చెందిన బిఆర్ఎస్ గ్రామ శాఖ అధ్యక్షుడు రెబటి రాజేందర్‌ను శుక్రవారం కోరుట్ల నియోజకవర్గ బిఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ కల్వకుంట్ల సంజయ్ పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన ఆరోగ్య పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు.

## తెలంగాణలో రాబోయేది బిజెపి డబుల్ ఇంజన్ సర్కార్

- కాంగ్రెస్, బిఆర్ఎస్‌లు ఒకే గూటి పక్షులు
- హుజూరాబాద్‌లో భారీ మెజారిటీ సాధించాలి
- బిజెపి నేత, అదిలాబాద్ పార్లమెంట్ ప్రబారి అల్జాపూర్ శ్రీనివాస్



హుజురాబాద్ టౌన్, అక్టోబర్ 20, (మనం న్యూస్): కేంద్రంలో, రాష్ట్రంలో వచ్చేది బిజెపి డబుల్ ఇంజన్ సర్కారేనని, దేశ ప్రజలంతా మోడీ ప్రభుత్వ పాలనపై విశ్వాసంతో ఉన్నారని, తెలంగాణ ప్రజలు కూడా బిజెపి మోడీ ప్రభుత్వ పాలనను బలంగా కోరుకుంటున్నారని, రాబోయే రోజుల్లో జరిగే ఎన్నికల్లో తెలంగాణలో కాషాయ జెండా ఎగిరి తీరుతుందని బిజెపి నేత, అదిలాబాద్ పార్లమెంట్ ప్రబారీ అల్జాపూర్ శ్రీనివాస్ ఆశాభావం వ్యక్తం చేశారు. శుక్రవారం హుజురాబాద్ అసెంబ్లీ ఎన్నికల సన్నాహక సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో బిఆర్ఎస్ ప్రభుత్వం ప్రజల జీవితాలతో చెలగాటమాడుతుందని, ఆచరణ సాధ్యం కానీ హామీలతో, మాయమాటలతో ప్రజానీకాన్ని నమ్మించి మోసం చేయడం కెసిఆర్ ప్రభుత్వం అలవాటుగా మార్చుకుందని ఆయన మండిపడ్డారు. కెసిఆర్ ప్రభుత్వం తెలంగాణ భవిష్యత్తుకు గుదిబండగా మారిందని, రాష్ట్రాన్ని అప్పుల మయంగా మార్చిందన్నారు. అలాగే కాంగ్రెస్ పరిస్థితి మరింత అధ్వానంగా మారిందని, ప్రాంతీయ పార్టీలతో కలిసి కూటమిగ ఏర్పడి బిజెపిని ఎదుర్కోవడానికి అనేక ప్రయత్నాలు చేస్తుందన్నారు. తెలంగాణ రాష్ట్రంలో బిజెపిని ఎదుర్కోవడానికి అంతర్గత ఒప్పందాలతో కాంగ్రెస్, బిఆర్ఎస్ నేడు రాజకీయ డ్రామాలు చేస్తుందన్నారు. ప్రజలకు కాంగ్రెస్, బిఆర్ఎస్ ఒకే గూటి పక్షులని అర్థమవుతుందన్నారు. కాంగ్రెస్ టిఆర్ఎస్‌లో ఎన్ని కుట్రలు చేసినా తెలంగాణ సమాజం నమ్మే పరిస్థితిలో లేదని, రాబోయే ఎన్నికల్లో తెలంగాణ రాష్ట్రంలో కమలం వికసిస్తుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. డబల్ ఇంజన్ సర్కార్ తోనే తెలంగాణ దిశా దశ మారుతుందని, బిజెపినీ అధికారంలోకి తీసుకురావాలనే కృత నిశ్చయంతో ప్రజానీకం ఉన్నారని ఆయన ఈ సందర్భంగా తెలిపారు. హుజరాబాద్ నియోజవర్గం లోని బిజెపి శ్రేణులు 40 రోజులు కష్టపడి పనిచేసి, భారీ మెజారిటీని సాధించాలన్నారు. ఈ కార్యక్రమంలో బిజెపి కరీంనగర్ జిల్లా అధ్యక్షులు గంగాడి కృష్ణారెడ్డి, హుజురాబాద్ అసెంబ్లీ కన్వీనర్ మాడా గౌతమ్ రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షులు ఎర్రబెల్లి సంపత్ రావు, స్టేట్ కౌన్సిల్ మెంబర్ పుప్పాల రఘు జిల్లా అధికార ప్రతినిధులు జేల్లా సుధాకర్, మసాడి ముత్యం రావు, హుజరాబాద్ పట్టణ అధ్యక్షులు గంగిశెట్టి రాజు, జమ్మికుంట పట్టణ అధ్యక్షులు జీడి మల్లేష్ రూరల్ అధ్యక్షులు సంపెల్లి సంపత్ రావు, ఇళ్ళంతకుంట మండల అధ్యక్షులు సింగిరెడ్డి తిరుపతి రెడ్డి, కమలపుర్ మండల అధ్యక్షులు కట్కూరి అశోక్ రెడ్డి, సీనియర్ నాయకులు వివిధ మండల ప్రధాన కార్యదర్శులు, వివిధ మోర్చాల అధ్యక్షులు, శక్తి కేంద్ర ఇంఛార్జిలు, బూత్ అధ్యక్షులు,నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## గడ్డం వినోద్‌కు ఘన స్వాగతం పలికిన కాంగ్రెస్ శ్రేణులు



బెల్లంపల్లి, అక్టోబర్ 20, (మనం న్యూస్) : బెల్లంపల్లి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థిగా ప్రకటించిన తర్వాత తొలిసారి నియోజకవర్గంలో అడుగుపెడుతున్న మాజీ మంత్రి గడ్డం వినోద్ వెంకట్ స్వామికి శుక్రవారం కాంగ్రెస్ శ్రేణులు ఘనంగా స్వాగతం పలికాయి. నియోజకవర్గ వ్యాప్తంగా దాదాపు 5వేల మందితో బైక్ ర్యాలీ ద్వారా ఆయనకు స్వాగతం పలికారు. టోల్గేట్ నుండి మొదలైన ర్యాలీ కన్నాల జాతీయ రహదారి హనుమాన్ విగ్రహం నుండి బజార్ మీదుగా సాగింది. ర్యాలీలో నియోజకవర్గంలోని ఏడు మండలాలకు చెందిన కాంగ్రెస్ శ్రేణులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు. అనంతరం పద్మశాలి భవన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో నాయకులకు, కార్యకర్తలకు గెలుపే లక్ష్యంగా అందరూ కలిసి కట్టుగా పనిచేయాలని దిశానిర్దేశం చేసారు. ఈ సందర్భంగా గడ్డం వినోద్ మాట్లాడుతూ తన మీద నమ్మకంతో ఎమ్మెల్యే అభ్యర్థిగా ప్రకటించిన సోనియా గాంధీ, రాహుల్ గాంధీ, రేవంత్ రెడ్డిలకు కృతజ్ఞతలు తెలిపారు. తనకు ఇంతటి ఘన స్వాగతం పలికిన కాంగ్రెస్ శ్రేణులకు కృతజ్ఞతలు తెలిపాడు. గత తొమ్మిదేళ్ల బిఆర్ఎస్ పాలనతో ప్రజలకు విసుగొచ్చిందని, పేదలకు సంక్షేమ పథకాలు అందించే కాంగ్రెస్ వైపు ప్రజలందరూ చూస్తున్నారని పేర్కొన్నారు. అటు రాష్ట్రంలో ఇటు నియోజకవర్గంలో కాంగ్రెస్ జెండా ఎగరవేయడం ఖాయమని ఆయన ధీమా వ్యక్తం చేశారు. నియోజకవర్గంలోని ప్రతి ఒక్క కాంగ్రెస్ కార్యకర్త ఒక సైనికుడిలా పార్టీ గెలుపు కోసం కృషి చేయాలని, కాంగ్రెస్ పార్టీ ప్రకటించిన ఆరు గ్యారెంటీలను గడపగడపకు తీసుకెళ్లాలన్నారు.తాను గెలిచాక బెల్లంపల్లి నియోజకవర్గాన్ని అన్ని రంగాలలో అభివృద్ధి చేస్తానని హామీ ఇచ్చారు. సందర్భంగా పలువురు ఇతర పార్టీల నాయకులు, కార్యకర్తలకు పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

## దుర్గా మాత మండపం వద్ద భక్తులకు అన్నదానం



సుల్తానాబాద్, అక్టోబర్ 20, (మనం న్యూస్) : దుర్గామాత ఉత్సవాలలో భాగంగా శుక్రవారం సుల్తానాబాద్ మండలకేంద్రంలోని జవహర్‌నగర్‌లో దుర్గమాత మండపం వద్ద భక్తులకు అన్నదానం నిర్వహించారు. నవరాత్రి ఉత్సవాలలో భాగంగా దుర్గామాత అమ్మవారిని నిత్యం వివిధ రూపాలలో పూజించి అమ్మవారిని కొలుస్తారు. వివిధ రూపాలలో దర్శనమిస్తున్న అమ్మవారిని భక్తులు దర్శించుకుని ఓడి బియ్యం సారేతో పాటు మహిళలు భక్తిశ్రద్ధలతో దేవిని పూజిస్తున్నారు. శుక్రవారం అమ్మవారికి వివిధ రకాల పూజలు నిర్వహించిన అనంతరం దాతల సహకారంతో భక్తులకు అన్నదానం చేపట్టారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన మాజీ జెడ్పిటిసి ఐల రమేష్ ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అన్నదానం చేపట్టారు. ఈ కార్యక్రమంలో ఉత్సవ కమిటీ అధ్యక్షులు ఆకుల కరుణాకర్, కౌన్సిలర్ దున్నపోతుల రాజయ్య, జవహర్ యూత్ క్లబ్ ప్రతినిధులు పెగడ పరుశరాములు, పెగడ చందు, వెల్లే రాజు, ఆకుల విష్ణువర్ధన్, శెట్టి శ్రీనివాస్, ఆకుల సాయి, కోయ్యడా, సాయికుమార్, శివకుమార్, జయవర్ధన్, సన్నీ, ఆకుల అంజయ్య, కొయ్యడ విజయ, ఆకుల స్వరూప, మౌనిక, శిరీష, సరోజ, శోభారాణిలతో పాటు పెద్ద సంఖ్యలో మహిళలు భక్తులు పలువురు పాల్గొన్నారు.

## ప్రజలను ఇబ్బంది పెడ్తే సహించేది లేదు

- ఆర్టీసీ అధికారుల తీరుపై జెడ్పీ చైర్మన్ అసహనం
- బిఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి,జిల్లా పరిషత్ చైర్మన్ పుట్ట మధుకర్



మంథని, అక్టోబర్ 20, (మనం న్యూస్) : మంథని ఆర్టీసీ డిపో పరిధిలోని భూములను ఆ సంస్థ అధికారులు హద్దులు పెడుతున్న క్రమంలో సమీప ఇంటి నిర్మాణాలపై అభ్యంతరాలు వ్యక్తం చేస్తున్న తీరుపై ఆయన అసహనం వ్యక్తం చేశారు. అనేక ఏండ్ల క్రితమే గ్రామపంచాయతీ నుంచి స్థానికులకు హద్దులు కేటాయించారని,ఆనాడు ఇంటినిర్మాణాలు జరుగుతున్న క్రమంలోఆర్టీసీ అధికారులు ఎందుకు స్పందించలేదని ప్రశ్నించారు. ఒక పేదవాడు ఇళ్లు నిర్మించుకుంటే సహకారం అందించాల్సింది పోయి ఈనాడు హద్దుల పేరుతో ఇబ్బందులు పెడుతారా అంటూ ఆర్టీసీ అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. అనాడు అనుమతుల ఇచ్చిన వారిపై ఫిర్యాదు చేయాలని, సంస్థ భూములను సంబంధించి రికార్డులతో మున్సిపల్, రెవున్యూ, ఆర్ అండ్ బి అధికారులతో కలిసి సర్వే చేసుకోవాలని, ఎవరు లేకుండా ఇలా ఇబ్బందులకు గురిచేయడం సరికాదని ఆయన అన్నారు.

## జెన్ కో పవర్ ప్లాంటు పునరుద్ధరణే ప్రధాన లక్ష్యం

- డిసిసి అధ్యక్షులు మక్కన్ సింగ్ రాజ్ ఠాగూర్



గోదావరిఖని, అక్టోబర్ 20, (మనం న్యూస్) : జెన్ కో పవర్ ప్లాంటు పునరుద్ధరణే ప్రధాన లక్ష్యమని, తన ప్రాణాలను త్యాగం చేసైనా పవర్ ప్లాంట్ పునరుద్దీకరణ చేస్తానని కాంగ్రెస్ పార్టీ పెద్దపెల్లి జిల్లా అధ్యక్షులు మక్కాన్ సింగ్ రాజ్ ఠాగూర్ హామీ ఇచ్చారు. శుక్రవారం రామగుండంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు,మాజీ జడ్పిటిసి అయోధ్య సింగ్ ఆధ్వర్యంలో బిఆర్ఎస్ సమన్వయ కమిటీ మెంబర్ బుగ్గ రాములు,స్టేట్ మైనార్టీ సెల్ సెక్రటరీ కమ్మర్ వక్త్ లతో పాటు 200 మంది కాంగ్రెస్ పార్టీలో చేరారు. మక్కాన్ సింగ్ పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కంఠంలో ఊపిరి ఉన్నంతవరకు ప్రజా సేవ కోసమే ఈ జీవితమన్నారు. మాంచెస్టర్ ఆఫ్ సిటీగా పేరుగాంచిన రామగుండం పారిశ్రామిక ప్రాంతాన్ని గత పాలకులు బొందల గడ్డగా మార్చారని విమర్శించారు. ఒక్క అవకాశం ఇవ్వండి అభివృద్ధి చేసి చూపిస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో నాయకులు పాతిపెల్లి ఎల్లయ్య, సలీం బేగ్, శంకర్ నాయక్, ఇసం పెల్లి అంజుల్, హరిప్రసాద్, మొహమ్మద్ నస్రీన్ బేగం, రాజా మొగిళి, రషీద్, యాషీన్, షకీల్, మోసీన్, ముంతాజ్, మొహమ్మద్ అరిఫ్, జబ్బార్, ముక్కెర శ్రీనివాస్ లతో పాటు తదితరులు పాల్గొన్నారు.

## హుజురాబాద్‌ను జిల్లాగా ఏర్పాటు చేయాలి



వీనవంక, అక్టోబర్ 20, (మనంన్యూస్) : అన్నివనరులు ఉన్న హుజురాబాద్ కేంద్రంగా మాజీ ప్రధాని స్వర్గీయ పివి నర్సింహరావు పేరిట నూతన జిల్లాగా ఏర్పాటు చేయాలని పివి హుజురాబాద్ జిల్లా సాధన జేఏసి నాయకులు అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ఏర్పడిన తరువాత పరిపాలన సౌలభ్యం కొరకు నూతన జిల్లాలు ఏర్పాటు చేయాలని రాష్ట్రప్రభుత్వం సీఎం కెసీఆర్ ఆ దిశగా జిల్లాలు ఏర్పాటు కోసం కమిటీ వేశారని, జిల్లాల ఏర్పాటు చేయడం జరుగుతుందని తెలిసి హుజురాబాద్ పట్టణ కేంద్రంలో హుజురాబాద్‌ను నూతన జిల్లాగా ఏర్పాటు చేయాలని దీక్ష చేయడం జరిగిందన్నారు. అప్పటి మంత్రి దీక్ష విరమింపచేయాలని జిల్లా సాధన సమితి సభ్యులను కోరడంతో దీక్ష విరమించడం జరిగిందని తెలిపారు. అప్పటి నుండి ఇప్పటి వరకు అన్ని వనరులు ఉన్న హుజురాబాద్‌ను జిల్లా చేయాలని తాము ఎంతగానో ప్రభుత్వపై ఒత్తిడి తీసుకొస్తున్నామని, వాణిజ్యవ్యాపార, రవాణా,వైద్యం, విద్య, ఉపాధి అవకాశాలలో హుజురాబాద్ ఎంతో ముందు ఉందని వెంటనే హుజురాబాద్‌ను జిల్లాగా ఏర్పాటు చేసి ప్రజల చిరకాల స్వప్ననాన్ని నెరవేర్చాలని కోరారు. అనంతరం నూతన హడ్‌హక్ కమిటీ ని ఎన్నుకోవడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో జేఏసి నాయకులు పల్కల ఈశ్వర్‌రెడ్డి, సదానాందం, వెంకట్రాజం, మోరె సతీష్, చదువు మహేందర్‌రెడ్డి, గెల్లు మల్లయ్యయాదవ్,గాజుల సమ్మయ్య, మర్రిస్వామి, రవితేజ,పులి ప్రకాష్, మదునయ్య, లక్ష్మణ్, కుమార్‌యాదవ్, రాజన్న, రవీందర్‌రెడ్డి, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## వైభవంగా శ్రీ దుర్గాదేవి నవరాత్రి ఉత్సవాలు



తిమ్మాపూర్, అక్టోబర్ 20, (మనం న్యూస్): కరీంనగర్ జిల్లా తిమ్మాపూర్ మండల కేంద్రంలో విఘ్నేశ్వర మహిళ కమిటి, ఆదర్శ యూత్ కమిటీల ఆధ్వర్యంలో శ్రీ దుర్గాదేవి నవరాత్రి ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తున్నారు. శుక్రవారం శ్రీ సరస్వతి దేవి అవతారంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహిం చిన అనంతరం భక్తులకు అమ్మవారి ప్రత్యేక దర్శనం తో పాటు తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఈ సందర్భంగా పోలు రాము రమేష్ ఆద్వర్యంలో మహా అన్న దానం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పోలు రాము, రమేష్, ఆదర్శ యూత్ అధ్యక్షులు వడ్లకొండ మల్లయ్య, విఘ్నేశ్వర మహిళ కమిటి సభ్యులు, యూత్ సభ్యులు, గ్రామ ప్రజలు, పాల్గొన్నారు.

## బావుపేటలో ఘనంగా సద్దుల బతుకమ్మ



కొత్తపల్లి, అక్టోబర్ 20, (మనం న్యూస్): కొత్తపల్లి మండలం బావుపేట గ్రామంలో శుక్రవారం ఘనంగా సద్దుల బతుకమ్మ సంబరాలు చేసుకు న్నారు. బావుపేట గ్రామంలో ఏడు రోజులకే సద్దుల బతుకమ్మ పండుగ నిర్వహించుకునే సంప్రదాయం ప్రకా రం మహిళలు పలురకాల పువ్వులతో రకరకాల బతుకమ్మలు పేర్చి గౌరమ్మ లతో అలంకరించి ఆటపాటలతో ఘనంగా బతుకమ్మ పండుగ నిర్వహించారు. ఈ సందర్భంగా కొత్తపల్లి ఎంపీపీ పిల్లి శ్రీలత మహేష్ బతుకమ్మను పేర్చి మహిళలతో కలిసి వేడుకల్లో పాల్గొన్నారు.

## ఘనంగా కుంకుమ పూజలు, అక్షరాభ్యాసాలు



మంచిర్యాల, అక్టోబర్ 20, (మనం న్యూస్): సిసిసి రాంనగర్‌లోని శ్రీశ్రీశ్రీ ఆదిపరశక్తి భువనేశ్వరి మాతా నిలయంలో దేవీ శరన్నవరాత్రోత్సవాలను అత్యంత వైభవంగా నిర్వహిస్తున్నారు. నవరాత్రోత్సవాల్లో భాగంగా మూలా నక్షత్రమైన శుక్రవారం సరస్వతీ దేవికి ఘనంగా పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలు పెద్ద ఎత్తున పాల్గొని కుంకుమ పూజలు నిర్వహించడంతో పాటు చిన్నారులకు అక్షరాభ్యాసాలను జరిపారు. ఆలయ పూజారి రాజ్ కుమార్ ఆధ్వర్యంలో జరిగిన ఈ పూజా కార్యక్రమాల్లో ఆలయ కమిటీ అధ్యక్షుడు వంగల దయానంద్, ప్రధాన కార్యదర్శి మాదరబోయిన రవి, ట్రెజరర్ వంగల వివేకానంద తదితరులు పాల్గొన్నారు.

## 23న శమీ పూజ

మంచిర్యాల, అక్టోబర్ 20, (మనం న్యూస్): మంచిర్యాల పట్టణంలో హమాలీవాడలో హిందూ ఉత్సవ సమితి ఆధ్వర్యంలో ఈ నెల 23న శమి పూజ నిర్వహిస్తున్నట్లు హిందూ ఉత్సవ సమితి ప్రధాన కార్యదర్శి రవీందర్ కర్నకంటి తెలిపారు. సాయంత్రం 5 గంటలకు సామూహికంగా హనుమాన్ సాయి దేవాలయం నుండి కట్ట పోచమ్మ దేవాలయం వద్దకు వెళ్లి జమ్మి చెట్టు కు పూజ కార్యక్రమం నిర్వహించనున్నట్లు చెప్పారు. హిందూ బాంధవులు, పుర ప్రముఖులు మహిళలు, అధిక సంఖ్యలో పాల్గొని ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

## కేసీఆర్ తోనే సింగరేణికి మనుగడ

- కేసీఆర్‌ను హ్యాట్రిక్ సిఎంగా చూడాలన్నదే కార్మికుల కోరిక
- శాసనసభ్యులు కోరుకంటి చందర్




గోదావరిఖని, అక్టోబర్ 20, (మనం న్యూస్): రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్ తోనే సింగరేణి మనుగడ సాధ్యమని రామగుండం ఎమ్మెల్యే కోరుకంటి చందర్ అన్నారు. శుక్రవారం ఆర్జీ వన్ పరిధిలో 2 ఏ ఇంక్లైన్ గని వద్ద ఎమ్మెల్యే ప్రజ అంకిత యాత్ర చేపట్టారు. ఈ సందర్భంగా గని ఆవరణలో ఉన్న అమ్మవారి ఆలయంలో కార్మికులతో కలసి ప్రత్యేక పూజలు చేసారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ నిబంధనలకు విరుద్ధంగా బొగ్గు బ్లాకులను కేటాయించడం మూలంగానే బిజెపి ప్రభుత్వం 2014లో ఎంఎండిఆర్ యాక్ట్ పెట్టిందని ఆరోపించారు. సింగరేణి గనుల ప్రైవేటీకరణకు తెరలేపి, కార్మికులకు నష్టానికి కారణమైన కాంగ్రెస్, బిజెపి పార్టీలను చిత్తుగా ఓడించాలని పిలుపునిచ్చారు. కెసిఆర్ పాలనలోని బిఆర్ఎస్ ప్రభుత్వం సింగరేణి కార్మికుల పక్షపాతని, గత ప్రభుత్వాలు పోగొట్టిన వారసత్వ ఉద్యోగ హక్కును కారుణ్య నియామకాల పేరుతో కేసీఆర్ మళ్లీ పునరుద్ధరించారని, ప్రతి ఏటా లాభాల వాటా పెంచుతున్నారన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం గెలిస్తేనే సింగరేణికి మనుగడ అని కార్మికులకు మరిన్ని హక్కులు సాధించగలమని పేర్కొన్నారు. టిఆర్ఎస్ పార్టీని అత్యధిక మెజార్టీతో గెలిపించి, కేసీఆర్ ని హ్యాట్రిక్ ముఖ్యమంత్రిని చేసి, గనుల పరిరక్షణకు భాగస్వామ్యం కావాలని సూచించారు.రామగుండం నియోజకవర్గంలో కారు గుర్తుకు ఓటు వేయాలనీ కోరారు. ఈ కార్యక్రమంలో టిబిజికెఎస్ నాయకులు కెంగర్లమల్లయ్య,కనకం శ్యాంసన్,వడ్డెపల్లి శంకర్, శేషగిరి తదితరులు పాల్గొన్నారు.

## అభివృద్ధి చేశా... మరోసారి దీవించండి

- ఎమ్మెల్యే సుంకె రవిశంకర్



రామడుగు, అక్టోబర్ 20, (మనం న్యూస్): చొప్పదండి నియోజకవర్గాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేశానని, ఈ ప్రాంత ప్రజలు మరోసారి దీవించి తనకు ఘన విజయాన్ని అందించాలని ఎమ్మెల్యే, బిఆర్ఎస్ అభ్యర్థి సుంకె రవిశంకర్ విజ్ఞప్తి చేశారు. శుక్రవారం రామడుగు మండలంలోని వెదిర, దేశరాజుపల్లి, కొక్కెరకుంట, వొన్నారం గ్రామాల్లో ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ స్థానికున్నైనా తనకు మరోసారి అవకాశమివ్వాలని ఓటర్లకు విజ్ఞప్తి చేశారు. గతంలో స్థానికేతరులు ఎమ్మెల్యేలుగా గెలిచి నియోజకవర్గాన్ని అభివృద్ధి చేయలేకపోయారన్నారు. ఎన్నికల ముందు వచ్చి తర్వాత వెళ్లిపోయే నాయకులకు ఈ ప్రాంతం మీద మమకారం ఉండదని, ఐదేళ్ల కాలంలో తాను చేసిన అభివృద్ధిని చూసి మరోసారి అవకాశం కల్పించాలన్నారు. బిఆర్ఎస్ ఎన్నికల మేనిఫెస్టో అన్ని వర్గాల జీవితాల్లో వెలుగులు నింపుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో రామడుగు ఎంపీపీ కలిగెటి కవిత లక్మన్ ,మాజీ ఎంపీపీ మారుకొండ కిష్టారెడ్డి, సింగిల్ విండో చైర్మన్ ఒంటెల మురళి కృష్ణ రెడ్డి, పార్టీ మండల్ అధ్యక్షుడు జితేందర్ రెడ్డి, వివిధ గ్రామాల సర్పంచ్ లు, ఎంపిటిసిలు నాయకులు ప్రజలు పాల్గొన్నారు.

# ఘుమ్మరే గునుగు పూల జాతర ... తంగేడు తామరలు తల్లినీ చుట్టూరా.!

- వేములవాడలో కన్నులపండువగా సద్దుల బతుకమ్మ వేడుకలు
- ఆడపడుచుల అట పాటలతో మార్మోగిన దక్షిణ కాశి






వేములవాడ, అక్టోబర్ 20, (మనం న్యూస్): బతుకమ్మ బతుకమ్మ ఉయ్యాలో బంగారు బతుకమ్మ ఉయ్యాలో అంటూ ఆడపడుచుల అట పాటలతో వేములవాడ వీధులన్నీ మార్మోగాయి. గునుగు పూలు, తంగేడు తామరలు,వనితల చిరునవ్వులతో గౌరమ్మ తల్లి పరవశించిపోయింది పూల పండగలో చిన్నా పెద్ద ఏకమై బతుకమ్మ ఆటల్లో మునిగి తేలారు. తెలంగాణ రాష్ట్ర సంప్రదాయాల్లో అతి ముఖ్యమైన పండుగలో ఒకటైన బతుకమ్మ పండుగ ఉత్సవాల్లో భాగంగా వేములవాడలో శుక్రవారం సద్దుల బతుకమ్మ వేడుకలను కన్నులపండువగా నిర్వహించారు. ఆరు రోజుల పాటు ప్రతి సాయంకాలం బతుకమ్మ సంబురాలు జరుపుకున్న మహిళలు చివరి రోజు సద్దుల బతుకమ్మ వేడుకలకు అందంగా ముస్తాబయ్యారు. ఉదయం నుంచే రంగురంగుల పూలను సేకరించి తమ అభిరుచికి తగ్గట్టుగా బతుకమ్మలను పేర్చి గౌరమ్మకు ప్రత్యేకపూజలు చేశారు. తాము పేర్చుకున్న అందమైన బతుకమ్మలతో సాయంత్రం మహిళలు, యువతులు తెలంగాణ సంప్రదాయ గీతాలు ఆలపిస్తూ ఉత్సాహంగా బతుకమ్మలు ఆడారు.ఆడపడుచులు ఒకరి ఒకరు ప్రేమాప్యాయతలు



పంచుకుంటూ తమని తాము మైమరచిపోయారు. అనంతరంవేములవాడ మూలవాగు తీరంలోని బతుకమ్మ తెప్ప వద్ద ఏర్పాటు చేసిన మైదానంలో పెద్ద ఎత్తున మహిళలు చేరుకొని బతుకమ్మ ఆటలు ఆడారు. మహిళల ఉత్సాహం, ఆటపాటలతో బతుకమ్మ తెప్ప మైదానం మార్మోగింది.





పట్టణంలోని వివిధ వార్డుల్లో బతుకమ్మలు ఆడుకున్న మహిళలు బతుకమ్మ తెప్పె వద్ద రాత్రి పొద్దుపోయే దాకా ఆడుకున్నారు. ఆటపాటల అనంతరం బతుకమ్మ తెప్పలో గౌరమ్మ తల్లిని మహిళలు నిండు మనసుతో సాగనప్పారు.పోయి రావమ్మా గౌరమ్మ పిల్లాపాపాలను చల్లగా చూడమ్మ మళ్ళీ ఏడు రావమ్మా అంటూ మనస్ఫూర్తిగా వేడుకున్నారు. బతుకమ్మలను నిమజ్జనం చేసి ఆనందంగా కోలాటాలు ఆడిపాడారు. మహిళలు పరస్పరం వాయినాలు ఇచ్చిపుచ్చుకుని తెచ్చుకున్న ఫలహారాలు పంచిపెట్టుకున్నారు. మైదానంలో ప్రజలు బతుకమ్మ ఆటలు వీక్షించేందుకుగాను భారీ ఎల్డీ తెరలను ఏర్పాటు చేశారు.పలువురు మహిళలు విభిన్నంగా పేర్చిన బతుకమ్మలు పట్టణ ప్రజలను ప్రత్యేకంగా ఆకట్టుకున్నాయి. మూలవాగులో బతుకమ్మ సెల్ఫీలు,నృత్యాలతో యువతీ, యువకులు ఉత్సాహంగా ఆడిపాడారు. మూలవాగులో ఏర్పాటు చేసిన వేదికపై పలువురు ప్రముఖులు బతుకమ్మ ప్రాముఖ్యతను తెలిపారు. ఆనంతరం మహిళలు శ్రీ రాజరాజేశ్వర స్వామినీ దర్శించుకొని ఆలయ ప్రాంగణంలో కొలాటలు ఆడి బతుకమ్మ వేడుకలను ముగించారు. వేడుకల్లో ఏలాంటి సంఘటనలు చోటు చేసుకోకుండా పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాపతినిధులు, రాజకీయా నాయకులు, వివిధ సంఘాల ప్రతినిధులు, పాల్గొన్నారు.

## పటిష్టమైన భద్రతా ఏర్పాట్ల మధ్య ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాల ర్యాండమైజేషన్

- కలెక్టర్ బదావత్ సంతోష్

మంచిర్యాల ప్రతినిధి, అక్టోబర్ 20, (మనం న్యూస్): శాసనసభ ఎన్నికల నేపథ్యంలో జిల్లాలోని మూడు నియోజకవర్గాలకు పటిష్టమైన భద్రతా ఏర్పాట్లు, గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాల ర్యాండమైజేషన్, తరలింపు జరుగుతుందని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ బదావత్ సంతోష్ అన్నారు. శుక్రవారం జిల్లాలోని సమీకృత జిల్లా కార్యాలయాల భవన సమావేశ మందిరంలో 003-బెల్లంపల్లి నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి, జిల్లా అదనపు కలెక్టర్ బి. రాహుల్, జిల్లా అదనపు కలెక్టర్ సబావత్ మోతిలాల్, చెన్నూర్ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి సిడాం దత్తు, మంచిర్యాల నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి రాములుతో కలిసి ఎన్నికల విభాగం అధికారులు, గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాల ర్యాండమైజేషన్ ప్రక్రియపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఈవిఎం గోదాము నుండి ఈవిఎం, వివి పాట్లు బ్యాలెట్ యూనిట్లు, కంట్రోల్ యూనిట్లను శాసనసభ నియోజకవర్గాలకు తరలింపు, ఆయా నియోజకవర్గాలలోని స్ట్రాంగ్ రూమ్లలో భద్రపరచడం, స్ట్రాంగ్ రూమ్ల వద్ద 24 గంటల పాటు బందోబస్తు ఏర్పాట్లు చేయడం జరుగుతుందని, ప్రతి స్ట్రాంగ్ రూమ్కు డబుల్ లాక్ సిస్టమ్ ఏర్పాటు చేయడం జరుగుతుందని, ఒక లాక్ రిటర్నింగ్ అధికారి వద్ద, ఒక లాక్ సహాయ రిటర్నింగ్ అధికారి వద్ద ఉంటుందని తెలిపారు. జిల్లాలోని 002-చెన్నూర్ (ఎస్.సి.) నియోజకవర్గ పరిధిలో చెన్నూర్ పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల, 003-బెల్లంపల్లి నియోజకవర్గ పరిధిలో బెల్లంపల్లి పట్టణంలోని బజార్ ఏరియాలో గల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, 004-మంచిర్యాల నియోజకవర్గ పరిధిలో మంచిర్యాల పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో స్ట్రాంగ్ రూమ్లను ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. అగ్నిమాపక శాఖ, పోలీసు శాఖల సమన్వయంతో భద్రతా ఏర్పాట్లు చేయడం జరిగిందని, వెబ్ కెమెరాలు ఏర్పాటు చేసి నిరంతరం పర్యవేక్షించడం ద్వారా పూర్తి స్థాయిలో భద్రతా ఏర్పాట్లు చేయడం జరిగిందని తెలిపారు. నవంబర్ 3వ తేదీన నోటిఫికేషన్ విడుదల, 10వ తేదీ నామినేషన్ సమర్పించేందుకు ఆఖరు తేది అని, 13న నామినేషన్ల పరిశీలన, 15న అభ్యర్థులు నామినేషన్ ఉపసంహరణ, 30వ తేదీన పోలింగ్, డిసెంబర్ 3వ తేదీన కౌంటింగ్ జరుగుతాయని, ఎన్నికల నిబంధనలు డిసెంబర్ 5వ తేదీ వరకు అమలులో ఉంటాయని తెలిపారు. ఎన్నికలు సజావుగా సాగేందుడు జిల్లాలో 002-చెన్నూర్ (ఎస్.సి.) నియోజకవర్గంలో 227, 008-తెల్లంపల్లి (ఎస్.సి.) నియోజకవర్గంలో 227, 004-మంచిర్యాల నియోజకవర్గంలో 287 మొత్తంగా 741 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. నియోజకవర్గాలకు గాను 125 శాతం బ్యాలెట్ యూనిట్లు, 125 కంట్రోల్ యూనిట్లు, 140 శాతం వి.వి. ప్యాట్లను కేటాయించడం జరుగుతుందని, పోలింగ్ రోజును ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అదనంగా అందుబాటులో ఉంచడం జరుగుతుందని, భారత ఎన్నికల సంఘం ఉత్తర్వుల మేరకు చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. జిల్లాలో ఎన్నికల నిర్వహణకు గాను 1 వేయి 438 బ్యాలెట్ యూనిట్లు, అందుబాటులో ఉన్నాయని, ఎప్పటికప్పుడు వీటిని పరిశీలించడం జరుగుతుందని, 1 వేయి 134 కంట్రోల్ యూనిట్లు. 1 వేయి 113 వి.వి ప్యాట్లు ఉన్నాయని తెలిపారు. నూర్గానికి 284 బ్యాలెట్ యూనిట్లు, 284 కంట్రోల్ యూనిట్లు, 318 వి.వి. ప్యాట్లు, బెల్లంపల్లి నియోజకవర్గానికి 284 బ్యాలెట్ యూనిట్లు, 284 కంట్రోల్ యూనిట్లు, 318 వి.వి. ప్యాట్లు, మంచిర్యాల నియోజన వర్గానికి 369 బ్యాలెట్ యూనిట్లు, 359 కంట్రోల్ యూనిట్లు, 402 వి.వి. ప్యాట్లు కేటాయించడం జరుగుతుందని తెలిపారు. బ్యాలెట్ యూనిట్లు, కంట్రోల్ యూనిట్లు, వి.వి ప్యాట్లు పంపిణీ, తిరిగి భద్రపరిచే సమయంలో గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో ప్రక్రియ నిర్వహించడం జరుగుతుందని, పూర్తి స్థాయి భద్రతా ఏర్పాట్లు మధ్య తరలించడం జరుగుతుందని, ఆయా నియోజకవర్గాల పరిధిలోని స్ట్రాంగ్ రూమ్లలో భద్రపరిచే సమయంలో మళ్ళీ పరిశీలించి, గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో ప్రక్రియ జరుగుతుందని తెలిపారు. ప్రతి అంశాన్ని వీడియో చిత్రీకరించడం జరుగుతుందని తెలిపారు. ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాల కేటాయింపు, తరలింపుపై పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా వివరించారు. ఈ కార్యక్రమంలో ఎన్నికల విభాగం అధికారులు, గుర్తింపు పొందిన వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## రిటైర్డ్ బొగ్గు ఉద్యోగులకు పెన్షన్ పెంచాలని రాహుల్ గాంధీకి వినతి పత్రం

మంచిర్యాల, అక్టోబర్ 20, (మనం న్యూస్): రిటైర్డ్ బొగ్గు ఉద్యోగులకు పెన్షన్ పెంచాలని రాహుల్ గాంధీకి సింగరేణి రిటైర్డ్ అసోసియే షన్ నాయకులు, ఐఎన్‌టియుసి నాయకులు విజాపన పత్రం అందజేసారు. రాష్ట్రంలో జరుగుతున్న శాసనసభ ఎన్నికల ప్రచారంలో భాగంగా కాంగ్రెస్ యువ నాయకుడు రాహుల్ గాంధీ జిల్లాలో ప్రచారంలో భాగంగా వచ్చిన సందర్భంగా వీరు కలసి రిటైర్డ్ బొగ్గు ఉద్యోగులు ఎదురుకొంటున్న సమస్యలు వివరించారు. కోల్ ఇండియా రిటైర్డ్ ఉ ద్యోగులకు గత 25 సంవత్సరముల నుండి పెన్షన్ పెంపుదల లేకపో వడంవలన రిటైర్ అయిన రోజున నిర్ణయించిన పెన్షన్ జీవితాంతం పొందుతుండడం వలన అత్యంత దుర్భర పరిస్థితిని ఎదుర్కొంటున్నారని మరియు నామమాత్రపు వైద్య సౌకర్యాలు కల్పిస్తున్నట్లు రాహుల్ గాంధీకి తెలిపారు. ఈ సందర్భంగా సింగరేణి కోల్ మైన్స్ లేబర్ యూనియన్ ఐఎన్‌టియుసి మరియు సింగరేణి రిటైర్డ్ ఎంప్లా యిస్ వెల్ఫేర్ అసోసియేషన్ కాప్రా హైదరాబాద్ శాఖ అధ్యక్షుడు దం డంరాజు రాంచందర్ రావు, ఐఎన్‌టియుసి కేంద్ర కమిటీ సీనియర్ ఉపాధ్యక్షుడు గుమ్మడి కుమారస్వామి మరియు జనరల్ సెక్రెటరీ వంగ లక్షపతీ గౌడ్‌లు సంతకాలతో వినతి పత్రాన్ని రాహుల్ గాంధీకి అంద జేసారు. ఆయన ఈ విషయంలో సానుకూలంగా స్పందించి కేంద్ర ప్రభుత్వ దృష్టికి తీసుకుపోతానని రాహుల్ గాంధీ హామీ ఇచ్చారని వారు తెలిపారు ఈ వినతి పత్రాన్ని రాహుల్ గాంధీకి అందచేయటానికి మంథని శాసనసభ్యుడు శ్రీధర్ బాబు సహకరించినట్లువారు తెలిపారు.

## రాహుల్ గాంధీ పర్యటనతో బిఆర్ఎస్ నాయకుల్లో గుబులు

- కాంగ్రెస్‌కు ప్రజల్లో ఆదరణ చూసి తట్టుకోలేక పోతున్నారు
- నగర కాంగ్రెస్ అధ్యక్షుడు నరేందర్ రెడ్డి



కరీంనగర్, అక్టోబర్ 20, (మనం న్యూస్): రాహుల్ గాంధీ పర్యటనతో బిఆర్ఎస్ నాయకుల్లో గుబులు మొదలైందని, గురువారం జరిగిన కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ పాద యాత్ర కార్నర్ మీటింగ్ కు ప్రజల నుండి విశేష స్పందన లభించిందని నగర కాంగ్రెస్ అధ్యక్షులు కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి అన్నారు. దారి పొడుగునా పజలు స్వాగతం పలకడమే కాకుండా బిల్డింగ్‌లపై నుండి పూలు చల్లారని ప్రజలు స్వచ్ఛందంగా పాదయాత్రలో పాల్గొన్నారన్నారు. రాజీవ్ చౌక్ కార్నర్ మీటింగ్‌లో రాహుల్ గాంధీ ప్రసంగానికి కార్యకర్తలు ప్రజలు కాంగ్రెస్ పార్టీకి అనుకూలంగా నినాదాలు చేశారని నరేందర్ రెడ్డి పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీకి వస్తున్న ఆదరణను చూసి తట్టుకోలేక బిఆర్ఎస్ నాయకులు మంత్రి గంగుల కమలాకర్ తో పాటు అందరి పీటలకు బీటలు వారుతున్నాయని అవాకులు చవాకులు మాట్లాడుతున్నారన్నారు. మంత్రి గంగుల కమలాకర్ కర్ణాటక రాష్ట్రంలో ప్రభుత్వ పనితీరుపై అన్ని అబద్ధాలు మాటాడారని తెలంగాణలో పదేళ్ల అధికారంలో ఉండి ఇచ్చిన ఏ హామీ నెరవేర్చకుండా మోసం చేసి దయ్యాలు వేదాలు వల్లించినట్టు ఇచ్చిన ప్రతి హామీ నెరవేర్చుతున్న కర్ణాటక ప్రభుత్వ పనితీరుపై అబద్ధాలు మాట్లాడడం విడ్డూరంగా ఉందని అన్నారు. చిత్తశుద్ధి ఉంటే కర్ణాటక వెళ్లి చూసొద్దాం వస్తారా అని చాలెంజ్ విసిరారు. మీ నలభై శాతం కమీషన్ అవినీతి పాలనకు ఆఖరి గడియలు దగ్గర పడ్డాయని మీరేం మాట్లాడినా ప్రజలు వినే పరిస్థితి లేదని నరేందర్ రెడ్డి అన్నారు. కాంగ్రెస్ పార్టీ వల్ల లాభపడి అధికారం కోల్పోయిన ఇరవై నాలుగు గంటలు గడవక ముందే పార్టీ మారిన సునీల్ రావు కాంగ్రెస్ పార్టీని విమర్శించడమేంటనీ ఇప్పుడు మళ్లీ బిఆర్ఎస్ పార్టీ అధికారం కోల్పోయిన ఇరవై నాలుగు గంటలు గడవక ముందే కాంగ్రెస్ పార్టీ లో చేరడానికి పైరవీలు చేసేది ఆయనే అని నరేందర్ రెడ్డి ఎద్దేవా చేశారు. ఎవరెన్ని మాట్లాడిన కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడం ఖాయమని ఆ సంకేతాలు కనిపించడంతో బిఆర్ఎస్ నాయకులు తట్టుకో లేక పోతున్నారని అన్నారు.ఈ కార్యక్రమంలో గుండాటి శ్రీనివాస్ రెడ్డి, శ్రవణ్ నాయక్,దన్నసింగ్,షబానా మహమ్మద్, ఊరడి లత, జీడి రమేష్,ఎండి చాంద్,మెతుకు కాంతయ్య, మ్యాకల నర్సయ్య, షేక్ శోహైన్, దామోదర్, తిరుపతి, అష్రఫ్, సోహెల్, యోన, బషీర్, ఆంజనేయులు, సత్యనారాయణ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# అభివృద్ధిని చూసి ఆదరించండి

- కాంగ్రెస్ వస్తే కష్టాలు తప్పవు
- గులాబీ జెండానే ప్రజలకు అండ
- ఎమ్మెల్సీ భాను ప్రకాష్, ఎమ్మెల్యే దివాకర్ రావు
- బిఆర్ఎస్‌లో చేరిన 1500 మంది



లక్షెట్టిపేట్, అక్టోబర్ 20, (మనం న్యూస్): బిఆర్ఎస్ ప్రభుత్వం చేసిన అభివృద్ధిని చూసి ప్రజలు ఎన్నికల్లో హ్యాట్రిక్ విజయం అందించి ఆదరించాలని ఆ పార్టీ విప్, ఎమ్మెల్సీ భాను ప్రకాష్, ఎమ్మెల్యే దివాకర్ రావులు అన్నారు. శుక్రవారం పట్టణంలోని ఎస్వీఆర్ గార్డెన్‌లో పలు పార్టీల నాయకులు, కార్యకర్తలు బిఆర్ఎస్ కండువా కప్పుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ భాను ప్రకాష్ మాట్లాడుతూ ఓటుకు నోటు కేసులో దొరికిన కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడికి, ఆ పార్టీకి ఎన్నికల్లో ఓట్లు అడిగే అర్హత లేదన్నారు. ప్రజలకు అండగా బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ఎన్నో సంక్షేమ కార్యక్రమాలు చేపట్టి దేశానికే ఆదర్శంగా నిలిచారని కొనియాడారు. కాంగ్రెస్ పార్టీలో నాయకులకు, కార్యకర్తలకు విలువ లేదన్నారు. ప్రజలు అభివృద్ధిని చూసి ఎన్నికల్లో హ్యాట్రిక్ విజయాన్ని బీ ఆర్ ఎస్ కు కట్టబెట్టాలని కోరారు. అంతకుముందు తాజా మాజీ ఎమ్మెల్యే దివాకర్ రావు మాట్లాడుతూ గులాబీ జెండాతోనే ప్రజలకు న్యాయం జరుగుతుందని వివరించారు. ఆసరా, కళ్యాణ లక్ష్మి, రైతు భీమా, రైతు బంధు, ఉచిత విద్యుత్ ఇంకా ఎన్నో పథకాలు దేశానికే ఆదర్శంగా నిలిచాయన్నారు. ఇంకా నూతన పథకాలతో ప్రజలకు మరింత సేవలు అందిస్తామని తెలిపారు. పేకాట క్లబ్ నాయకులకు అధికారం ఇస్తే మీ పిల్లల భవిష్యత్ నాశనం అవుతుందన్నారు. పొరపాటున ప్రేమ్ సాగర్ రావుకు ఓటు వేస్తే తనకు ఉన్నటువంటి రూ. 800 కోట్ల అప్పును ఈ మంచిర్యాల నియోజకవర్గం పై రాబడతాడని హెచ్చరించారు. ఎంతో మంది దగ్గర అప్పులు చేసిన ఘనత ప్రేమ్ సాగర్ రావుకే దక్కిందన్నారు. ప్రజలు అప్రమత్తంగా లేకుంటే నియోజకవర్గంలో ప్రశాంతంత లేకుండా పోతుందని వివరించారు. అనంతరం జడ్పీటీసీ ముత్తే సత్తయ్య ఆధ్వర్యంలో పలు గ్రామాల నుంచి సుమారు పదిహేను వందల మంది నాయకులు, కార్యకర్తలు బీఆర్ఎస్ కండువా కప్పుకున్నారు. అంతకుముందు పాత బస్ స్టాండ్ నుంచి అంబేద్కర్ చౌక్ వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపీ వెంకటేష్ నేత, మాజీ ఎమ్మెల్యే అరవింద రెడ్డి,జడ్పీటీసీ ముత్తే సత్తయ్య, మున్సిపల్ చైర్మన్ నల్మాసు కాంతయ్య,డీసీఎమ్మెస్ లింగన్న, మాజీ డీసీఎమ్మెస్ కేతిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి, పార్టీ అధ్యక్షులు పాదం శ్రీనివాస్, చుంచు చిన్నయ్య, సర్పంచ్‌లు చుంచు రవి, రాగుల రాజేశం, మాజీ ఎంపీపీ కట్ల చంద్రయ్య, బీఆర్ఎస్ యూత్ మండలధ్యక్షుడు అంకతి గంగాధర్, నాయకులు, కార్యకర్తలు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

# దుర్గాదేవి నిమజ్జనానికి పకడ్బందీ ఏర్పాట్లు చేయాలి

- బతుకమ్మ పండుగకు లైటింగ్, సానిటేషన్ పనులు చేపట్టాలి
- రావణ దహనానికి రాజకీయపరమైన కార్యక్రమాలు నిషేధం
- ఎన్నికల నిబంధనల ప్రకారం పటిష్ట చర్యలు చేపట్టాలి
- జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ గోపి




కరీంనగర్ బ్యూరో, అక్టోబర్ 20, (మనం న్యూస్): దుర్గాష్టమిని పురస్కరించుకొని దేవి నవరాత్రుల అనంతరం అమ్మవారి విగ్రహాల నిమజ్జనానికి పటిష్ట ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ బి.గోపి సంబంధిత అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో వివిధ శాఖల అధికారులతో అమ్మవారి విగ్రహాల నిమజ్జనం, బతుకమ్మ, దసరా పండుగ ఏర్పాట్లపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, శరన్నవరాత్రోత్సవాల్లో భాగంగా మండపాల్లో ప్రతిష్ఠించిన దుర్గాదేవి విగ్రహాల నిమజ్జనం కొరకు మానకొండూర్, కొత్తపల్లి, చింతకుంట, రేకుర్తి, ఇతర ప్రాంతాలలో ఏర్పాట్లు చేపట్టాలని అన్నారు. చెరువులలో నిమజ్జనం కొరకు అవసరమయ్యే నీటిని నింపాలని, చెరువుల వద్ద క్రెయిన్‌లు, లైటింగ్ మరియు సానిటేషన్ పనులు చేపట్టాలని సూచించారు. కార్యక్రమాలను దృష్టిలో పెట్టుకొని ప్రత్యేక మెడికల్ క్యాంపులను ఏర్పాటు చేయాలని జిల్లా వైద్యాదికారిని ఆదేశించారు. దసర పండుగ సందర్భంగా రావణదహణ కార్యక్రమాలకు ఎన్నికల నియావళి మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ ఉల్లంఘన జరగకుండా కార్యక్రమ నిర్వాహకులు ముందస్తు అనుమతిని తీసుకోవా ల్సిందిగా సూచించారు. ఈ కార్యక్రమంలో సిపిఎల్. సుబ్బారాయుడు, అదనపు కలెక్టర్లు ప్రఫుల్ దేశాయ్, లక్ష్మి కిరణ్, ఇంచార్జి డిఆర్ఓ పవన్ కుమార్, అడిషనల్ డిసిపి శాంతిభద్రతలు లక్ష్మీనారాయణ, కరీంనగర్ డిపిఓ వీరబుచ్చయ్య, జిల్లా వైద్య అధికారి లలిత దేవి,ఆర్డిఓ కె. మహేశ్వర్, ఎసిపిలు, మున్సిపల్ కమీషనర్లు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

# సంక్షేమాభివృద్ధి ఫలాలు అర్హులను లబ్ధిదారులకు అందేలా చర్యలు

- కలెక్టర్ బదావత్ సంతోష్

మంచిర్యాల ప్రతినిధి, అక్టోబర్ 20, (మనం న్యూస్): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాల ఫలాలు అర్హులైన లబ్ధిదారులకు అందేలా చర్యలు చేపడుతున్నట్లు కలెక్టర్ బదావత్ సంతోష్ అన్నారు. శుక్రవారం జిల్లాలోని సమీకృత జిల్లా కార్యాలయాల భవన సమావేశ మందిరంలో సెంట్రల్ సెక్రటేరియట్ సర్వీస్ నుండి అసిస్టెంట్ సెక్షన్ ఆఫీసర్స్ ప్రొబేషనర్స్ (ఎఎస్ఓ)లు శిక్షణా కార్యక్రమం కోసం (ఎఫ్.టి.పి.)లో భాగంగా మన జిల్లాకు వచ్చిన బృంద ప్రతినిధులతో సమావేశం నిర్వహించి జిల్లాలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలచే అమలు చేయబడుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలపై అధ్యయనం చేసి పరిశీలించిన అంశాలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ సెంట్రల్ సెక్రటేరియట్ సర్వీస్ నుండి అసిస్టెంట్ సెక్షన్ ఆఫీసర్స్ ప్రొబేషనర్స్ (ఎ.ఎస్.ఓ.)లు శిక్షణా కార్యక్రమం కోసం (ఎఫ్.టి.పి.)లో భాగంగా బృంద ప్రతినిధులు జిల్లాలోని లక్షెట్టిపేట మండలంలోని గుల్లకోట, హాజీపూర్ మండలంలోని దొనబండ, తాండూర్ మండలంలోని మాదారం, బెల్లంపల్లి మండలంలోని పాతబెల్లంపల్లి, భీమిని మండలంలోని బిట్టూర్పల్లి గ్రామ పంచాయతీలలో కొనసాగుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను పరిశీలించడం జరిగిందని తెలిపారు. జిల్లాలో సర్వశిక్షా అభియాన్ క్రింద రెండు / మూడు గ్రామాలకు ఒక ఉప కేంద్రం పని చేస్తుందని, జిల్లాలోని గ్రామాలలో ఏర్పాటు చేసిన సెగ్రిగేషన్ షెడ్లలో ఉపయోగకర వ్యర్థాల ద్వారా సేంద్రియ ఎరువు తయారు చేసి విక్రయించి ఆదాయం సమకూర్చడం జరుగుతుందని, ఈ ప్రక్రియపై ఒక డాక్యుమెంటేషన్ రూపొందించి ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. మన ఊరు – మన బడి కార్యక్రమంలో మొదటి విడతలో 248 పాఠశాలలను ఎంపిక చేసి 12 రకాల విభాగాలలో అభివృద్ధి పనులు చేపట్టడం జరిగిందని, గ్రీన్ చాక్ బోర్డ్, మూత్రశాలలు, శౌచాలయాలు, వంట శాలలు, భోజనశాలలు, ప్రహరీగోడ తదితర అభివృద్ధి పనలను చేపట్టడం జరిగిందని తెలిపారు. ప్రతి గ్రామంలో వైకుంఠధామం, డంపింగ్ యార్డు, నర్సరీ, క్రీడా ప్రాంగణం, పల్లెప్రకృతి వనం, బృహత్ పల్లెప్రకృతి వనం ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకంలో జిల్లాలో ఆయా గ్రామాలలో చేపడుతున్న పనుల ఆధారంగా కూలీలకు ఉపాధి కల్పించడం జరుగుతుందని తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సంక్షేమ పథకాలను అర్హులైన లబ్ధిదారులకు అందేలా సంబంధిత శాఖల సమన్వయంతో కార్యాచరణ అమలు చేయడం జరుగుతుందని తెలిపారు. బృంద ప్రతినిధులు మాట్లాడుతూ తమ అధ్యయనంలో భాగంగా జిల్లాలోని ఎంపిక చేయబడిన గ్రామాలలో చేపట్టిన పరిశీలన కొరకు అన్ని సదుపాయాలు కల్పించినందుకు ధన్యవాదములు తెలుపుతూ జిల్లా కలెక్టర్కు మెమోంటో అందజేశారు,ఈ కార్యక్రమంలో జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణ అధికారి నరేందర్, జిల్లా పంచాయతీ అధికారి వెంకటేశ్వర్రావు, జిల్లా వ్యవసాయ అధికారి కల్పన, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.



## ఖాజీపూర్‌లో వైభవంగా బతుకమ్మ సంబరాలు



కొత్తపల్లి, డిసెంబర్ 20, (మనం న్యూస్): కొత్తపల్లి మండలం ఖాజీపూర్ గ్రామంలో సద్దుల బతుకమ్మ పండుగ వేడుకలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. గ్రామంలో ఏడవరోజు సద్దుల బతుకమ్మ పండుగ జరుపుకునే ఆనవాయితీ ప్రకారం మహిళలు ఆడపడుచులు తీరొక్కపువ్వులతో రకరకాల అందమైన బతుకమ్మలు పేర్చి ఘనంగా బతుకమ్మ ఆడుకున్నారు. గ్రామంలోని మహిళలు ఆడపడుచులంతా ఒకచోట తమ బతుకమ్మలను చేర్చి వైభవంగా బతుకమ్మ సంబరాలు చేసుకున్నారు. మహిళలు ఆడపడుచులు దాండియా నృత్యాలు గర్బ నృత్యాలుతో ఆడిపాడి మురిసి పోయారు. ఈ సందర్భంగా కాజీపూర్ సర్పంచ్ ఇల్లందుల రాజమ్మ మాట్లాడుతూ ప్రతి ఏటా వేములవాడ ఆనవాయితీలోని తమ ఊర్లో కూడా ఏడు రోజుల్లోనే సద్దుల బతుకమ్మ నిర్వహిస్తామని బతుకమ్మ పండుగ సందర్భంగా పండుగ నిర్వహణకు ఘనమైన ఏర్పాట్లు చేసి బతుకమ్మను వైభవంగా నిర్వహించే విధంగా అన్ని రకాల సదుపాయాలు కల్పిస్తామని తెలియజేశారు.

## క్రీడల్లో ప్రతిభను చాటి సింగరేణికి పేరు తేవాలి



నస్పూర్, అక్టోబర్ 20 (మనం న్యూస్): క్రీడాకారులు కోల్ ఇండియా స్థాయిలో తమ ప్రతిభను చాటి సింగరేణి సంస్థకు పేరుతెవాలని సింగరేణి డైరెక్టర్ ఈ అండ్ ఎం సత్యనారాయణ తెలిపారు. శుక్రవారం శ్రీరాంపూర్ లోని ప్రగతి స్టేడియంలో కంపెనీ లెవెల్ హాకీ ఫైనల్ పోటీల్లో గెలుపొందిన క్రీడాకారులకు బహుమతులను ప్రదానం చేసిన అనంతరం ఆయన మాట్లాడుతూ సింగరేణి సంస్థలో పనిచేస్తున్న ఉద్యోగులు వివిధ క్రీడాంశాలలో ప్రతిభను చాటడం సంతోషకరమైన విషయమన్నారు. సింగరేణి స్థాయి హాకీ పోటీలలో శ్రీరాంపూర్ ఏరియాలో నిర్వహించుకోవడం అభినందించదగిన విషయమని, ఈ పోటీలలో గెలుపొందిన జట్టు సభ్యులకు అభినందనలు తెలిపారు. కోల్ ఇండియా స్థాయిలో కూడా క్రీడాకారులు తమ ప్రతిభను చాటి సింగరేణి సంస్థ పేరు పెంపొందించాలని కోరారు. ఫైనల్ పోటీలలో కొత్తగూడెం కార్పొరేట్ జట్టు ప్రథమ బహుమతి, శ్రీరాంపూర్ ఏరియా జట్టు కు ద్వితీయ బహుమతి లభించింది. ఈ కార్యక్రమంలో శ్రీరాంపూర్ ఏరియా జీఎం సంజీవ రెడ్డి, డిజిఎం (పి) అరవింద రావు, ఆర్కే 5 అండ్ 6 గ్రూప్ గనుల ఏజెంట్ ఏవీ రెడ్డి , సీనియర్ సెక్యూరిటీ ఆఫీసర్ శ్రీ మురళీమోహన్, స్పోర్ట్స్ హానరరి సెక్రటరీ పాలకుర్తి రాజు, స్పోర్ట్స్ సూపర్వైజర్ చాట్ల అశోక్, ఇంచార్జ్ స్పోర్ట్స్ మేనేజర్ జాన్వెస్లీ , స్పోర్ట్స్ కో ఆర్డినేటర్ సురేష్ అన్ని ఏరియాల స్పోర్ట్స్ సూపర్వైజర్లు తదితరులు పాల్గొన్నారు.

## శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర స్వామికి ప్రత్యేక పూజలు



చిగురుమామిడి, అక్టోబర్ 20 (మనం న్యూస్): కోరిన కోరికలు తీర్చి కొంగుబంగారంగా వెలుగొందుతునన్న కరీంనగర్ జిల్లా చిగురుమామిడి స్వయంభు పాంబండ పంచముఖ ఆంజనేయ స్వామి వారి దివ్య క్షేత్రంలో షష్టి తిథిన శుక్రవారం ఆంజనేయ స్వామికి ప్రత్యేక పూజా కార్యక్రమాలను శ్రీశ్రీ గురూజీ ఉమేష్ స్వామి చేతుల మీదుగా అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీవల్లి దేవసేన సమితి సుబ్రహ్మణ్య స్వామికి అత్యంత వైభవంగా పూజా కార్యక్రమాలు నిర్వహించారు.నూతనంగా నిర్మిస్తున్న ఆంజనేయ స్వామి ఆలయ నిర్మాణానికి భక్తులు తోచిన విధంగా సహాయ సహకారాలు అందించాలని వారు కోరారు. హైదరాబాద్, కరీంనగర్, నిజామాబాద్, మెట్టుపల్లి, జగిత్యా, సిద్దిపేట, హుస్నాబాద్, వరంగల్, మంచిర్యాల్, కోహెడ, ఎల్కతుర్తి సుదూర ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారికి ప్రత్యేక హోమం కార్యక్రమం నిర్వహించుకొని స్వామివారి కృపకు పాత్రులు అయ్యారు. ఈ కార్యక్ర మంలో అర్చకులు పవన్‌శర్మ, భక్తులు ఆలయ ధర్మకర్తలు మోహన్ రెడ్డి, తెరాల సత్యనారాయణ, తేరాలా అమర్, ఐరెడ్డి ధర్మేందర్ రెడ్డి, సునీల్ కుమార్, ప్రవీణ్ కుమార్, కోనేటిసాగర్, స్వామి, గుంటిపల్లి సంతోష్, మోటం రాజు, గుండ శ్రీకాంత్ పటేల్, తదితరులు పాల్గొన్నారు.



# పురుగుల మందుల పిచికారిలో జాగ్రత్తలు తీసుకోవాలి

- రైతులకు రక్షణ దుస్తులు పంపిణీ

చిగురుమామిడి, అక్టోబర్ 20 (మనం న్యూస్): కరీంనగర్ జిల్లా చిగురుమామిడి మండలంలోని సుందరగిరి గ్రామ రైతు వేదికలో డబ్ల్యూ డబ్ల్యూ ఎఫ్ వారి నవ క్రాంతి రైతు ఉత్పత్తిదారుల సంస్థ, బి. సి.ఐ ప్రాజెక్టు ఆధ్వర్యంలో వివిధ గ్రామాల రైతులు,రైతు కూలీలకు పిచికారి సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి తెలిపారు.ఈ సందర్భంగా రైతులు పురుగుమందు పిచికారి చేసే సమయంలో తప్పనిసరిగా తలకి హెల్మెట్, ముక్కుకి మాస్కు కళ్ళకు అద్దాలు, చేతులకు గ్లౌస్లు, శరీరాన్ని మొత్తం కప్పి ఉంచే విధంగా నిండుగా ఉండే దుస్తులు ధరించి పిచికారి చేయాలని, పిచికారి సమయంలో గర్భిని, బాలింతలు ఆ ప్రదేశానికి వెళ్లొద్దని,పిచికారి చేసేవారు 18సంవత్సరాలు పైబడిన వారే పిచికారి చేయాలని, శిక్షణ నైపుణ్యం, ఆరోగ్యంగా ఉన్నవారే స్ప్రే చేయాలని, పిచికారి చేసేటప్పుడు ఒక్కటే పురుగుమందు వాడాలని, వాడిన పురుగు మందును మళ్లీ మళ్లీ వాడరాదని, రెండు మూడు రకాల పురుగు మందులు కలిపి కొట్టరాదని, ఖాళీ పురుగుమందు డబ్బాలను సరైన పద్ధతిలో నాశనం చేయాలని,14సంవత్సరాలలోపు పిల్లలతో ఎలాంటి పనులు చేయించరాదని, కూలీలకు వేతన చట్ట ప్రకారము వేతనం ఇవ్వాలని, మోనోక్రోటోపస్ లాంటి అత్యధిక విషపూరితము కలిగి ఉన్న ఎరుపు రంగు గుర్తు కలిగిన పురుగుమందులను వాడరాదని, రైతులు పిచికారి చేసేటప్పుడు రక్షణ దుస్తులు ధరించకపోతే పురుగుమందు ప్రభావానికి గురై రకరకాల జబ్బులు,క్యాన్సర్లు, ఆరోగ్య సమస్యలువస్తాయని తెలపడం జరిగింది.రైతులందరికీ రక్షణ దుస్తులు అందజేయడం జరిగింది.ఈ కార్యక్రమంలో ప్రాజెక్టు కోఆర్డినేటర్ బి సతీష్ కుమార్, ప్రాజెక్టు మేనేజర్ సింధు,ఏఈఓ శ్రీనివాస్, సమన్వయకర్తలు రమేష్, జితేందర్ రెడ్డి ఆయా గ్రామాల రైతులు పాల్గొన్నారు.



## సుజిత్ రావుకు టికెట్ కేటాయించాలి

- కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు ఖుతుబోద్దిన్ పాషా



మెట్‌పల్లి టౌన్, అక్టోబర్ 20, (మనం న్యూస్): కోరుట్ల నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా కల్వకుంట్ల సుజీత్ రావుకు అవకాశమివ్వాలని ఆ పార్టీ పట్టణ అధ్యక్షుడు మహమ్మద్ ఖుతుబోద్దిన్ పాషా కోరారు. శుక్రవారం రాహుల్ గాంధీ చేపట్టిన విజయోత్సవ యాత్రలో భాగంగా కోరుట్ల కు వచ్చిన కాంగ్రెస్ అగ్ర నేతలు ములుగు ఎమ్మెల్యే సీతక్క, కోమటిరెడ్డి వెంకటరెడ్డి, మాజీ పిసిసి అధ్యక్షుడు ఉత్తంకుమార్ రెడ్డి, మధుయాష్కి, గౌడ్‌లను కలిసిన ఆయన సుజీత్‌రావు అభ్యర్థిత్వాన్ని ఖరారు చేసేలా కృషి చేయాలని విజ్ఞప్తి చేశారు.

# సింగరేణి కార్మికులకు దసరా జోష్

మంచిర్యాల, అక్టోబర్ 20, (మనం న్యూస్): సింగరేణి కార్మికులలో దసరా జోష్ నెలకొన్నది. సింగరేణి కార్మికులకు దసరా పండుగ పైసల ఫిఖర్ తొలగిపోయింది. ఎట్టకేలకు 711 కోట్ల రూపాయల 32శాతం లాభాల వాటాను శుక్రవారం సింగరేణి యాజమాన్యం కార్మికుల ఖాతాలో జమ చేశారు. దసరా పండుగ అడ్వాన్స్ పైకాన్ని శనివారం కార్మికుల ఖాతాలో జమ చేయనుంది. ఈ మేరకు శుక్రవారం సింగరేణి యాజమాన్యం అన్ని ఏరియాల పే రోల్ సెక్షన్ ఏరియ టెర్మినల్ బెనిఫిట్ సెల్ అధికారులకు అన్ని వివరాలతో కూడిన ఉత్తర్వులను జారీ చేసింది. లాభాల వాటా 32 శాతంను 2022–23 ఏడాదికి చెల్లింపు జరుపుతున్నట్లు, 01.10.2023 వరకు ఆన్ రోల్‌లో ఉన్న కార్మికులకు మాత్రమె ఇస్తున్నట్లు యాజమాన్యం తెలిపింది. ఇక్కడ ఒక విషయం ఏమిటంటే 2022–23లో రిటైర్డ్ ఐన కార్మికులకు వారి ఆర్థిక పరిస్థితి దృష్ట్యా ఈ నెల 21న లాభాల వాటా చెల్లించడానికి సింగరేణి యాజమాన్యం ఒప్పుకుందని గుర్తింపు సంఘం టిబిజికెఎస్‌తో సహా మిగతా జాతీయ సంఘాలు కూడా ఒక వారం కిందట ప్రకటించాయి. ఐతే ఇప్పటి చెల్లింపులో రిటైర్డ్ ఐన కార్మికుల గురించి అసలు ప్రస్తావనే లేదు. కనీసం వీలు చూసుకుని త్వరలో రిటైర్డ్ ఐన వారికి చెల్లిస్తామన్న మాటను కూడా సింగరేణి సంబంధిత అధికారులు చెప్పకపోవడంతో మాజీ కార్మికులు అవేదన వ్యక్తం చేస్తున్నారు. పండుగ ఎవరికైనా పండుగానే కదా మేము మా కుటుంబాలతో దసరా పండుగను జరుపుకోవద్దా అని అంటున్నారు. ఇప్పిస్తామని చెప్పిన వివిధ సంఘాల నాయకులు దీనికి సమాధానం చెప్పాలి. ఇదిలా ఉంటె కార్మిక సంఘాల ఆందోళనకు స్పందించి యాజమాన్యం 32 శాతం లాభాల వాటా ఈరోజు వేయడం జరుగుతుందని, రేపు పండగ అడ్వాన్స్ చెల్లింపు జరగనుందని సింగరేణి కాలరీస్ ఎంప్లాయిస్ యూనియన్ (సిఐటియు) రాష్ట్ర అధ్యక్షుడు తుమ్మల.రాజారెడ్డి, జనరల్ సెక్రటరీ మంద.

నరసింహారావులు అన్నారు. ఇక సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) డిప్యూటీ జనరల్ సెక్రెటరీ, ముస్కే సమ్మయ్య మాట్లాడతూ. లాభాల్లో వాటా, పం డుగ అడ్వాన్సుపై ఉత్కంఠ వీడిందని అన్నారు. ఈనెల 16 తారీకు నుండి శుక్రవారం సాయంత్రం 5.30 గంటలవరకు లాభాల వాటా మరియు పం డుగ అడ్వాన్సుపై కార్మికవర్గం ఆందోళన చెందుతున్న విషయం తెలిసిందే నని, ఎప్పుడైతే ఎన్నికల కోడ్ పేరుతొ మనకు రావాల్సిన డబ్బులు నిలిపివేసిన ప్పుడు వెంటనే తమ యూనియన్ ఆధ్వర్యంలో 21వ తేదీన ఒక రోజు టోకెన్ సమ్మెకు పిలుపివ్వడం జరిగిందని, వెంటనే యాజమన్యం కసరత్తు ప్రారంభించిందని, దాని ఫలితమే ఈరోజు సాయంత్రం 6 గంటలకు కార్మికుల అకౌంట్లో డబ్బులు జమ కానునట్లు యాజమాన్యం తెల్పిందని, కావున రేపు జరిగే ఒక రోజు టోకెన్ సమ్మెను విరమించు కుంటున్నట్లు, ఇది కార్మికవర్గ విజయంగా భావించాలని ఆయన విజ్ఞప్తి చేసారు.

## మంకమ్మతోటలో అన్నదాన కార్యక్రమం



కరీంనగర్, అక్టోబర్ 20, (మనం న్యూస్): స్థానిక మంకమ్మతోటలోని 36వ డివిజన్‌లో బెజ్జంకి ఉషా సత్యం(యుఎస్ఎ), బెజ్జంకి సౌజన్య శ్రీనివాస్ (యుఎస్ఎ), బెజ్జంకి స్పందన శ్రీకాంత్, బెజ్జంకి తారిక శ్రీధర్ (యుఎస్ఎ)ల ఆధ్వర్యంలో శుక్రవారం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా హాజరైన హిందూ వాహిని జిల్లా అధ్యక్షులు, ప్రముఖ న్యాయవాది బెజ్జంకి శ్రీకాంత్ మాట్లాడుతూ అన్నదాన కార్యక్రమం అన్నింటికన్న శ్రేష్టమైనదని చెప్పారు. ప్రతి ఏటా బెజ్జంకి వారి కుటుంబం పలు సేవా కార్యక్రమాలు అన్నదాన కార్యక్రమాలు చేస్తూ ఉదారతను చాటుతు న్నారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ గుగ్గిళ్ళ జయ శ్రీ శ్రీనివాస్, నాయకులు తేజ, సాయి,అనుదీప్, ప్రణీత్, మధు, మృత్యుంజయ, హేమంత్, అభిషేక్, సాయి పవన్, సందీప్, రమాకాంత్, శివరాజ్, ఆదర్శ్, శ్రీకర్, భరత్, తదితరులు పాల్గొన్నారు.

# తెలంగాణలో అవినీతి రాజ్యమేలుతోంది

- కాంగ్రెస్ అధికారంలోకి రాగానే తిన్న ప్రతి పైసా కక్కిస్తాం
- రాచరిక పోకడలు, ప్రజాస్వామ్యానికి మధ్య ప్రస్తుత ఎన్నికలు
- కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ




ఆర్మూర్ / మెట్ పల్లి, అక్టోబర్ 20, (మనం న్యూస్): తెలంగాణాలో అవినీతి రాజ్యమేలుతోంది గత పదేళ్లగా కెసిఆర్ కుటుంబం రాష్ట్రంలోని సొమ్మునంతా దోచుకుంటోంది. ఇక వారి ఆటలు సాగవు.. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే వారు తిన్న ప్రతి పైసా కక్కిస్తాం.. వారు దోపిడీ చేసిన సొమ్మంతా పేద ప్రజలకు అందిస్తామని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ వ్యాఖ్యానించారు. శుక్రవారం కాంగ్రెస్ పార్టీ చేపట్టిన ప్రచార యాత్రలో భాగంగా జగిత్యాల నుండి ఆర్మూరు వెళ్లే సందర్భంగా మెట్ పల్లి తో పాటు ఆర్మూర్‌లో జరిగిన రోడ్‌షోలో ఆయన మాట్లాడుతూ తెలంగాణలో జరుగుతున్న ఎన్నికలు రాచరిక పోకడలు ప్రజాస్వామ్యానికి మధ్యన జరుగనున్నాయన్నారు. ప్రత్యేక తెలంగాణలో ప్రజల గొంతు వినిపిస్తుందని భావిస్తూ దొరలు ప్రజల గొంతు నొక్కేశారన్నారు. తెలంగాణలో ప్రజల రాజ్యం నడవాలని సోనియమ్మ తెలంగాణ ఇచ్చారన్నారు. ఈ రాష్ట్రం ఒకే కుటుంబం చేతిలో బందీ అయిందని, ఇకపై ఇలాంటి ఆటలు సాగవన్నారు. కేసీఆర్ కుటుంబం అవినీతిలో కూరుకు పోయిందని, పదేళ్లుగా ప్రజల సొమ్ము దోచుకున్నారని రాహుల్ ఆరోపించారు. బిజెపి, బిఆర్ఎస్ రెండు ఒకే తాను ముక్కలని, బిజెపితో పోరాడిన తనపై 24 కేసులు పెట్టారన్నారు. విపక్షాలపై కేసులు పెట్టె ప్రధాని మోదీ కేసీఆర్ పై ఎందుకు పెట్టడం లేదో ప్రజలు ఆలోచించాలన్నారు. బలం లేకపోయినా ఎంఐఎం అన్ని రాష్ట్రాల్లో పోటీ చేస్తోందని, బీజేపీకి మద్దతుగా కాంగ్రెస్ ను ఓడించేందుకే ఎంఐఎం పోటీలో నిలుస్తోందని వ్యాఖ్యానించారు. ఎంఐఎం ఎక్కడెక్కడ పోటీ చేయాలో బిజెపి నిర్ణయిస్తోందని రాహుల్ పేర్కొన్నారు. రాష్ట్రంలో బీఆరెస్‌ను, రాజస్థాన్, మధ్యప్రదేశ్, ఛత్తీస్ గడ్ లో బీజేపీ ని ఓడించి కాంగ్రెస్ విజయపతాకాన్ని ఎగురవేస్తామని ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో టిపిసిసి అధ్యక్షులు రేవంత్ రెడ్డి, ఎమ్మెల్యేలు సీతక్క, దుద్దిల శ్రీధర్ బాబు, ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి, సీనియర్ కాంగ్రెస్ నాయకులు జువ్వాడి నరసింహారావు, కోమటిరెడ్డి వెంకటరెడ్డి, మాజీ ఎమ్మెల్యే జ్యోతక్క, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, సుజిత్ రావ్, కొమిరెడ్డి లింగారెడ్డి, మాజీ కౌన్సిలర్ షాకిర్ సిద్ధికి తదితరులు పాల్గొన్నారు.

## వైభవంగా బోనాల జాతర



మెట్ పల్లి టౌన్, అక్టోబర్ 20, (మనం న్యూస్): స్థానిక మున్నూరు కాపు సంఘం, యువజన సమాఖ్య సంఘాల ఏర్పాటు చేసిన నవదుర్గ మండపం ఆధ్వర్యంలో శుక్రవారం అత్యంత వైభవంగా బోనాలు జాతర నిర్వహించారు. ఈ సందర్భంగా పిల్లలు దేవతామూర్తుల వేషధారణలో జాతరలో పాల్గొని అలరించారు. ఈ కార్యక్రమంలో పుప్పాల లింబాద్రి, బొడ్ల రమేష్, బొడ్ల శ్రీనివాస్, రాజు, గౌతం, ఆనంద్, శ్రీకాంత్, నరేష్, ఆకుల లక్ష్మి, జలంధర్ తదితరులు మహిళలు పెద్ద ఎత్తున భక్తులు పాల్గొన్నారు.

## భక్తులకు సరస్వతీ దేవిగా దర్శనమిచ్చిన దుర్గామాత



ఇల్లందకుంట, అక్టోబర్ 20, (మనం న్యూస్): ఇల్లందకుంట మండల కేంద్రంలో దేవి శరన్ననవరాత్రిత్సవాల్లో భాగంగా ఆరవ రోజున శుక్రవారం సరస్వతిదేవి అవతారంలో అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా మండప ప్రాంగణంలో అత్యంత వైభవంగా మహా చండీయాగం నిర్వహించారు. వేద మంత్రోచ్చారణల మధ్య దుర్గాదేవిని స్తుతిస్తూ హోమాది కార్యక్రమాలు నిర్వహించారు ఈ కార్యక్రమంలో కట్టంగూర్ రాంస్వరన్ రెడ్డి , దుర్గా స్వాములు కౌశిక్, సాయికుమార్, హరీష్, దుర్గాప్రసాద్, విజయబాబు, రమేష్, నరేష్, రాజు, వినయ్,ప్రణీత్ రవికిరణ్,తరుణ్ భక్తులు గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## జర్నలిస్టులపై కేసులు అప్రజాస్వామికం

- బిఆర్ఎస్ మళ్లీ గెలిస్తే రాష్ట్రం నాశనమవుతుంది
- ప్రజామిత్ర అధ్యక్షులు కొరివి వేణుగోపాల్



కరీంనగర్ కలెక్టరేట్, అక్టోబర్ 20, (మనం న్యూస్): ప్రజలకు ప్రభుత్వానికి మధ్య వారధిగా ఉన్న జర్నలిస్టులపై అక్రమ కేసులు పెట్టడం అప్రజాస్వామికమని ప్రజా మిత్ర ప్రోగ్రెసివ్ డెమొక్రటిక్ ఫ్రంట్ రాష్ట్ర అధ్యక్షులు కొరివి వేణుగోపాల్ అన్నారు. శుక్రవారం స్థానిక ప్రెస్ భవన్ లో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ జర్నలిస్టులు వాస్తవాలను రాయద్దంటారా అని పాలకులను ప్రశ్నించారు. బిఆర్ఎస్‌ను ప్రజలు మూడోసారి గెలిపిస్తే తెలంగాణ రాష్ట్రం సర్వనాశనం అవుతుందని వ్యాఖ్యానించారు. ప్రజలను కేసుల పేరుతో బెదిరిస్తే పెద్ద ప్రజా తిరుగు బాటు రాక తప్పదన్నారు. ఉమ్మడి 10 జిల్లాలే ఉన్నప్పుడు అందుబాటులో ఉన్న కలెక్టర్లు నేడు చిన్న జిల్లాలు అయిన తర్వాత ఎందుకు ప్రజలకు అందుబాటులో ఉండడం లేదని వేణుగోపాల్ ప్రశ్నించారు. తెలంగాణలో నిరంకుశ పాలన నడుస్తుందన్నారు. ధరణి పేరుతో తహసీల్దార్లు కోట్లాది రూపాయలు దోచుకున్నారని ఆరోపించారు. నల్లగొండ జిల్లా మర్రి గూడెం తాసిల్దార్ ఇంట్లో ఏసీబీ అధికారులు తనిఖీ చేస్తే నాలుగున్నర కోట్ల రూపాయలు అక్రమాస్తులు దొరకడమే ఇందుకు నిదర్శనంగా ఆయన పేర్కొన్నారు. 2020 లో ధరణినీ తీసుకువచ్చిన ప్పటికీ, ధరణి మూలంగా ఏర్పాటు సమస్యలను ప్రభుత్వం పరిష్కరించకుండా నిర్లక్ష్యం వహిస్తుందన్నారు.1971 లో ఆర్ ఓ ఆర్ యాక్ట్ వచ్చిందన్నారు. ఇప్పుడు అది లేకుండా పోయిందన్నారు. సీఎం కేసీఆర్ వీఆర్వో వ్యవస్థను తీసేసి, మొత్తం రెవెన్యూ వ్యవస్థని సర్వనాశనం చేశారని ఆరోపించారు. భూ సమస్యలపై రెవెన్యూ సదస్సులు పెట్టి పరిష్కరిస్తామని ఇంతవరకు ఎందుకు చేయలేదు అన్నారు. ఈ ఎన్నికల్లో బిఆర్ఎస్‌కు ఎట్టి పరిస్థితుల్లో ప్రజలు ఓట్లు వేయద్దన్నారు. ఈ విలేకరుల సమావేశంలో కడపల విజయ్ కుమార్, సిగిరి శ్రీధర్, బోయిన్పల్లి చంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా దేవి శరన్నవరాత్రోత్సవాలు



సిద్దిపేట, అక్టోబర్ 20, మనం న్యూస్ ప్రతినిధి: దేవి శరన్నవరాత్రోత్సవాలు అత్యంత వైభవంగా, కన్నుల పండువగా కొనసాగుతున్నాయి. పట్టణంలోని వార్డు నెంబర్ 15 ఇమాంబాద్‌లో హిందు వాహిని శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న నవరాత్రోత్సవాలు ఘనంగా కొనసాగుతున్నాయి. శుక్రవారంనాడు మూలా నక్షత్రాన్ని పురస్కరించుకొని నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా హోమం కార్యక్రమాన్ని నిర్వహించారు. స్థానిక హనుమాన్ దేవాలయ ఆవరణలో కొనసాగుతున్న నవరాత్రి ఉత్సవాల్లో ప్రతి రోజు ఒక కొత్త కార్యక్రమంతో ఆకట్టుకుంటున్నారు. ఉదయం వేళలో అమ్మవారికి విశేష పూజలు నిర్వహించిన అనంతరం మధ్యాహ్నం వేళలో అన్నప్రసాద వితరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. అన్న ప్రసాద వితరణ కార్యక్రమాన్ని అత్యంత సాంప్రదాయబద్ధంగా సంస్కృతిని ప్రతిబింబించే విధంగా కూర్చోబెట్టి అరిటాకుల్లో వడ్డించిన భోజనాన్ని భక్తులు స్వీకరించి సంతృప్తి వ్యక్తం చేశారు.

### దర్శించుకున్న ఏసిపి, మున్సిపల్ మాజీ ఛైర్మన్



దేవి శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా కొనసాగుతున్న నవరాత్రుల్లో భాగంగా శుక్రవారంనాడు అమ్మవారిని సిద్దిపేట ఏసిపి కేతిరెడ్డి సురేందర్‌రెడ్డి, సిఐలు దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అదేవిధంగా మున్సిపల్ మాజీ ఛైర్మన్ కడవేర్గు రాజనర్సు, కో ఆప్షన్ సభ్యులు పాడిశేటి సత్తయ్య, సివిల్ సప్లై సభ్యులు దరిపల్లి శ్రీను, భాస్కర్‌రెడ్డిలు దర్శించుకొని అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అంతకుముందు యువసేన ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న నవరాత్రోత్సవాల్లో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు గూడ శ్రీనివాస్‌రెడ్డి, పప్పుల కర్ణాకర్‌రెడ్డి, హిందూ వాహిని ప్రతినిధులు దమ్మ కమలాకర్‌రెడ్డి, చీకోటి నర్సాగౌడ్, జక్కుల నవీన్, నాయిని మధుసూదన్‌రెడ్డి, యువసేన ప్రతినిధులు మేడిశెట్టి రాజకిరణ్, రాదారంకర్ణాకర్, గూడ సత్తిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## జోరుగా ఇసుక దందా

- ట్రాక్టర్ల స్పీడుకు రైతన్న బెంబేలు
- చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్న పోలీస్ మైనింగ్ అధికారులు
- ప్రభుత్వ ఆదాయానికి గండి



చిన్నకోడూరు, అక్టోబర్ 20, మనం న్యూస్: జోరుగా అక్రమ ఇసుక రవాణా మూడు పువ్వులు, ఆరు కాయలుగా సాగుతుంది. అక్రమ దందాకు అడ్డుకట్ట వేయాల్సిన అధికారులు మామూళ్ల మత్తులో తూగుతున్నారన్న ఆరోపణలతో ఈ తతంగమంతా నడుస్తుందంటూ వార్తలు పుట్టుకొస్తున్నాయి. గత ఆరు నెలలుగా కంటికి కనబడని ఇసుక ట్రాక్టర్లు ఇప్పుడు పెద్ద మొత్తంలో రయ్‌రయ్‌మంటూ రోడ్లపైకి వస్తుంటే వ్యవసాయ పొలాలకు వెళ్లే రైతులకు గుండెలు గుబేలుమంటున్నాయి. ఇంత తంతు జరుగుతున్నా అటు రెవెన్యూ అధికారులు కానీ, ఇటు పోలీసులు కానీ పట్టుకున్న దాఖలాలు లేవు. ఇసుకాసురుల మామూళ్లకు తలొగ్గిన పోలీసులు చూసీ చూడనట్లు ఉంటున్నారన్న ఆరోపణలు వస్తున్నాయి. మండలంలో ఎక్కడ చూసినా ఇసుక డంప్‌లు దర్శనమిస్తున్నాయి. ఇందుకు కారణం అధికారులు మామూళ్లకు అలవాటు పడ్డారన్న నిజాన్ని చెప్పక తప్పదు. మండల వ్యాప్తంగా ఇంటి నిర్మాణాలకు అవసరమైన ఇసుకను రాజన్న సిరిసిల్ల జిల్లా ఇల్లంతకుంట మండలం, సిద్దిపేట జిల్లా బెజ్జంకి మండలం నుండి రాత్రి వేళలో ట్రాక్టర్లు, టిప్పర్ల సాయంతో తరలిస్తున్నారు. ప్రతి రోజు రాత్రి 8 గంటలకు మొదలుకొని తెల్లవారు 8 గంటల వరకు జోరుగా ఇసుక రవాణా సాగుతోంది. దీనికి తోడు మితిమీరిన వేగం, మైనర్‌లైన డ్రైవర్లు ఇష్టారీతిన రాత్రి వేళలో మద్యం సేవిస్తూ ట్రాక్టర్లను నడపడంతో రోడ్డు పక్కన నివసిస్తున్న ప్రజలు ఎప్పుడు తమకు ప్రమాదం పొంచి ఉందోనని ప్రాణాలను అరచేతిన పట్టుకొని బిక్కుబిక్కుమంటున్నారు. అక్రమ దందాకు అడ్డుకట్ట వేయాల్సిన అధికారులే గేట్లు ఎత్తి వేయడంతో ప్రభుత్వ ఆదాయానికి పెద్ద మొత్తంలో గండిపడుతుందన్న ఆరోపణలు వస్తున్నాయి. అక్రమ ఇసుక రవాణా చేసే వ్యక్తుల మధ్య ఎవరికి వారే యమునా తీరే అన్న చందంగా మారడంతో ఇంతిస్తున్నాం, అంతిస్తున్నామంటూ అధికారుల గురించి మండల కేంద్రంలోని హోటళ్ల వద్ద మాట్లాడుకుంటున్నారన్న ఆరోపణలు గుప్పుమంటున్నాయి. తమ ప్రాణాలను ఇసుక ట్రాక్టర్ల నుండి కాపాడాలని, గతంలో లేని ఇసుక రవాణా ఇప్పుడే ఇలా పెద్ద మొత్తంలో ఎందుకు నడుస్తుందని అధికారులు అక్రమార్కులకు అమ్ముడు పోయారా అంటూ రైతులు, ప్రజలు ప్రశ్నిస్తున్నారు. ఏదేమైనా గత ఆరు నెలల క్రితం నడవని ఇసుక రవాణా ఇప్పుడు ఇలా ఎందుకు మొదలైందో అధికారులే అర్థం చేసుకోవాలి.

# బిఆర్ఎస్, కాంగ్రెస్‌లు అవినీతి కవల పిల్లలు

- కాంగ్రెస్‌లో గెలిచే వారంతా బిఆర్ఎస్ గూటికే
- లీకుల ప్రభుత్వం బిఆర్ఎస్... అభివృద్ది ప్రభుత్వం భాజపా
- అధర్మ చక్రవర్తి కేసీఆర్... ధర్మ సంరక్షకుడు ప్రధాని మోదీ
- జయ జయహే తెలంగాణ గీతాన్ని ఎందుకు రాష్ట్ర గీతంగా ప్రకటించలేదు
- శత్రువుల కుట్రలను చీల్చుకొని గెలిచిన వాడు మీ రఘునందన్‌రావు
- ఐదేళ్లు అధికారమిస్తే దుబ్బాక అభివృద్ధిలో అగ్రగామి
- కేంద్ర మహిళా శిశు సంక్షేమ, మైనార్టీ శాఖ మంత్రి స్మృతి ఇరానీ



దుబ్బాక/దుబ్బాక టౌన్, అక్టోబర్ 20, మనం న్యూస్: గతంలో కేంద్రంలో అధికారంలో ఉన్నంత కాలం కాంగ్రెస్ పార్టీ స్కామ్‌లు చేస్తే, నేడు తెలంగాణలో అధికారంలో ఉన్న బిఆర్ఎస్ పార్టీ సైతం అవినీతికి పాల్పడుతూ అడ్డగోలుగా ప్రజా ధనాన్ని దోచుకుంటూ అవినీతికి కవల పిల్లలుగా బిఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలు నిలిచాయని కేంద్ర మహిళా శిశు సంక్షేమ, మైనార్టీ శాఖ మంత్రి స్మృతి ఇరానీ ఎద్దేవా చేశారు. నీళ్లు, నిధులు, నియామకాల పేరుతో సాధించుకున్న తెలంగాణలో సామాన్య ప్రజానీకం మరింత ఇక్కట్ల పాలవుతుంటే కల్వకుంట్ల కుటుంబం మాత్రం నాలుగు పదవులతో సంతోషంగా గడుపుతుందని ఆమె విమర్శించారు. దుబ్బాక పట్టణంలోని తిరుమల గార్డెన్స్‌లో శుక్రవారం రోజున దుబ్బాక ఎమ్మెల్యే రఘునందన్‌రావు సమక్షంలో నిర్వహించిన నారీ వందన్ శక్తి కార్యక్రమానికి కేంద్ర మంత్రి స్మృతి ఇరానీ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమెకు బీజేపి శ్రేణులు భారీ ఎత్తున బైక్ ర్యాలీతో ఘన స్వాగతం పలికి, సభాస్థలి వద్ద గజమాలతో ఆమెను సత్కరించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ శ్రీ దుర్గామాత నవరాత్రి ఉత్సవాల సమయాన రఘునందన్‌రావు నాయకత్వం వహిస్తున్న దుబ్బాక నియోజకవర్గానికి రావడం ఎంతో సంతోషంగా ఉందని, అమ్మవారి ఆశీస్సులతో దుబ్బాక ప్రజలంతా సంతోషంగా ఉండాలని ఆమె ఆకాంక్షించారు. తెలంగాణ రాష్ట్రంలో అధర్మానికి, ధర్మానికి మధ్య యుద్ధం జరుగుతోందని, ఇందులో కేసీఆర్ అధర్మం వైపు అడుగులు వేస్తుంటే ఎప్పటికప్పుడు ఆ అడుగులకు అడ్డు పడుతూ రఘునందన్‌రావు ధర్మం వైపున ప్రజలను నడిపించేందుకు తన శాయశక్తులా కృషి చేస్తున్నారన్నారు. నవరాత్రి ఉత్సవాల సందర్భంగా మీ నాయకుడు రఘునందన్‌రావు ధర్మం నాలుగు పాదాలపై నిలబడేలా సంకల్పం తీసుకున్నాడని, ఇందుకు అమ్మవారి ఆశీస్సులతోపాటు దుబ్బాక నియోజకవర్గ మహిళామణులు, ప్రజల ఆశీస్సులు ఎంతో అవసరమన్నారు. నవరాత్రుల తర్వాత రోజైన విజయదశమి రఘునందన్‌రావు విజయోత్సవ దినోత్సవం కావాలని ఆకాంక్షిస్తున్నానని ఆమె ఎమ్మెల్యే రఘునందన్‌రావుకు శుభాకాంక్షలు తెలియజేశారు. నేడు తెలంగాణ రాష్ట్రంలో ఏవైనా నీళ్లు, నిధులు, నియామకాల పేరుతో సాధించుకున్నారో అందులో ఏ ఒక్కటి కూడా కేసీఆర్ అమలు చేయడం లేదని, ముందుగా నీళ్ల కోసం 30 వేల నుండి 40 వేల కోట్ల మధ్య ఉన్న కాళేశ్వరం ప్రాజెక్టు వ్యయాన్ని ఏకంగా లక్ష కోట్లకు పెంచి ప్రజా నిధులను ఫామ్‌హౌజ్‌కు తరలించుకున్నాడని ఆరోపించారు. నియామకాల పేరుతో గద్దెనెక్కి ఇంత వరకు ఏ ఒక్కరికి ఉద్యోగం ఇవ్వలేదని, ఇచ్చిన నోటిఫికేషన్లన్నీ కూడా కోర్టు మెట్లు ఎక్కుతున్నాయంటే ప్రభుత్వ పాలన ఏ రకంగా ఉందో అర్థమవుతుందని ఆమె ఎద్దేవా చేశారు. తెలంగాణ ఏర్పాటు సమయంలో మిగులు బడ్జెట్‌తో ఉన్న రాష్ట్రాన్ని లోటు బడ్జెట్‌లోకి తీసుకువచ్చిన రావణాసురుని అంతం రఘునందన్‌రావుతోనే సాధ్యమవుతుందని, మీరంతా అతని సైనికుల్లా తన వెంట ఉండి తనను ముందుకు నడిపించాలని ఆమె కోరారు. ఓ వైపు సిద్దిపేట, సిరిసిల్ల, గజ్వేల్‌లలో కల్వకుంట్ల కుటుంబ సభ్యులు ఉన్న ప్పటికీ, వారందరి కుట్రలను తిప్పికొట్టి దుబ్బాక గడ్డపై గెలిచి ప్రభు త్వం మెడలు వంచి దుబ్బాక అభివృద్ధికి కృషి చేస్తున్నాడన్నారు. బిఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలు రెండూ ఒక్కటేనని అవి అవినీతికి పుట్టిన కవల పిల్లలుగా ఆమె అభివర్ణించారు. గతంలో కాంగ్రెస్ పార్టీలో గెలిచిన ఎమ్మెల్యేలు, ఎంపిలు అంతా కూడా బిఆర్ఎస్ గూటికే చేరుకున్నారని, ఇప్పుడు కూడా వచ్చే ఎన్నికల్లో ప్రజలు కాంగ్రెస్ పార్టీకి ఓటేసినా, బీఆర్ఎస్ పార్టీకి ఓటేసినా వారంతా ఒకే గూటి పక్షులని, కాంగ్రెస్‌లో గెలిచిన వారంతా బిఆర్ఎస్‌లోకే వెళ్లి మీ ఓటుకు విలువ లేకుండా పోతుందని తలిపారు. రాష్ట్రంలో పదవ తరగతి ప్రశ్నా పత్రం నుండి గ్రూప్స్ పరీక్ష ప్రశ్నా పత్రాల వరకు లీకేజీల వ్యవహారం జరుగుతుందంటే అందులో పూర్తిగా కేసీఆర్ కుటుంబం కూడా ఉందని, లీకుల ప్రభుత్వం బిఆర్ఎస్ అయితే అభివృద్ధి చేసే ప్రభుత్వం భారతీయ జనతా పార్టీ అని ఆమె ఘంటాపదంగా ఉద్ఘాటించారు. కరోనా సమయంలో ప్రపంచంలో ఎక్కడా లేని విధంగా ప్రధాని మోదీయే దేశవ్యాప్తంగా ఉచితంగా కరోనా వ్యాక్సిన్‌ను పంపిణీ చేశారని, రాహుల్‌గాంధీయో, లేక సోనియా గాంధీయో లేక ఈ కల్వకుంట్ల కుటుంబమో అధికారంలో ఉంటే ప్రజలందరికీ ఉచితంగా కరోనా వ్యాక్సిన్ వచ్చి ఉండేదా అని ప్రశ్నించారు. కేసీఆర్, కేటీఆర్‌లకు వచ్చిన కరోనాను పోగొట్టింది కూడా మోదీ ఇచ్చిన వ్యాక్సినే అనే విషయాన్ని వారు గుర్తించాలని ఎద్దేవా చేశారు. ప్రధాని మోదీ ప్రధాన మంత్రి ఆవాస్ యోజన ద్వారా డబుల్ బెడ్‌రూమ్ ఇండ్లు నిర్మించి ఇస్తే వాటిని తామే నిర్మించి ఇచ్చామని బిఆర్ఎస్ పార్టీ చెప్పుకోవడానికి సిగ్గుపడాలన్నారు. తెలంగాణ ఉద్యమ సమయంలో ప్రజలను ఉవ్వెత్తున ఎగసిపడేలా ఉత్తేజపరిచిన జయ జయహే తెలంగాణ గీతాన్ని రాష్ట్ర గీతంగా కేసీఆర్ ప్రభుత్వం ఎందుకు ఇంత వరకు ప్రకటించలేదని ఆమె ప్రశ్నించారు. కరోనా కష్టకాలం నుండి బయట పడేందుకు సామాన్య ప్రజల కోసం ప్రధాని మోదీ 60 లక్షల మందికి రాష్ట్రంలో ముద్ర యోజన కింద, 6 లక్షల మంది చిరు వీధి వ్యాపారులకు ఎలాంటి షరతులు లేకుండా నేరుగా ఆర్థిక సాయం చేయడం జరిగిందన్నారు. రాష్ట్రానికి వచ్చిన వ్యాక్సిన్, టెక్స్‌టైల్ పార్కులు, ఉచిత బియ్యం, సిద్దిపేటకు వచ్చిన రైలు, మెదక్ సిద్దిపేట ఎల్కతుర్తి 765 డిజి జాతీయ రహదారి ఇవన్నీ కూడా కేసీఆర్ ఇవ్వలేదని, ప్రధాని మోదీ ఇక్కడి ప్రజల కోసం మంజూరు చేసిన మహానేత అని కొనియాడారు. అలాంటప్పుడు మీ అందరి ఓటు మోడీ బాటలో నడిచే, మీ కోసం ప్రశ్నించే రఘునందన్‌రావుకే వేసి ఆశీర్వదించి బీజేపీ పార్టీకి అవకాశం ఇవ్వాలని, అభివృద్ధికి అడుగులు వేసుకోవాలన్నారు.


# దుబ్బాక రూపురేఖలు మరాయి

- పూర్తిస్థాయి అవకాశమిస్తే సమగ్రాభివృద్ధి మన సొంతం
- నోనొచ్చినా పింఛన్ ఆగలే... మోటార్లకు మీటర్లు రాలే... రావు కూడా
- బిఆర్ఎస్‌వి బెదిరింపులు.... అక్కున చేర్చుకునేది భారతీయ జనతా పార్టీ
- దుబ్బాక పేరు పలకకుండా అసెంబ్లీ గడిచిన రోజు లేదు
- కొలువుల విషయాలన్నీ కోర్టు మెట్లెక్కుతున్నాయి
- నా ఆశ... నా శ్వాస దుబ్బాక ప్రజలే
- దుబ్బాక ఎమ్మెల్యే మాధవనేని రఘునందన్‌రావు





దుబ్బాక/దుబ్బాక టౌన్, అక్టోబర్ 20, మనం న్యూస్ః ఒక్క అవకాశం ఇవ్వండి అభివృద్ధి చేసి చూపిస్తానని మాట ఇచ్చాను.... మడమ తిప్పకుండా ఇచ్చిన కొద్ది కాలంలోనే దుబ్బాక రూపు రేఖలు మార్చి చూపించాను.... ఇప్పుడు పూర్తి స్థాయి అవకాశం ఇవ్వండి మీ ఆశీస్సులతో దుబ్బాక నియోజకవర్గం సమగ్రాభివృద్ధి చేసి చూపిస్తానని దుబ్బాక ఎమ్మెల్యే మాధవనేని రఘునందన్‌రావు ఉద్ఘాటించారు. ప్రజల కోసమే పని చేయాలనేది బీజేపి సిద్ధాంతమని, ఆ సిద్ధాంతంపైనే నిలబడి దుబ్బాక నియోజకవర్గ అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తున్నానని ఆయన పేర్కొన్నారు. శుక్రవారం రోజున దుబ్బాక పట్టణంలోని తిరుమల ఫంక్షన్ హాల్‌లో ఏర్పాటు చేసిన నారీ శక్తి వందన్ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కేంద్ర మహిళా శిశు సంక్షేమ, మైనార్టీ శాఖ మంత్రి స్మృతి ఇరానీ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రఘునందన్‌రావు మాట్లాడుతూ దుబ్బాక ప్రజలు తనపై నమ్మకంతో తనను గెలిపించి తనకిచ్చిన కొంత కాలంలోనే దుబ్బాక పట్టణంలో నూతన బస్టాండ్‌ను నిర్మించుకున్నామని, వంద పడకల ఆసుపత్రి, డబుల్ బెడ్‌రూమ్ ఇండ్ల ప్రవేశాలు, ఐటిసి భవనం ప్రారంభోత్సవంతోపాటు నూతన రోడ్లు వంటివి ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు చేయడం జరిగిందన్నారు. నేను అధికారంలోకి రాకముందు సాయంత్రం 6 దాటితే చాలు సిద్దిపేట, హైదరాబాద్‌కు వెళ్లే పరిస్థితి నుండి నేడు ఏ రాత్రైనా దుబ్బాకలోనే అన్ని రకాల వైద్య సేవలు అందించేలా ఆసుపత్రిని సకల వసతులతో అందుబాటులోకి తీసుకురావడం జరిగిందన్నారు. మొన్నటి దాకా మాట్లాడని వ్యక్తి, ఎంపి స్థాయిలో ఉండి దుబ్బాకను పట్టించుకోని సన్నాయికారి నేడు అభివృద్ధి చేస్తానంటూ ప్రజల ముందుకు వచ్చి సన్నాయి మాటాలు మాట్లాడడం చూస్తుంటే హాస్యాస్పదంగా ఉందన్నారు. పదేళ్లపాటు ఎంపిగా ఉండి దుబ్బాక నియోజకవర్గానికి, దుబ్బాక అభివృద్ధికి ఏం చేశాడని ప్రశ్నించారు. నేను అధికారంలోకి రాక ముందు ఉన్నది బిఆర్ఎస్ ఎమ్మెల్యే, బిఆర్ఎస్ ఎంపి, బిఆర్ఎస్ మంత్రులే కదా. మరి దుబ్బాకలో పై అభివృద్ధి పనులెందుకు పూర్తి చేయలేదని ఆయన సూటిగా ప్రశ్నించారు. ఎంపిగా ప్రభాకర్‌రెడ్డి గజ్వేల్, సిద్దిపేట అభివృద్ధికి చేసిన కృషిలో దుబ్బాకపై కొంతమేరైనా చేసి ఉంటే బాగుండేదన్నారు. నాడు ఉప ఎన్నికలో దుబ్బాక బస్టాండ్‌ను అవహేళన చేస్తూ మాట్లాడిన మంత్రితోనే దుబ్బాక నూతన బస్టాండ్‌కు శంకుస్థాపన, ప్రారంభోత్సవం చేయించానని గర్వంగా చెప్పుకున్నారు. దుబ్బాక ప్రజలకు ఏం కావాలో తెలియని వ్యక్తి కొత్త ప్రభాకర్‌రెడ్డి అని, కనీసం తన వెంట ఉండే నాయకులను సైతం గుర్తించలేని వ్యక్తి దుబ్బాక ప్రజల మనసును ఎలా తెలుసుకుంటాడని, దుబ్బాక కోసం నోరు తెరిచి ఏం కావాలని అడుగుతాడన్నారు. బీజేపి అధికారంలోకి వస్తే పింఛన్‌లు ఆగిపోతాయి, మోటార్లకు మీటర్లు వస్తాయని మాట్లాడిన మంత్రి నేడు దుబ్బాక నియోజకవర్గంలో పింఛన్‌లు ఆగిపోయాయో లేక మరింతగా పెరిగాయో కళ్లు తెరిచి చూడాలన్నారు. అంతేకాకుండా నియోజకవర్గంలో ఎక్కడైనా మోటార్లకు మీటర్లు వచ్చాయా అని ప్రశ్నించారు. ఒకప్పుడు అసెంబ్లీలో దుబ్బాక పేరే వినిపించేది కాదని, కానీ నేడు ప్రతి అసెంబ్లీ సమావేశంలో దుబ్బాక పేరు వినిపించకుండా అసెంబ్లీ గడిచిన రోజు లేదని, ప్రతి రోజు తాను దుబ్బాక నియోజకవర్గం గురించి ప్రభుత్వాన్ని ప్రశ్నించడం జరిగిందని, అవసరమైన పనులు చేయించుకున్నామన్నారు. బిఆర్ఎస్ నాయకులు నోరు తెరిస్తే అబద్ధాలు, మోసపూరిత హామీలు తప్ప ప్రజలకు పనికి వచ్చే మాటలే రావని ఎద్దేవా చేశారు. దుబ్బాకలో నిర్మించిన డబుల్ బెడ్‌రూమ్‌లు అసంపూర్తిగా ఉండి లబ్ధిదారులకు ఇవ్వకుండా వదిలేస్తే నేనే స్వయంగా లబ్ధిదారులను ఇళ్లలోకి పంపించి పనులన్నీ పూర్తి చేయిస్తే బిఆర్ఎస్ నాయకులు వచ్చి నీళ్లు, కరెంటు సరఫరా ఆపివేస్తూ బెదిరింపులకు గురిచేసినప్పటికీ భారతీయ జనతా పార్టీ తరుపున తాను అండగా నిలిచి ప్రజలందరి సమన్వయంతో ప్రభుత్వంతో కొట్లాడి కరెంటు, నీళ్ల సరఫరా తిరిగి పునరుద్ధరించుకోగలిగామన్నారు. దుబ్బాక పట్టణంలో తాను రాక ముందు కాని అభివృద్ధి పనులు ఇప్పుడు ఏ విధంగా జరుగుతున్నాయని, ఒకవేళ తాము ఇప్పుడు చేయకపోతే రఘునందన్‌రావు ప్రశ్నించి ప్రజల ముందు దోషులుగా నిలబెడుతాడనే భయంతోనే వారిప్పుడు పనులు చేస్తున్నారన్నారు. ఉద్యోగాల పేరుతో నిరుద్యోగ యువతను ప్రభుత్వం మోసం చేస్తూ వస్తుందని, రాష్ట్రం ఏర్పడిన తర్వాత విడుదల చేసిన ప్రతి నోటిఫికేషన్ కోర్టు మెట్లు ఎక్కకుండా ముందుకు సాగలేదన్నారు. పరీక్షల నిర్వహణలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని, ఉద్యోగ కల్పనలో ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదన్నారు. నా ఆశ, నా ధ్యాస అంతా దుబ్బాక ప్రజలేనని, దుబ్బాక అభివృద్ధే నా ధ్యేయమని గ్రామీణ నియోజకవర్గమైనప్పటికీ సిద్దిపేట, గజ్వేల్ పట్టణాలతో తీసిపోని విధంగా మార్చడమే తన లక్ష్యమన్నారు. ఇందుకు మీ అందరి ఆశీస్సులు తనపై ఉండాలని కోరారు. రఘునందన్‌రావు ఎవరికీ, ఎవరి బెదిరింపులకు భయపడడని, మీ ప్రేమ, ఆదరాభిమానాలు, ఆశీస్సులు ఉన్నంత కాలం మీతోనే ఉంటానని, మీ కోసమే పని చేస్తానన్నారు. కావున వచ్చే ఎన్నికల్లో ఐదేళ్ల పాటు పూర్తి స్థాయి అవకాశమిస్తే దుబ్బాక ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా అభివృద్ధి చేసి చూపిస్తానని ఆయన పేర్కొన్నారు. అనంతరం పలు గ్రామాల నుండి బిఆర్ఎస్ నాయకులు, వార్డు మెంబర్లు, మహిళలు స్మృతి ఇరానీ సమక్షంలో బీజేపి పార్టీలో చేరారు. ఈ కార్యక్రమంలో బీజేపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు అంబటి బాలేష్ గౌడ్, అసెంబ్లీ కన్వీనర్ ఎస్ఎన్ చారి, మున్సిపల్ అధ్యక్షులు కిష్టమ్మగారి సుభాష్‌రెడ్డి, పార్లమెంట్ కో కన్వీనర్ చింత సంతోష్‌కుమార్ గుప్త, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మంద అనిల్‌రెడ్డి, జిల్లా అధికార ప్రతినిధి మచ్చ శ్రీనివాస్, జిల్లా మహిళా మోర్చ నాయకురాలు అరుణారెడ్డి, రాష్ట్ర కార్యదర్శి గోవిందుగారి సుధారెడ్డి, మహిళా నాయకురాలు ఎంగారి నవ్యరెడ్డి, కౌన్సిలర్ మట్ట మల్లారెడ్డి, మండల పార్టీ అధ్యక్షులు అంబటి శివ ప్రసాద్ గౌడ్, ఆయా గ్రామాల సర్పంచ్‌లు, ఎంపిటిసిలు, వార్డు మెంబర్లు, నాయకులు జిగిరి అమర్ సుంకు ప్రవీణ్, దూలం వెంకట్ గౌడ్, బోయ రాజశేఖర్, రమేష్‌రెడ్డి, పుట్ట వంశీ, రాగుల వినీత్ గౌడ్, పల్లె నిహాల్ గౌడ్, కొండె ఎల్లారెడ్డి, సప్తగిరి, బాచి, మరాటి బాబు, రవిందర్ తదితరులు పాల్గొన్నారు.



## బీఆర్ఎస్‌కు ఊహించని షాక్

న్యూఢిల్లీ, అక్టోబర్ 20: తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో కారును పోలిన గుర్తులు తప్పించాలంటూ బీఆర్ఎస్ దాఖలు చేసుకున్న పిటిషన్ ను సుప్రీంకోర్టు కొట్టి వేసింది. ఓటర్లకు అన్నీ తెలుసని సుప్రీంకోర్టు స్పష్టంచేసింది. దీంతో బీఆర్ఎస్‌కు ఊహించని షాక్ తగిలినట్టయ్యింది. సుప్రీం నిర్ణయంతో బీఆర్ఎస్ అధిష్టానం, ఆ పార్టీ అభ్యర్థులు ఆలోచనలో పడినట్లు తెలిసింది. 'భారతీయ ఓటర్లు రాజకీయ నిరక్షరాసులు కాదు. ఓటర్లకు కారు, చపాతి రోలర్, రోడ్డు రోలర్ తేడా తెలియదు అనుకుంటున్నారా?.. ఎన్నికలు వాయిదా వేయాలని మీరు కోరుకుంటున్నారా? అని ధర్మాసనం ప్రశ్నించింది. కారును పోలిన గుర్తులను తొలగించాలంటూ న్యాయస్థానంలో బీఆర్ఎస్ పిటిషన్ వేసిన సంగతి తెలిసిందే. చపాతీ రోలర్, రోడ్డు రోలర్, తదితర గుర్తులను ఎన్నికల్లో ఎవరికీ కేటాయించకుండా ఎన్నికల సంఘానికి ఆదేశించాలంటూ బీఆర్ఎస్ న్యాయస్థానాన్ని ఆశ్రయించింది. మునుగోడు ఉప ఎన్నికలో కారును పోలిన గుర్తులతో నష్టపోయామని పిటిషన్‌లో పేర్కొంది. ఈ అంశంపై గతంలో హైకోర్టులో పిటిషన్ దాఖలు చేసినా సానుకూల తీర్పు రాలేదు. అయితే హైకోర్టు తీర్పు తర్వాత దాదాపు 240 రోజుల తర్వాత సుప్రీంకోర్టుకు రావడం ఏంటి?. అధికార పార్టీగా ఉన్న మీకు ఈ విషయం తెలియదా?' అంటూ బీఆర్ఎస్ పార్టీ న్యాయవాదులపై సుప్రీంకోర్టు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. ఈ మేరకు బీఆర్ఎస్ పిటిషన్‌ను కొట్టివేస్తూ జస్టిస్ అభయ్ ఎస్ ఓకా, జస్టిస్ పంకజ్ మిథాల్‌తో కూడిన ధర్మాసనం తీర్పు వెలువరించింది. ఎన్నికలు వస్తున్నాయంటే చాలు స్వతంత్ర అభ్యర్థులు పోటీకి ముందుకు వస్తారు. కొందరు టిక్కెట్లు ఆశించి కానీ, మరికొందరు ప్రధాన పార్టీ అభ్యర్థులు ఇచ్చే డబ్బుల కోసం కావచ్చు నామినేషన్లు వేయడం పరిపాటిగా మారింది. ఈవీఎంలో ఎక్కువ మంది అభ్యర్థులుంటే... పేరులో ఉన్న మొదటి అక్షరం ప్రకారం వరసగా కేటాయింపులు జరుపుతారు. గుర్తులు కూడా అలాగే కేటాయిస్తారు. అదే ఇప్పుడు అధికార బీఆర్ఎస్ కు ఇబ్బందిగా మారింది. వేల సంఖ్యలో ఓట్లు వేరే గుర్తు పడుతుండటంతో కొన్ని చోట్ల ఓటమి అంచుల వరకూ వెళ్లి ఆగిపోవాల్సి వచ్చింది. మరికొన్ని చోట్ల కారు పార్టీ అభ్యర్థులు ఓటమి పాలయ్యారని బీఆర్ఎస్ నేతలు భావిస్తున్నారు. కోర్టుకు వెళ్లే ముందే ఈసీని కలిసి వినతపత్రం ఇచ్చిన బీఆర్ఎస్ నేతలు.. ఎన్నికల సన్నాహాల సమీక్షకు హైదరాబాద్‌కు వచ్చిన ఎన్నికల సంఘం బృందం దృష్టికి ఇదే విషయాన్ని తీసుకెళ్లారు. అయితే, కారు తరహా గుర్తులను వచ్చే ఎన్నికల్లో వినియోగించాలని ఈసీ నిర్ణయించడంతో న్యాయపోరాటం చేశారు. అక్కడా ఊరటలభించకపోవడంతో ఇక బీఆర్ఎస్ పోటీ చేసే ప్రతీ చోటా.. రోడ్డు రోలర్, చపాతీ మేకర్ వంటి గుర్తులు ఉండనున్నాయి. ఇది బీఆర్ఎస్‌కు ఇబ్బందికరమేనని రాజకీయవర్గాలు చెబుతున్నాయి.

## బతుకమ్మ.. మా బతుకు మార్చమ్మా

చిన్నకోడూరు, అక్టోబర్ 20, మనం న్యూస్: ఏడు రోజుల సద్దుల బతుకమ్మ సంబరాలు అంబరాన్నంటాయి. తీరొక్క పూలతో పేర్చిన బతుకమ్మను భక్తిశ్రద్ధలతో ఆటలాడి పెద్ద చెరువులో నిమజ్జనం చేశారు. మహిళలు ఒకరికొకరు గౌరమ్మను పూజించుకొని సద్దులు పట్టుకొని భక్తి పారవశ్యంలో మునిగితేలారు. అనాది నుండి వస్తున్న ఆచారం ఈ ఏడు రోజుల సద్దుల పండుగ. రాష్ట్ర వ్యాప్తంగా తొమ్మిది రోజులకు నిర్వహిస్తే చిన్నకోడూరు మండలంలోని కొన్ని గ్రామాలతోపాటు కొండపాక, నంగునూరు మండలాలలో ఏడురోజుల్లోనే సద్దుల బతుకమ్మ నిర్వహిస్తారు. మమ్మల్ని చల్లగా చూడు బతుకమ్మ... మా బతుకుల్ని మార్చమ్మా... అంటూ మహిళలు ప్రసాదాలు పంచుకొని ఈ ఏడు ఏ అంట వ్యాధులు, ఏ రోగాలు రాకుండా ప్రజలను చల్లగా చూడమ్మా అంటూ భక్తిశ్రద్ధలతో పూజించారు. చిన్నారుల కేరింతలు, రంగు రంగుల పూలతో గ్రామాలన్నీ కొత్త శోభను సంతరించుకున్నాయి. సద్దుల సందర్భంగా ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా గ్రామాలలో చెరువుల వద్ద గ్రామ పంచాయతీల పాలకవర్గం ప్రత్యేక చర్యలు తీసుకున్నాయి. మండల కేంద్రంలో ఎంపిటిసిల ఫోరం అధ్యక్షులు ఇట్టబోయిన శ్రీనివాస్ బతుకమ్మ నిమజ్జనం చేసి ప్రజలకు ఎలాంటి లోటుపాట్లు లేకుండా దగ్గరుండి చర్యలు తీసుకున్నారు. మెట్‌పల్లిలో సర్పంచ్ విజయ వినయ్‌రెడ్డి చెరువు ప్రాంతంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పకడ్బందీ చర్యలు చేపట్టారు.

## జడేజాకే గోల్ మెడల్.. డ్రెస్సింగ్ రూమ్‌లో రచ్చ రచ్చ!

ఇండియా వర్సెస్ బంగ్లాదేశ్: వన్డే ప్రపంచకప్ 2023లో భాగంగా బంగ్లాదేశ్తో జరిగిన మ్యాచ్లో టీమిండియా బెస్ట్ ఫీల్డర్ అవార్డు స్టార్ ఆల్రౌండర్ రవీంద్ర జడేజాకే దక్కింది.ఈ అవార్డు రేసులో జడేజాతో పాటు కేఎల్ రాహుల్, కుల్దీప్ యాదవ్ పోటీపడగా.. ఫీల్డింగ్ కోచ్ టీ దిలీప్.. స్టార్ ఆల్రౌండర్నే ఎంపిక చేశాడు. ప్రపంచకప్ 2023లో భాగంగా ప్రతీ మ్యాచ్లో అద్భుతంగా ఫీల్డింగ్ చేసిన ఆటగాడిని బెస్ట్ ఫీల్డర్గా ఎంపిక చేసి గోల్ మెడల్ అందిస్తున్నారు. ఫీల్డ్లో మరింత చురుకుగా ఉండేందుకు టీమిండియా మేనేజ్మెంట్ ఈ అవార్డు కొత్తగా ప్రవేశపెట్టింది. సూపర్ క్యాచ్లతో పాటు పరుగులను నియంత్రించడం, ఫీల్డింగ్లో నిలకడ చూపించిన ఆటగాళ్లను ఈ అవార్డుకు ఎంపిక చేస్తున్నారు. తొలి మ్యాచ్లో విరాట్ కోహ్లీ ఈ అవార్డు అందుకోగా.. రెండో మ్యాచ్లో శార్దూల్ ఠాకూర్, మూడో మ్యాచ్లో కేఎల్ రాహుల్ ఈ బంగారు పతకాన్ని కైవసం చేసుకున్నారు. బంగ్లాదేశ్తో గురువారం జరిగిన మ్యాచ్లో రవీంద్ర జడేజా బెస్ట్ ఫీల్డర్గా ఎంపికయ్యాడు. ఈ మ్యాచ్లో జడేజా ఓ స్టన్నింగ్ క్యాచ్ అందుకున్నాడు. ఆ క్యాచ్ అందుకున్న వెంటనే ఫీల్డింగ్ కోచ్ టీ దిలీప్ వైపు చూస్తూ.. గోల్ మెడల్ నాదే అంటూ సైగలు చేశాడు. దాంతో ఈ అవార్డు ఎవరికి దక్కుతుందా? అనే ఉత్కంఠ నెలకొంది. జడేజాతో పాటు కేఎల్ రాహుల్ కూడా ఓస్టన్నింగ్ క్యాచ్ అందుకోగా.. కుల్దీప్ యాదవ్ పలు బౌండరీలను అడ్డుకున్నాడు. దాంతో ఈ అవార్డు కోసం త్రిముఖ పోటీ ఏర్పడింది.




# చిన్నస్వామిలో చితక్కొట్టారు.. ఆసీస్ భారీ స్కోరు..

# పాక్ ముందు కొండంత లక్ష్యం

వన్డే ప్రపంచకప్‌లో భాగంగా పాకిస్తాన్ – ఆస్ట్రేలియా మధ్య జరుగుతున్న 18వ లీగ్ మ్యాచ్లో కంగారూలు ఆకాశమే హద్దుగా చెలరేగారు. ఆసీస్ ఓపెనర్లు డేవిడ్ వార్నర్ (124 బంతుల్లో 163, 14 ఫోర్లు, 9 సిక్సర్లు), మిచెల్ మార్ష్ (108 బంతుల్లో 121, 10 ఫోర్లు, 9 సిక్సర్లు) శతకాలతో చెలరేగడంతో నిర్ణీత 50 ఓవర్లలో ఆస్ట్రేలియా.. 9 వికెట్ల నష్టానికి 367 పరుగుల భారీ స్కోరు సాధించింది. ఒకదశలో 450 ఈజీగా కొట్టేస్తుందని భావించినా ఆఖర్లో తడబడిన ఆసీస్ 367కే పరిమితమైంది. పాకిస్తాన్ బౌలర్లలో షహీన్ షా అఫ్రిది మినహా మిగిలినవారంతా తేలిపోయారు. ముఖ్యంగా ఉసామా మిర్, హరీస్ రౌఫ్ల అయితే ధారాళంగా పరుగులిచ్చుకున్నారు. షహీన్ షా అఫ్రిది ఐదు వికెట్లు పడగొట్టాడు. ఈ మ్యాచ్లో గెలవాలంటే పాకిస్తాన్ కొండను కరిగించాల్సిందే.. ఈ మ్యాచ్లో టాస్ ఓడి మొదట బ్యాటింగ్కు వచ్చిన ఆసీస్కు ఓపెనర్లు ఘనమైన ఆరంభాన్ని ఇచ్చారు. బాబర్ ఆజమ్ బౌలర్లను మార్చి మార్చి ప్రయోగించినా ఫలితం లేకుండా దొరికిన బంతిని దొరికినట్టు బౌండరీ లైన్ దాటించారు. 39 బంతుల్లోనే అర్థ సెంచరీ చేసిన వార్నర్.. 85 బంతుల్లోనే సెంచరీ సాధించాడు. వార్నర్కు వన్డే వరల్ కప్లో ఇది ఐదో సెంచరీ కావడం గమనార్హం. ఇన్నింగ్స్ ఆదినుంచి సిక్సర్లతో విరుచుకుపడిన మార్ష్ కూడా 46 బంతుల్లోనే హాఫ్ సెంచరీ పూర్తి చేసుకోగా వంద బంతుల్లో సెంచరీ పూర్తిచేశాడు. వీళ్ల దూకుడుతో 20 ఓవర్లకే 150 పరుగులు దాటిన ఆసీస్ స్కోరు.. 30 ఓవర్లకే రెండు వందల మార్కు దాటింది. తొలి వికెట్కు ఈ ఇద్దరూ ఏకంగా 259 పరుగులు జోడించారు. ఫీల్డింగ్లో పాక్ మూడు క్యాచ్లను జారవిడిచి భారీ మూల్యం చెల్లించు కుంది. వరల్ కప్‌లో ఆస్ట్రేలియాకు ఇదే అత్యుత్తమ తొలి వికెట్ భాగస్వామ్యం. సెంచరీ తర్వాత మార్ష్ ఎట్టకేలకు షహీన్ షా అఫ్రిది వేసిన 33వ ఓవర్ ఐదో బంతికి ఉసామా మిర్ చేతికి చిక్కగా మరుసటి బంతికే గ్లెన్ మ్యాక్స్వెల్ కూడా భారీ షాట్ ఆడబోయి బాబర్ ఆజమ్‌కు క్యాచ్ ఇచ్చాడు. 35 ఓవర్లకే 260 పరుగులు చేసిన ఆసీస్ ఆ తర్వాత కాస్త నెమ్మదించింది. స్టీవ్ స్మిత్ (7) కూడా విఫలమయ్యాడు.

150 పరుగులు పూర్తిచేసుకున్న వార్నర్ డబుల్ సెంచరీ దిశగా సాగుతున్నాడని అనిపించినా హరీస్ రౌఫ్ అతడికి చెక్ పెట్టాడు. రౌఫ్ వేసిన 42వ ఓవర్ రెండో బంతికి వార్నర్.. షాదాబ్ ఖాన్కు క్యాచ్ ఇచ్చి నిష్క్రమించాడు. మూడు బౌండరీలు బాదిన జోష్ ఇంగ్లిస్ (13) కూడా ఎక్కువసేపు క్రీజులో నిలవలేకపోయాడు. ఒకదశలో 450 ఈజీగా బాదుతుందని ఆశించిన ఆసీస్ జోరుకు ఆఖర్లో పాక్ బౌలర్లు కళ్లెం వేశారు. 24 బంతులాడి ఓ ఫోర్, సిక్సర్తో 21 పరుగులు చేసిన స్టోయినిస్ను కూడా షహీన్ ఔట్ చేశాడు. చివర్లో పరుగులు చేయడానికి తంటాలుపడ్డ ఆసీస్.. వరుసగా వికెట్లు కోల్పోయింది. పాక్ బౌలర్లలో షహీన్ షా అఫ్రిది ఐదు వికెట్లు తీయగా మిగిలిన బౌలర్లు ధారాళంగా పరుగులిచ్చుకున్నారు. హరీస్ రౌఫ్ను లక్ష్యంగా చేసుకున్న కంగారూలు.. అతడికి చుక్కలు చూపించారు. 9 ఓవర్లు వేసిన రౌఫ్ ఏకంగా 83 పరుగులిచ్చి మూడు వికెట్లు తీశాడు. ఉసామా మిర్ కూడా 9 ఓవర్లలో 82 పరుగులిచ్చాడు.




## చేసింది సింగిల్ సెంచరీ.. బద్దలైంది ఐదు రికార్డులు.. ఇది కదా కోహ్లీ దెబ్బంటే..!

బంగ్లాదేశ్‌తో జరిగిన వరల్ కప్ మ్యాచ్లో టీమిండియా రన్ మెషీన్ విరాట్ కోహ్లీ సెంచరీతో చెలరేగాడు. చివరి వరకు నాటౌట్గా నిలిచి సిక్స్తో జట్టుకు విజయాన్నందించాడు. అయితే ఈ సెంచరీతో కోహ్లీ తన కెరీర్లో కొన్ని అరుదైన మైలురాళ్లను చేరుకున్నాడు. బంగ్లాదేశ్‌పై టీమిండియా అద్భుతమైన విజయం సాధించింది. 257 పరుగుల టార్గెట్ను మరో 51 బంతులు మిగిలుండగానే 7 వికెట్ల తేడాతో ఛేదించింది. ముందుగా కెప్టెన్ రోహిత్ శర్మ (48), శుభ్మన్ గిల్ (53) మెరిశారు. ఆ తర్వాత రన్ మెషీన్ విరాట్ కోహ్లీ (103) అజేయ సెంచరీతో చెలరేగాడు. ఈ క్రమంలోనే తన కెరీర్లో 5 రికార్డులను అందుకున్నాడు. ఈ మ్యాచ్లో కోహ్లీకి ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్ అవార్డు లభించింది. ఇది కోహ్లీ వన్డే కెరీర్లో 40వ ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డ్. అలాగే ఐసీసీ వైట్ బాల్ టోర్నీల్లో 11వది. ఇప్పటివరకు ఐసీసీ టోర్నీల్లో ఇన్నిసార్లు మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డ్ అందుకున్న బ్యాటర్ల లిస్ట్లో క్రిస్ గేల్ (11) టాప్లో ఉన్నాడు. బంగ్లాతో మ్యాచ్తో కోహ్లీ కూడా గేల్ సరసన చేరాడు. అయితే భారత్ తరపున మాత్రం ఈ రికార్డ్ సాధించిన ఏకైక బ్యాటర్ కోహ్లీనే. బంగ్లాతో మ్యాచ్కు ముందు కోహ్లీ తన కెరీర్లో 26,000 పరుగులకు 76 రన్స్ దూరంలో ఉన్నాడు. అయితే ఇన్నింగ్స్ 39వ ఓవర్లో 82 బంతుల్లో అతడు ఈ మైలురాయిని అందుకున్నాడు. దీంతో అంతర్జాతీయ క్రికెట్లో అత్యధిక పరుగులు చేసిన నాలుగో బ్యాటర్గా మహేలా జయవర్దనే (25,957) ను వెనక్కి నెట్టి ఆ స్థానాన్ని ఆక్రమించాడు. కోహ్లీ కంటే ముందు సచిన్ టెండూల్కర్ (34,357), కుమార్ సంగక్కర (28,016), రికీ పాంటింగ్ (27,483) ఈ ఘనత సాధించారు.

## తడబడుతున్న స్మిత్.. స్టార్ బ్యాటర్ కథ ముగిసినట్టేనా?

ఆధునిక క్రికెట్ దిగ్గజాలలో ఒకడిగా గుర్తింపు పొందిన స్టీవ్ స్మిత్ కథ ముగిసినట్టేనా? కెరీర్ చరమాంకంలో ఉన్న స్మిత్ భారత్ వేదికగా జరుగుతున్న వన్డే వరల్ కప్లో స్థాయికి తగ్గట్టుగా ఆడటంలో విఫలమవుతున్నాడు. టెస్టులలో నిలకడగా ఆడుతున్న ఈ మాజీ ఆసీస్ సారథి వన్డేలలో మాత్రం ఆ మ్యాజిక్ రిపీట్ చేయలేకపోతున్నాడు. ఈ మెగా టోర్నీలో స్మిత్.. నాలుగు మ్యాచ్లు ఆడి విఫలమయ్యాడు. గత నాలుగు మ్యాచ్లలో స్మిత్ స్కోర్లు.. 46, 19, 0, 7గా ఉన్నాయి. పాకిస్తాన్తో మ్యాచ్లో స్మిత్ ఏడు పరుగులే చేసి ఔట్ అవడంతో స్టార్ బ్యాటర్ కథ ముగిసినట్టేనని విశ్లేషణలు వినిపిస్తున్నాయి. తన సుదీర్ఘ కెరీర్లో శతాధిక టెస్టులు ఆడిన స్మిత్.. 9,320 పరుగులు చేశాడు. కానీ వన్డేలతలో మాత్రం 148 మ్యాచ్లు ఆడి 5,119 పరుగులు సాధించాడు. టీ20లలో అయితే స్మిత్ను కంగారూ టీమ్ ఎప్పుడో పక్కనబెట్టేసింది. ఈ వన్డే వరల్ కప్ కు ముందు యాషెస్ సిరీస్లో ఫర్వాలేదనిపించిన స్మిత్.. ఇదే ఏడాది మార్చిలో భారత్ వేదికగా జరిగిన మూడు వన్డేల సిరీస్లో కూడా విఫలమయ్యాడు. ఆ సిరీస్లో 22 పరుగులే చేసిన స్మిత్.. సెప్టెంబర్లో ముగిసిన సిరీస్లో ఫర్వాలేదనిపించాడు. ఆ సిరీస్ లో 41, 0, 74 పరుగులతో రాణించడంతో స్మిత్ మళ్లీ ఫామ్లోకి వచ్చినట్టే అనిపించింది. కానీ తాజాగా అతడు మళ్లీ తడబడుతున్నాడు. చెన్నైలో భారత్ తో జరిగిన మ్యాచ్లో 46 పరుగులు చేసిన స్మిత్.. తర్వాత సఫారీలతో మ్యాచ్లో 19 పరుగులే చేయగలిగాడు. శ్రీలంకతో మ్యాచ్లో డకౌట్ అయిన స్మిత్.. తాజాగా పాకిస్తాన్తో ఏడు పరుగులకే నిష్క్రమించాడు. గత పది వన్డేలలో స్మిత్ చేసింది ఒక్కటంటే ఒక్కటే అర్ధ సెంచరీ. వన్డేలలో స్మిత్ సెంచరీ చేసి ఏడాది దాటింది. వన్డేవరల్ కప్లో తొలుత వరుసగా రెండు మ్యాచ్లు ఆడిన ఆసీస్.. తర్వాత లంకతో నెగ్గినా స్మిత్ మాత్రం అదే మూడ్లో ఉన్నాడు. ఒకప్పుడు క్రీజులోకి వస్తే పాదరసంలా కదులుతూ వికెట్ల మధ్య పరిగెత్తే స్మిత్లో ప్రస్తుతం ఆ జోరు కనిపించడం లేదు. గతంలో పూర్తి ఆత్మవిశ్వాసంతో బ్యాటింగ్ చేసే స్మిత్ కళ్లల్లో ఇప్పుడు నిరాశ, నిస్పృహలు కొట్టొచ్చినట్టు కనిపిస్తున్నాయి. ఈ ఏడాది వన్డేలలో 9 ఇన్నింగ్స్ ఆడిన స్మిత్.. 23.22 సగటుతో 209 పరుగులు మాత్రమే చేయగలిగాడు. ఇందులో ఒక అర్ధ సెంచరీ మాత్రమే ఉండగా మూడుసార్లు డకౌట్ అయ్యాడు. యువ ఆటగాళ్లు అవకాశాల కోసం ఎదురుచూస్తున్న తరుణంలో స్మిత్ ఇదే ఆట కొనసాగిస్తే మరో రెండేళ్లు అయినా ఆడాల్సిన అతడి వన్డే కెరీర్ వరల్ కప్ తర్వాత ముగిసినా ఆశ్చర్య పోవాల్సిందేమీ లేదని క్రికెట్ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.



## బోల్డ్ రోల్స్‌తో కియారా ఆలోచనల్లో ఛేంజ్!

కియారా అద్వాణీ టాలీవుడ్.. బాలీవుడ్ చిత్రాలతో బిజీ నాయికగా కొనసాగుతోన్న సంగతి తెలిసిందే. హిందీ పరిశ్రమలో డై బై డే షైన్ అవుతూ దూసుకుపోతుంది. వైవిధ్యమైన పాత్రలతో తనకంటూ ఓ ప్రత్యేకతని క్రియేట్ చేసుకుంటుంది. కరీనా కపూర్.. కత్రినాకైఫ్.. దీపికా పదుకొణే లాంటి సీనియర్ భామలున్నా! వాళ్లతో పోటీ పడి అవకాశాలు అందుకుంటుంది. ఇక బ్యూటీ తనలో బోల్ నెస్ కెరీర్ ఆరంభంలోనే నిరూపించిన సంగతి తెలిసిందే. 'లస్ట్ స్టోరీస్'లో బోల్ అటెంప్ట్ చేసి సక్సెస్ అయింది. అటుపై 'కబీర్ సింగ్'లో అంతే బోల్‌గా నటించి తానేంటో మరోసారి నిరూపించింది. దర్శకుల నటినని ఆరంభంలోనే చాటి చెప్పింది. అయితే ఇలా కెరీర్ ఆరంభంలోనే ఇలాంటి రోల్స్ చేయడం ఎంతో పరిణితి చెందిన అంశంగా పేర్కొంది. 'మొదట్లో కథను ఎంచుకునే విషయంలో చాలా కష్టం అనిపించేది. ఇప్పటికీ కూడా అలాగే అనిపిస్తుంది (నవ్వుతూ). దాని ద్వారా ఎన్నో విమర్శలు ఎదుర్కున్నాను. ఏది చేసినా కొంచెం భిన్నంగా చేయాలనే ఆలోచనతో నాకు తొచిన నిర్ణయాలు తీసుకుంటాను. 'లస్ట్ స్టోరీస్'.. 'కబీర్ సింగ్' పాత్రలకు ప్రశంసలతో పాటు విమర్శలు ఎదుర్కొన్నాను. కానీ ఆ పాత్రల ఎంపిక ద్వారా నాలో ఆలోచనా విధానం ఎలా ఉందని తెలిసింది. ఈ పాత్రలు నాకు చాలా సంతృప్తినిచ్చాయి. ఎలాంటి పాత్రలు ఎంచుకోవాలి అన్న దానిపై ఓ క్లారిటీ వచ్చింది. ప్రస్తుతం వ్యక్తిగత జీవితంలో ఎంతో సంతోషంగా ఉన్నాను. పెళ్లి కాక ముందు నుంచే సిద్దార్థ్.. నేను మా బంధాన్ని కాపాడుకోవాలనుకున్నాం. కానీ ఇప్పుడు నటీనటులుగా మాకున్న గుర్తింపును కాపాడుకోవడంపై దృష్టి పెట్టాం. సినీ రంగంలో మాకు ఓమంచి స్థానాన్ని ఏర్పరుచుకున్నాం. దీని కోసం మేము చాలా కష్టపడ్డాం. మావ్యక్తిగత జీవితంపై దృష్టి పెట్టి ప్రేక్షకుల అభిమానానికి దూరంగా ఉండాలనుకోవడం లేదు. మాపై వారికున్న ప్రేమ ఎప్పటికీ అలాగే ఉండాలని కోరుకుంటున్నా' అని అంది.



## పవన్ కళ్యాణ్‌పై బోయపాటి ఇంట్రెస్టింగ్ కామెంట్స్!

మాస్ యాక్షన్ ఎంటర్టైనర్‌లతో అలరించే డైరెక్టర్ బోయపాటి శ్రీను. ఇటీవల ఆయన దర్శకత్వంలో తెరకెక్కిన స్కంద చిత్రం బాక్సాఫీస్ వద్ద యావరేజ్‌గా నిలిచింది. అయితే ఈ డైరెక్టర్ ప్రముఖ టాలీవుడ్ స్టార్ అయిన పవన్ కళ్యాణ్‌పై ఇటీవల ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. అవి ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. పవన్ కళ్యాణ్ అనే వ్యక్తి ఫిల్టర్ లేని వాడు, ఎది అనుకుంటే అది చేస్తాడు. ఎక్కడ మంచి ఉంటే అక్కడ నిలబడతాడు. ఎక్కడ నిజాయితీ ఉంటే అక్కడ ఉంటాడు. న్యాయం ఉన్న చోట అడ్డ సుడిగా నిలబడతాడు అంటూ చెప్పుకొచ్చారు. అయితే బోయపాటి శ్రీను చేసిన ఈ కామెంట్స్ వైరల్ అవుతున్నాయి. పవన్ కళ్యాణ్ హరిహర వీరమల్లు, ఉస్తాద్ భగత్ సింగ్, ఓజి చిత్రాల్లో నటిస్తున్నారు. అయితే రాజకీయాల్లో బిజీగా ఉండటంతో వీటి రిలీజ్‌లపై ఎటువంటి క్లారిటీ లేదు.



మనం సినిమా
manamcinema

## గ్రాండ్‌గా కళ్యాణ్ రామ్ 21 మూవీ లాంచ్




యువ నటుడు నందమూరి కళ్యాణ్ రామ్ ఇటీవల అమిగోస్ మూవీ ద్వారా ఆడియన్స్ ముందుకి వచ్చారు. అయితే అది ఆశించిన స్థాయి సక్సెస్ సొంతం చేసుకోలేకపోయింది. ఇక ప్రస్తుతం డెవిల్ ది సీక్రెట్ బ్రిటిష్ ఏజెంట్ అనే మూవీ చేస్తున్న కళ్యాణ్ రామ్ తాజాగా తన కెరీర్ 21వ మూవీని కూడా ఒప్పుకున్నారు. ఈ మూవీ యొక్క అధికారిక పూజా కార్యక్రమాలతో కూడిన గ్రాండ్ లాంచ్ ఈవెంట్ హైదరాబాద్‌లో ఎంతో వైభవంగా జరిగింది. ఈమూవీని అశోక క్రియేషన్స్, ఎన్టీఆర్ ఆరట్స్ సంస్థలు కలిసి భారీగా నిర్మిస్తున్నాయి. గతంలో నారా రోహిత్, నందమూరి తారకరత్న ప్రధాన పాత్రల్లో తెరకెక్కిన రాజా చెయ్యి వేస్తే మూవీకి దర్శకత్వం వహించిన ప్రదీప్ చిలుకూరి ఈ మూవీని తెరకెక్కించబోతున్నారు. విషయం ఏమిటంటే లేడీ సూపర్ స్టార్ విజయశాంతి ఈ మూవీలో కీలక పాత్ర చేయనున్నారు. కాగా గ్రాండ్ లాంచ్ ఈవెంట్‌కి టీమ్‌తో పాటు ఆమె కూడా ప్రత్యేకంగా విచ్చేసారు. ఈ మూవీ యొక్క రెగ్యులర్ షూట్ త్వరలో ప్రారంభం కానుండగా ఇందులో కళ్యాణ్ రామ్‌కి జోడీగా సాయి మంజ్రేకర్ నటించనున్నారు. అజనీష్ లోకనాథ్ సంగీతం అందించనున్న ఈ మూవీ గురించిన మరిన్ని వివరాలు అతి త్వరలో వెల్లడి కానున్నాయి.




Printed and Published by VUPPARI RAMESH KUMAR on behalf of Navatharam Publications Private Limited, Printed at Nava Telangana Printers Private Limited, Near Manair Hanuman Temple, Godhavarikhani Bypass Road, Housing Board Colony, Karimnagar. 505001, Telangana. Published From H.No:6-3-864/4/B, SBN Arcade, 2nd Floor, Green lands, Opp: Green Park Hotel, Hyderabad - 500016 Telangana State, EDITOR: VUPPARI RAMESH KUMAR. RNI Reg No.TELTEL/2017/73893. E-mail Id: editor@manamnews.com.